సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 282

మంగళవారం 25-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



ఆసీస్‌పై అజేయంగా..
24 పరుగుల తేడాతో విజయం.. వరల్డ్ కప్ సెమీ ఫైనల్లోకి టీమిండియా - 12లో



నష్టాల్లోంచి లాభాల్లోకి..
ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్.. ఆటో, విద్యుత్ షేర్లకు డిమాండ్ - 13లో




కేజ్రీవాల్‌కు దక్కని ఊరట
రెగ్యులర్ బెయిల్‌పై హైకోర్టు ఉత్తర్వులు వెలువడిన తర్వాతే కేజ్రీవాల్ పిటిషన్‌పై తాము విచారణ చేపడతామని సుప్రీం తెలిపింది.
వివరాలు 6లో ▸



రాజ్యసభ నేతగా జేపీ నడ్డా
బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా రాజ్యసభాపక్ష నేతగా నియమితులయ్యారు.
వివరాలు 6లో ▸



రష్యాలో మరో ఉగ్రఘాతుకం
రష్యాలో చర్చిలు, యూదు ప్రార్థనా మందిరంపై ఉగ్రవాదులు చేసిన దాడిలో 15 మంది పోలీసులు సహా 20 మంది మరణించారు.
వివరాలు 6లో ▸



బ్యాటరీ ఫ్యాక్టరీలో పేలుడు
దక్షిణ కొరియాలోని లిథియం బ్యాటరీ కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో 22 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸

'ఎమర్జెన్సీ' మాయని మచ్చ

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ మండిపాటు

- దేశాన్ని జైలుగా మార్చిన రోజులను కొత్తతరం మర్చిపోదు
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు పౌరులంతా తీర్మానం చేయాలి
- ఆనాటి రోజులు పునరావృతం కాకూడదు
- వరుసగా మూడోసారి నెగ్గడంతో మా బాధ్యత మూడురెట్లు పెరిగింది
- ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- సభలో నినాదాలు కాదు.. అర్థవంతమైన చర్చలు జరగాలి
- 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు ఎంపీలంతా కలిసి పనిచేయాలి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఎమర్జెన్సీ నాటి రోజులు భారతదేశ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. ఎమర్జెన్సీ పాలనకు మంగళవారం నాటికి 50 ఏళ్లు పూర్తవుతాయని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని అణిచివేసి, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా తిరస్కరించి, దేశాన్ని జైలుగా మార్చిన ఆ రోజులను దేశంలోని కొత్త తరం ఎన్నటికీ మర్చిపోదని అన్నారు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుకొనేందుకు పౌరులంతా తీర్మానం చేయాలని కోరారు. తద్వారా అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని ప్రకటించారు. రాజ్యాంగం ప్రకారం సామాన్య ప్రజల కలలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు. 18వ లోక్‌సభ సమావేశాల ప్రారంభానికి ముందు సోమవారం ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు దేశ ప్రజలకు

మిగతా 6వ పేజీలో ▶

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలి

" ప్రతిపక్షాల బాధ్యతను ప్రధాని మోదీ గుర్తుచేశారు. ప్రజలు బాధ్యతాయుతమైన ప్రతిపక్షాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య గౌరవాన్ని కాపాడుతూ, ప్రతిపక్షాలు వాటి పాత్రను పూర్తిస్థాయిలో పోషించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకుంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సభలో నినాదాలకు బదులు అర్థవంతమైన చర్చలను ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఎంపీలందరూ సామాన్య ప్రజల అంచనాలను అధిగమించేందుకు ప్రయత్నించాలని మోదీ సూచించారు.

రాజ్యాంగం వర్ధిల్లాలి

పార్లమెంట్ ప్రాంగణంలో 'ఇండియా' ఎంపీల నినాదాలు



6లో

పదేళ్లపాటు మోదీ అప్రకటిత ఎమర్జెన్సీ

- నైతికంగా ఓడినా మోదీలో అహంకారం తగ్గలేదు
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

6లో

ఎంపీల ప్రమాణ స్వీకారం

- తొలుత ప్రధాని మోదీ.. తర్వాత ప్యానెల్ స్పీకర్లు, మంత్రులు..
- తర్వాత అక్షరమాల ప్రకారం రాష్ట్రాలవారీగా సభ్యుల ప్రమాణం

పులివెందులలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

- మనం చేసిన మంచి అందరికీ తెలుసు
- తప్పకుండా ప్రజలు మళ్లీ మన వైపే చూస్తారు
- నేతలు, కార్యకర్తలతో మాటామంతి
- మూడో రోజు ప్రజలతో మమేకం

2లో

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో మూడవ రోజు సోమవారం కూడా బిజీబిజీగా గడిపారు. వివిధ ప్రాంతాల నుంచి క్యాంపు కార్యాలయానికి భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకుని వినతి పత్రాలను స్వీకరించారు.

న్యూస్‌రీల్

అదుపులోకి రాని డయేరియా



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో డయేరియా ఇంకా అదుపులోకి రాలేదు. సోమవారం జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన 11 మంది వాంతులు, విరేచనాలతో ప్రభుత్వాస్పత్రిలో చేరారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలో ఓ వృద్ధురాలు కూడా డయేరియా బారినపడి మరణించింది.
వివరాలు 5లో ▸

మంత్రి అనగాని ఇలాకాలో శ్రుతిమించిన దౌర్జన్యం



బాపట్ల జిల్లా రాంభొట్లవారిపాలెంలోని వైఎస్సార్‌సీపీ నేత రాజ్‌కుమార్‌పై మంత్రి అనగాని అనుచరులు దాడి చేసి కులం పేరుతో దూషించి కొట్టి గాయపరిచారు. చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారు.
వివరాలు 10లో ▸

కొనసాగుతున్న కక్ష సాధింపు



రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై టీడీపీ సర్కారు కక్షగట్టింది. తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఇటీవల కూల్చి వేయగా.. తాజాగా విజయవాడ విద్యాధరపురంలోని ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చేయడానికి పావులు కదుపుతోంది.
వివరాలు 2లో ▸

సచివాలయ ఉద్యోగులతో ఇంటికే పింఛన్లు

రాష్ట్ర మంత్రి మండలి తొలి సమావేశంలో నిర్ణయం

- 16,347 టీచర్ పోస్టులతో డీఎస్సీకి ఆమోదం
- 28 నుంచి దశల వారీగా 7 శ్వేత పత్రాల విడుదల
- ఆగస్టులో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం
- గంజాయి నియంత్రణకు ఐదుగురు మంత్రులతో కమిటీ
- పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య పనులకు ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దాదాపు 65 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటివద్దే పెన్షన్లు పంపిణీ చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఈమేరకు జూలై 1వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించేందుకు ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమ వారం సచివాలయంలో మంత్రి మండలి తొలిసారిగా సమావేశమైంది. బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఎం చంద్రబాబు తొలి సంతకాలు చేసిన ఐదు ఫైళ్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అనంతరం మంత్రి మండలి నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి విలేకరులకు వెల్లడించారు. డీఎస్సీ 2024 ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఎస్జీటీ 6,371, పీఈటీ 132, స్కూల్ అసిస్టెంట్లు 7,725, టీజీటీ 1,781, పీజీటీ 286, ప్రిన్సిపాల్స్ 52 పోస్టులను భర్తీ చేయనున్నారు. డీఎస్సీ ఇకపై నిరంతర ప్రక్రియగా ఏటా నిర్వహించాలని

మిగతా 3వ పేజీలో ▶

ప్రసారాల నిలిపివేత పత్రికా స్వేచ్ఛకు ముప్పే

సంపాదకీయ స్వేచ్ఛపై జోక్యం తగదు

న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అథారిటీ

- వివరాలు 2లో

స్వామి భూములు స్వాహా!

- విజయనగరం జిల్లాలో దేవుడి భూములకు టీడీపీ నేతల శఠగోపం
- సిరిపురంలోని శ్రీమన్నార్ రాజగోపాలస్వామి దేవస్థానం భూములకు ఎసరు
- 48 ఎకరాలను గుప్పెటపట్టిన తమ్ముళ్లు
- భూముల క్రయవిక్రయాలకు ప్రయత్నాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

2లో



దేవుడికే టీడీపీ నాయకులు శఠగోపం పెట్టేశారు. దేవుడి భూములను ఆక్రమించి ఫలసాయం పొందడంతో పాటు వాటి విక్రయాలకు తెగబడుతున్నారు. ఈ విషయం దేవదాయశాఖ అధికారులకు తెలిసినా ప్రేక్షకపాత్రకే పరిమితమవడం చర్చనీయాంశంగా మారింది.

ఉపముఖ్యమంత్రి పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సినీ నిర్మాత అశ్వనీదత్



పవన్ కళ్యాణ్‌తో సినీ నిర్మాతల భేటీ

సినీ పరిశ్రమ సమస్యలపై చర్చించాం

- పూర్తి స్థాయిలో చర్చించేందుకు మరోసారి సమావేశం
- సీఎంను అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరాం: అల్లు అరవింద్

సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో తెలుగు సినిమా నిర్మాతలు సోమవారం సమావేశమయ్యారు. విజయవాడలోని పవన్ కళ్యాణ్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో సినిమా రంగానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేశ్, నిర్మాతలు

మిగతా 2వ పేజీలో ▶

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

బంగాళాఖాతంలో ఈ నెల 26న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెప్పారు. ఈ ప్రభావంతో 26వ తేదీ సాయంత్రం నుంచి ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో ముసురు వాతావరణం ఏర్పడనుంది.

14లో



ఉద్యో'గాలం'టూ..!

- సైబర్ నేరగాళ్ల మాయ
- యువతే లక్ష్యంగా మోసాలు
- రూ.వేల నుంచి రూ.లక్షల్లో దోపిడీ
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- స్టేషన్ మెట్లెక్కని కేసులెన్నో..!



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): యువతే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు. ఉద్యోగాల పేరిట గాలం విసిరి రూ.లక్షల్లో దోచేస్తున్నారు. పార్ట్‌టైం జాబ్‌లంటూ మోసం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికలపై ఆన్‌లైన్ నకిలీ ప్రకటనలతో గారడీ చేసి బ్యాంకు ఖాతాలు లూటీ చేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది చదువుకున్న వారే. పలు ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, ఇంజినీరింగ్ వంటి సాంకేతిక విద్యనభ్యసించిన నిరుద్యోగులే ఎక్కువగా ఉండడం గమనార్హం.

మన బయోడేటా సేకరించి కాల్స్

ప్రముఖ ఆన్‌లైన్ జాబ్ సెర్చ్ ఇంజిన్లలో మనం ఇచ్చిన బయోడేటా ఆధారంగా సమాచారం సేకరించి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జాబ్ కన్సల్టెన్సీ ముసుగులో ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న వారికి మెయిళ్లు పంపిస్తారు. అవసరమైతే కాల్ చేస్తారు. ఇంటర్వ్యూ పేరుతో మోసం చేస్తారు. రకరకాల ప్రశ్నలు వేసి సమాచారాన్ని రాబడతారు. జాబ్ వచ్చేసినట్టే నమ్మిస్తారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజులు, యూనిఫాం అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో దోచుకుంటారు.

వర్క్ ఫ్రం హోం పేరుతో..

చాలా మంది ఎక్కువగా ఇంటి వద్ద ఉంటూ పని చేయడానికే ఇష్టపడతారు. జాబ్ స్కామ్ చేసేవాళ్లు వీరినే ఎక్కువగా టార్గెట్ చేసుకుంటున్నట్టు పోలీసులు చెబుతున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతోనే నెలకు వేలాది రూపాయలు సంపాదించ వచ్చని నమ్మించి నగదు దోచేసి మాయమవుతారు.

డేటా ఎంట్రీ పేరిట మోసం.. బ్లాక్‌మెయిల్

కొందరైతే డేటా ఎంట్రీ పని ఉందని, ఎక్కువ స్కిల్స్ అవసరం లేదని, చాలా ఎక్కువ డబ్బులిస్తామని నమ్మిస్తారు. ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో అడ్వాన్స్ పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులు ఉన్నాయని, దాని వల్ల సంస్థ నష్టపోయిందని, పరిహారం చెల్లించాలని, లేకుంటే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళతామని బెదిరించి అధిక మొత్తంలో తిరిగి డబ్బులు వసూలు చేస్తారు.

నకిలీలను ఇలా గుర్తించాలి..

- ఉద్యోగ ప్రకటనలు అన్నీ నిజం కావు అనే సత్యాన్ని గ్రహించాలి
- సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు వసూలు చేయవు
- ప్రకటనల్లో ఉపయోగించే లోగోలు, లెటర్లను ఒకటికి రెండుసార్లు గమనించాలి
- అసలైన సంస్థలు ఎప్పుడూ ఈ-మెయిల్ ద్వారానే సమాచారం ఇస్తాయి. కానీ జాబ్ స్కామ్/ఫ్రాడ్ చేసేవారు పంపే మెయిళ్లు గమనిస్తే కాస్త తేడాగా ఉంటాయి
- జాబ్ స్కామ్ వారు ఇచ్చే ఉద్యోగ ప్రకటనల్లో గానీ, ఈ-మెయిల్స్‌లో గానీ ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా అస్పష్టంగా ఉంటుంది.
- క్విక్ మనీ, అన్ లిమిటెడ్ ఎర్నింగ్స్, ఎలాంటి టెక్నికల్ స్కిల్స్ అవసరం లేదు అనే పదాలు చూసిన వెంటనే అప్రమత్తం కావాలి.
- ఒక చట్టబద్ధమైన సంస్థ ఎప్పుడూ ఇలాంటివి చేయదన్నది గ్రహించాలి.
- ఈ తరహా మోసాలకు గురయ్యేవారు 1930 సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి. లేదా మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి.



క్లుప్తంగా...

బాధ్యతలు స్వీకరించిన గవర్నర్ కార్యదర్శి

సాక్షి, అమరావతి: గవర్నర్ కార్యదర్శిగా ఎం.హరిజవహర్‌లాల్ విజయవాడ రాజ్‌భవన్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

గోపాలకృష్ణ ద్వివేది బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీస్, బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన తక్షణమే ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ద్వివేది స్థానంలో పశుసంవర్ధక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఎంఎం నాయక్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

27న రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈ డే ఉత్సవాలు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ ఎంఎస్‌ఎంఈ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఈ నెల 27న ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్(ఫాప్సియా) సంయుక్తంగా విజయవాడలోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్కులో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

ఏపీ ఈసెట్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏపీ ఈసెట్ ప్రవేశాల ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 26 నుంచి జూలై 8లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేలా సాంకేతిక విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. అడ్మిషన్ల కన్వీనర్ డాక్టర్ నవ్య సోమవారం మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ నెల 26 నుంచి 30లోగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 27నుంచి జూలై 3 వరకు ధ్రువపత్రాల అప్‌లోడ్, జూలై 1 నుంచి 4వరకు ఆప్షన్ల ఎంపిక, 5న ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. జూలై 8న తుది కేటాయింపు పూర్తి చేస్తామన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు 9 నుంచి 15లోగా కళాశాలల్లో రిపోర్టు చేయాలని, 10 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ప్రస్తుత కౌన్సెలింగ్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. అగ్రికల్చర్ డిప్లొమా అభ్యర్థులు తదుపరి దశలో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఫార్మసీ డిప్లొమా అభ్యర్థులకు ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించారు.

జూలై నుంచి రాగులు పంపిణీ

సాక్షి, అమరావతి: ప్రస్తుతం రాయలసీమలో మాత్రమే పంపిణీ చేస్తున్న రాగులను జూలై నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ సోమవారం తెలిపారు. ప్రతీ కార్డుదారుడికి 3 కిలోల బియ్యం బదులు రాగులు అందిస్తామన్నారు. అలాగే, జొన్నల పంపిణీని శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూడా చేపడతామన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 251 మండల స్థాయి నిల్వ కేంద్రాల్లో తూనికలు, కొలతలు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి 189 మంది సరఫరాదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

20 లక్షల ఉద్యోగాలకు వార్షిక క్యాలెండర్ ప్రకటించాలి

- ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలకు వార్షిక క్యాలెండర్ ప్రకటించి, వాటికి సంబంధించిన స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇవ్వాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఉద్యోగ వయో పరిమితిని కోల్పోయిన ఏపీపీఎస్సీ, ఏపీ డీఎస్సీ జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్లకు అర్హత వయస్సును పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'కల్కి' టికెట్ల ధర పెంపు

సాక్షి, అమరావతి: ప్రభాస్ నటించిన కల్కి సినిమా టికెట్ల ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. మల్టీప్లెక్స్‌లలో టికెట్‌పై రూ.125, సాధారణ థియేటర్‌లలో టికెట్‌పై రూ.75 పెంచుకునేందుకు అనుమతి మంజూరు చేసింది. దీంతో పాటు ప్రతి థియేటర్‌లో ఐదు షో లు వేసుకునేందుకు ప్రత్యేక అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పవన్ కళ్యాణ్‌తో సినీ నిర్మాతల భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

సి.అశ్వినీదత్, అల్లు అరవింద్, ఏఎం రత్నం, ఎస్.రాధాకృష్ణ, దిల్ రాజు, భోగవల్లి ప్రసాద్, డీవీవీ దానయ్య, సుప్రియ, ఎస్కే ప్రసాద్, బన్ని వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టీజీ విశ్వ ప్రసాద్, వంశీకృష్ణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. అల్లు అరవింద్ మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పవన్ కళ్యాణ్‌కు వివరించామని చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమ తరఫున ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరామన్నారు. సినీ రంగ సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చించేందుకు మరోసారి సమావేశమవుతామని చెప్పారు.





పులివెందులలో బాధితుల సమస్యలు వింటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్ జగన్ వెంట పెద్ద ఎత్తున తరలివస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు, యువకులు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్
- మనం చేసిన మంచి అందరికీ తెలుసు
- తప్పకుండా ప్రజలు మళ్లీ మన వైపే చూస్తారు
- నేతలు, కార్యకర్తలతో మాటామంతి.. మూడో రోజూ ప్రజలతో మమేకం



పార్టీ నేతలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

సాక్షి కడప: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో మూడవ రోజు సోమవారం కూడా బిజీబిజీగా గడిపారు. వివిధ ప్రాంతాల నుంచి క్యాంపు కార్యాలయానికి భారీగా తరలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్ పులివెందులలో ఉన్నారని తెలుసుకుని రాయలసీమలోని ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. అందరితోనూ ఓపికగా మాట్లాడారు. పలువురు నేతలను పేరుపేరునా పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కార్యాలయ ఆవరణలో ఎక్కడ చూసినా జనం భారీగా కనిపించారు. 'వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది. మనం చేసిన మంచి అందరికీ తెలుసు. ప్రజల గుండెల్లో ఉండిపోయింది. తప్పకుండా ప్రజలు మళ్లీ మన వైపే చూస్తారు. ఎవ్వరూ అధైర్యపడొద్దు. అండగా ఉంటాం' అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు.

రెండు కుటుంబాలకు పరామర్శ

పులివెందుల నారాయణ పాఠశాల సమీపంలోని పురుషోత్తం నగర్‌లో నివాసముంటున్న దివంగత మాజీ ఎమ్మెల్యే పురుషోత్తమరెడ్డి కుమారుడు మైఖేల్ వర్ధంతి కార్యక్రమం ఇటీవల జరిగింది. అప్పట్లో రాలేక పోయిన వైఎస్ జగన్.. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి సోమవారం ఉదయం మైఖేల్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మైఖేల్ సతీమణి అమూల్యారాణి, కుమారుడు వినీత్‌లను ఓదార్చారు. సమీప బంధువు సర్రెడ్డి సంగిరెడ్డి మృతి చెందారని తెలిసి మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వారి ఇంటికి వెళ్లారు. వైఎస్ జగన్‌తో పాటు ఆయన సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డిలు నివాళులర్పించారు. భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి.. సంగిరెడ్డి భార్య సత్యవతి, కుమారులు సుధాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డిలను జగన్ దంపతులు ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు చవ్వా సుదర్శన్‌రెడ్డి, మిట్టా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మూడు రోజుల పులివెందుల పర్యటన ముగించుకుని బెంగళూరు బయలుదేరి వెళ్లారు.

మరోసారి విషం కక్కిన ఎల్లో మీడియా

సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లో మీడియా మరోసారి అక్కసు వెళ్లగక్కింది. వైఎస్ జగన్‌పై కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారని ఒక మార్ఫింగ్ వీడియోను వదిలారు. వైఎస్ జగన్ సోమవారం పులివెందుల పర్యటన ముగించుకుని బెంగళూరుకు చేరుకున్నారు. తమ అభిమాన నాయకుడు ఇక్కడికి వచ్చారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఆయన నివాసం వద్దకు వందలాదిగా చేరుకున్నారు. జగన్‌తో మాట్లాడాలని, ఫొటో దిగాలని పెద్ద సంఖ్యలో యువకులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంటి వద్దకు 'జై జగన్, జోహార్ వైఎస్సార్' అంటూ నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. ఇది గిట్టని ఎల్లో మీడియా కొద్ది గంటల్లోనే ఈ వీడియోలోని వాయిస్‌ను మార్చి 'జగన్ డౌన్ డౌన్..' అన్నారని నిస్సిగ్గుగా విషం కక్కింది. పులివెందులలో సైతం ఇదే రీతిలో దుష్ప్రచారం చేసి భంగపడింది. అయినా పద్ధతి మార్చుకోక బెంగళూరులోనూ అదే వైఖరి ప్రదర్శించి అభాసుపాలైంది.



వైఎస్సార్ సమీప బంధువు సంగిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం భారీగా తరలివచ్చిన అభిమానులు, ప్రజలు



మైఖేల్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కొనసాగుతున్న కక్ష సాధింపు

- వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై టీడీపీ సర్కారు అక్కసు
- ఎక్కడికక్కడ కూల్చేయాలని కుట్ర
- పాత తేదీతో నోటీసు ఇస్తామన్న విజయవాడ కార్పొరేషన్ అధికారులు
- ఒప్పుకోక పోవడంతో తాజాగా నోటీసు
- విజయనగరం, ఆదోని పార్టీ కార్యాలయాలకూ హెచ్చరికలు



ఆదోనిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న పార్టీ నాయికులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ)/విజయనగరం/ఆదోని టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై టీడీపీ సర్కారు కక్షగట్టింది. గతం మరచిపోయి కక్ష సాధింపు చర్యలను కొనసాగిస్తోంది. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని ఇటీవల చీకటిలో కూల్చి వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ విద్యాధరపురంలోని లేబర్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని కూల్చేయడానికి పావులు కదుపుతోంది. ఇందుకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి, పార్టీ ఆఫీస్ నిర్మాణానికి సంబంధించిన సిబ్బందికి మధ్య జరిగిన సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'విద్యాధరపురం లేబర్‌కాలనీ పార్టీ ఆఫీసుకు పాత తేదీలతో (గత నెలలో) నోటీసులు ఇస్తాం. దాని వల్ల మీకు ఇబ్బంది ఏమీ ఉండదు. మీరు ఒప్పుకుంటే రేపు తెల్లవారుజామున 5 గంటలకు వచ్చి నోటీస్ ఇచ్చి వెళిపోతా. అధికారులు మాపై ఒత్తిడి తెస్తున్నారు' అని కార్పొరేషన్‌కు చెందిన సిబ్బంది ఒకరు పార్టీ కార్యాలయం సంబంధికునికి ఫోన్ చేశారు. ఇందుకు ఇటు వైపు నుంచి సమాధానమిస్తూ 'అలా ఎలా తీసుకుంటాం.. మీరు ఎప్పుడు నోటీస్ ఇస్తే ఆ రోజు తేదీ వేసి ఇవ్వండి. అది కూడా సైట్ దగ్గరకు వచ్చి నోటీస్ ఇస్తే తీసుకుంటాం. ఆ విషయాన్ని మాపై వారికి తెలియజేస్తాం' అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్.. అనుమతి లేకుండా పార్టీ కార్యాలయం నిర్మిస్తున్నారని సోమవారం నోటీస్ జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన మురికి కుంటను పూడ్చేసి, అధికారుల అనుమతితోనే నిర్మాణం చేపట్టినప్పటికీ టీడీపీ సర్కారు కక్షగట్టి వ్యవహరిస్తోంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మహారాజుపేటలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నిర్మాణం అక్రమమని టౌన్ ప్లానింగ్ అధికారి ఫిలిప్ సోమవారం నోటీసు జారీ చేశారు. అనుమతి లేకుండా నిర్మిస్తున్నందున తక్షణమే పనులు ఆపేసి, ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. లేని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా ఆదోనిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయ నిర్మాణం అక్రమమని బీజేపీ నాయకుడు నాగరాజుగౌడ్, టీడీపీ నేత ఉమ్మి సలీంతో పాటు మరో ఇద్దరు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తగిన సమాధానం ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారులు పార్టీ కార్యాలయానికి నోటీసు జారీ చేశారు.


ప్రసారాల నిలిపివేత పత్రికా స్వేచ్ఛకు ముప్పే

- సంపాదకీయ స్వేచ్ఛపై జోక్యం తగదు
- సాక్షి, టీవీ9, ఎన్టీవీ, 10టీవీ చానళ్ల ప్రసారాల నిలిపివేతపై న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ డిజిటల్ అథారిటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి తదితర చానళ్ల ప్రసారాల నిలిపివేత పత్రికా స్వేచ్ఛకు ముప్పేనని న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అథారిటీ (ఎన్‌బీడీఏ) స్పష్టం చేసింది. సంపాదకీయ స్వేచ్ఛపై జోక్యం తగదని పేర్కొంది. సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ ప్రసారాలను కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ నిలిపివేయడం ఆశ్చర్యానికి గురిచేసిందని వెల్లడించింది. ఎలాంటి కారణాలు లేకుండా ఆయా చానళ్ల ప్రసారాల నిలిపివేత ట్రాయ్ నిబంధనలకు విరుద్ధమని తెలిపింది. తక్షణమే ఏపీ ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ప్రజాస్వామ్యంలో వేర్వేరు వనరుల ద్వారా సమాచారం పొందడం ప్రజల మౌలిక హక్కు అని పేర్కొంది. మీడియా గొంతు నొక్కేలా చేసే ఏ ప్రయత్నాన్నైనా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని కోరింది. ఈ మేరకు ఎన్‌బీడీఏ ప్రధాన కార్యదర్శి అన్నీ జోసెఫ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సాక్షితోపాటు పలు చానళ్లను కేబుల్ టీవీ ఆపరేటర్స్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ విషయం ఎన్‌బీడీఏ దృష్టికి వెళ్లడంతో ఆ సంస్థ ఈ మేరకు స్పందించింది. కొందరు కేబుల్ ఆపరేటర్లు తీసుకున్న ఈ చర్య ప్రసారకర్తలు, మీడియా, ప్రజల ప్రయోజనాల కోసం కాదని స్పష్టం చేసింది. ప్రసారకర్తలకు ఏం ప్రసారం చేయాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉందని.. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని పేర్కొంది. ఈ తరహా జోక్యం మీడియా స్వతంత్రతను కోల్పోయేలా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఏపీలో మీడియా స్వేచ్ఛగా, స్వతంత్రంగా వ్యవహరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది.

స్వామి భూములు స్వాహా!

- విజయనగరం జిల్లాలో దేవుడి భూములకు టీడీపీ నేతల శఠగోపం
- సిరిపురంలోని శ్రీమన్నార్ రాజగోపాలస్వామి దేవస్థానం భూములకు ఎసరు
- 48 ఎకరాలను గుప్పెటపట్టిన తమ్ముళ్లు.. భూముల క్రయవిక్రయాలకు ప్రయత్నాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



శ్రీమన్నార్ రాజగోపాలస్వామి దేవస్థానం భూములు

గంట్యాడ: దేవుడికే టీడీపీ నాయకులు శఠగోపం పెట్టేశారు. దేవుడి భూములను ఆక్రమించి ఫలసాయం పొందడంతో పాటు వాటి విక్రయాలకు తెగబడుతున్నారు. ఈ విషయం దేవదాయశాఖ అధికారులకు తెలిసినా ప్రేక్షకపాత్రకే పరిమితమవడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే..

విజయనగరం జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయానికి అదే జిల్లా గంట్యాడ మండలం సిరిపురం గ్రామంలో 48 ఎకరాల భూమి ఉంది. విజయనగరంలోని హుకుంపేటకు చెందిన అనసవ్వరప్పు జగన్నాథరావు తండ్రి రామమూర్తి పంతులు, అనసవరప్పు జగన్నాథ రాజగోపాలరావు తండ్రి శ్రీనివాస పంతులు శ్రీమన్నార్ రాజగోపాలస్వామివారి ధూప, దీప నైవేద్యాలు, జాతర నిర్వహణ, ఇతర ఖర్చుల కోసం 1929లో 48 ఎకరాల భూమిని రిజిస్టర్ చేశారు. డాక్యుమెంటేషన్ 1815 పేరిట 32 ఎకరాల పల్లపు భూమి, 16 ఎకరాల మెట్ట భూమిని అప్పగించారు. ఈ భూమి సర్వే నెంబర్ 95/15, 16, 17, 19, 21, 96/1, 3, 4, 97/20, 21, 23, 99/9, 10, 11, 12, 14, 15, 100/4, 5, 8, 9, 10, 140/3, 4, 9, 11, 12, 14 తదితర నంబర్లలో విస్తరించి ఉంది. దీని విలువ రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు ఉంటుందన్నది స్థానికుల మాట. దీనిపై టీడీపీ నేతల కన్నుపడింది. అంతే.. మొత్తం భూమిని తమ గుప్పెట్లోకి లాక్కున్నారు. ఏళ్ల తరబడి అనుభవించడంతో పాటు ఇప్పుడు అధికార బలంతో విక్రయాలకు సిద్ధపడ్డారు. కొందరైతే అందులో అక్రమ కట్టడాలు సైతం తలపెట్టారు. ఇంత జరుగుతున్నా దేవదాయ శాఖాధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.


ఆ రిజిస్ట్రేషన్లు చెల్లవు..

శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయానికి చెందిన 48 ఎకరాల భూమి సిరిపురం గ్రామ పరిసరాల్లో ఉంది. ఈ భూములన్నీ ఆలయానికి చెందినవే. పక్కా డాక్యుమెంట్లు ఉన్నాయి. శ్రీమన్నార్ రాజగోపాలస్వామి దేవస్థానానికి చెందిన భూములన్నీ మ్యానిసిప్ట్ డయాగ్లేట్ రిజిస్టర్ (ఎండీఆర్)లో దేవస్థానం భూములుగా నమోదై ఉన్నాయి. ఈ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు నిలిపివేశాం. అక్రమ రిజిస్ట్రేషన్లు చెల్లవు. కొనుగోలు చేసేవారే బాధ్యులవుతారు.

– శ్రీనివాస్, వీఆర్వో, సిరిపురం

న్యూస్ చానళ్లపై నిషేధం ఎత్తేయాలి

- ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగు న్యూస్ చానళ్లపై మల్టిపుల్ సిస్టమ్ ఆపరేటర్లు (ఎంఎస్‌వోలు) విధించిన అప్రకటిత ఆంక్షలను అంతర్జాతీయ సంస్థలు తప్పుపడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జే) ఈ అప్రకటిత నిషేధం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగిందని, ప్రసారాలు తిరిగి పునరుద్ధరించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బ్రస్సెల్ కేంద్రంగా ఉన్న ఆ సంస్థ సూచించిందని వెల్లడించారు. న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అథారిటీ (ఎన్‌బీడీఏ) కూడా ఈ అప్రకటిత నిషేధాన్ని ఖండించిందని తెలిపారు. కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తెచ్చి ప్రసారాలు నిలిపివేయడం టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నిబంధనలకు విరుద్ధమని చెప్పిందన్నారు. రాష్ట్రంలోని పాలకులు ఈ వ్యవహారంతో తమకేమీ సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ చర్యల కారణంగా అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ఇమేజ్ దెబ్బతిందని కృష్ణంరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణలో కొన్ని న్యూస్ చానళ్ల ప్రసారాలను అక్కడి కేబుల్ ఆపరేటర్లు నిలిపివేయడాన్ని చంద్రబాబు తప్పుపట్టారన్నారు. ఆ తప్పు ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతుంటే ఆయన తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ), 19(1) (జి) భావ ప్రకటనా స్వేచ్ఛకు హామీ ఇస్తోందని చెప్పిందని గుర్తు చేశారు. ప్రజాహితానికి సంబంధించిన సమాచారాన్ని ఇవ్వడానికి, తెలుసుకోవడానికి కూడా ఆ ఆర్టికల్ హామీ ఇస్తోందని తెలిపారు. కాబట్టి సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీలపై విధించిన అప్రకటిత నిషేధాన్ని వెంటనే తొలగించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులతో ఇంటికే పింఛన్లు

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి మండలి నిర్ణయించింది. టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్)ను కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా నియామకాల కంటే ముందే టీచర్లకు శిక్షణ డిసెంబర్ 10వతేదీ నుంచి ప్రారంభించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రస్తుత విద్యా విధానంతో పాటు జాతీయ విద్యా విధానాన్ని అధ్యయనం చేసే దిశగా అధికారులు సమాయత్తం కావాలని నిర్దేశించారు.


- ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టం 2022 (యాక్ట్ 27 ఆఫ్ 2023) రద్దు ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 'సరైన అవగాహన లేని టైటిలింగ్ రిజిస్ట్రేషన్ అధికారులు అనవసర సమస్యలు సృష్టిస్తారని గుర్తించాం. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన చట్టానికి, గత ప్రభుత్వం ఆమోదించిన చట్టానికి వైరుధ్యం ఉంది. రిజిస్ట్రేషన్, రెవెన్యూ, న్యాయ వ్యవస్థలను అస్తవ్యస్తం చేసే ఈ చట్టాన్ని రద్దు చేయాలని మంత్రిమండలి నిర్ణయించింది. భూయజమానులు ఒరిజినల్ డాక్యుమెంట్‌ను పొందే అవకాశాన్ని కల్పిస్తాం' అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.
- సామాజిక పెన్షన్లకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంగా పేరు మార్పు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లు గీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు తదితర పింఛన్ల మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెంచిన పింఛన్ మొత్తాన్ని ఏప్రిల్, మే, జూన్ బకాయిలతో కలిపి మొత్తంగా రూ.7 వేలను జూలై 1వ తేదీన సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటివద్దే అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. దివ్యాంగులు, క్షయ వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న పింఛన్ రూ. 3 వేల నుంచి రూ.6 వేలకు, పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఇస్తున్న రూ.5 వేల పింఛన్ రూ.15 వేలకు, కిడ్నీ, లివర్, బైలేట్రల్ ఎలిఫెంటాసిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇస్తున్న పింఛన్ రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెరగనుంది. డయాలసిస్, సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా, హెచ్ఐవీ తదితర బాధితులకు పెన్షన్ పంపిణీ డీబీటీ ద్వారా చేపట్టాలని మంత్రి మండలి నిర్ణయించింది. సామాజిక భద్రతా పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు రూ.819 కోట్ల అదనపు భారం పడనుంది. పెన్షన్ పెంపు నిర్ణయంతో 28 కేటగిరీలకు చెందిన దాదాపు 65.3 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం ఏడాదికి రూ.33 వేల కోట్లకు పైగా ఖర్చు చేయనుంది.
- ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సెన్సెస్ 2024 నిర్వహణకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఏటా దాదాపు 4.4 లక్షల మంది విద్యార్థులు పలు కోర్సులను పూర్తి చేసుకొని బయటకు వస్తున్నారు. డిమాండ్, సప్లై, అందుబాటులో ఉన్న సదుపాయాల ఆధారంగా స్కిల్ గ్యాప్‌ను అంచనా వేయడం, అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దే లక్ష్యంతో నైపుణ్య సర్వేను 3 నుంచి 4 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది.
- రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. తొలి దశలో 183 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించాలని నిర్ణయించింది.
- విజయవాడలోని డా.వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును డా.ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా తిరిగి మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. విదేశాలకు వెళ్లే వైద్య విద్యార్థులకు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఈమేరకు నిర్ణయం తీసుకుంది.
- రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి శ్రీనివాస్‌ను నియమిస్తూ తీసుకున్న నిర్ణయానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పూర్వ అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి రాజీనామాలను ఆమోదించింది.
- వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య పరిరక్షణ ఏర్పాట్లతో సమాయత్తం కావాలని మంత్రి వర్గానికి సీఎం చంద్రబాబు సూచించారు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య పనులను వెంటనే ప్రారంభించాలని, చివరి ఆయకట్టుకు కూడా నీరు అందించేలా కాల్వలు, చెరువుల్లో పూడిక, డెక్క తొలగించే కార్యక్రమాన్ని సత్వరమే చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్లు, రహదారులు గతుకులమయం అయినందున వెంటనే గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీకి ఆదేశాలిచ్చారు. మత్తు, మాదక ద్రవ్యాల నుంచి యువతను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందించేందుకు ఐదుగురు మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. విద్య, ఆరోగ్యం, హోం, ఎక్సైజ్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల మంత్రులు ఇందులో సభ్యులుగా ఉంటారు. వలంటీర్ల సేవలను ఏ విధంగా వినియోగించుకోవాలో ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ఓ ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు.

7 శ్వేత పత్రాలు

గత ప్రభుత్వం అనుసరించిన విధానాలపై అవగాహన కల్పించేందుకు 7 శ్వేత పత్రాలను విడుదల చేయాలని మంత్రి వర్గానికి సీఎం చంద్రబాబు సూచించారు. పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం (ల్యాండ్, శాండ్, మైన్స్, జియాలజీ మొదలైనవి), లిక్కర్, ఎక్సైజ్, శాంతి భద్రతలు, ఆర్థిక శాఖలపై శ్వేత పత్రాలను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నెల 28 నుంచి జూలై 18 వరకు రెండు మూడు రోజులకొకసారి వీటిని విడుదల చేయనున్నారు.

మంత్రి నారా లోకేశ్ బాధ్యతల స్వీకరణ

డీఎస్సీ విధివిధానాల ఫైల్‌పై తొలి సంతకం



సాక్షి, అమరావతి: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం వేదపండితుల ఆశీర్వచనాల మధ్య సచివాలయంలోకి అడుగుపెట్టిన ఆయన..4వ బ్లాక్ మొదటి అంతస్తులోని 208 చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. డీఎస్సీ విధివిధానాల ఫైలుపై తొలి సంతకం చేసి కేబినెట్‌కు పంపించారు. మంత్రులు సంధ్యారాణి, అనిత, సవిత, భరత్, కొండపల్లి, మాజీ ఎంపీలు గల్లా జయదేవ్, కనకమేడల, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘ నేతలు లోకేశ్‌కు అభినందనలు తెలిపారు.

గనులు, ఎక్సైజ్ శాఖలు పూర్తిస్థాయిలో ప్రక్షాళన

రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



సాక్షి, అమరావతి: గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన గనులు, ఎక్సైజ్ శాఖలను ప్రక్షాళన చేయనున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదను ప్రజాశ్రేయస్సు కోసం సద్వినియోగం చేస్తామన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఓఎన్జీసీ పెట్రోలియం మైనింగ్ లీజు పునరుద్ధరణ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ విధానాన్ని రూపకల్పన చేసి, మద్యం లావాదేవీలు, డిస్టిలరీల నుంచి మద్యం పంపిణీ తదితర కార్యక్రమాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించి, ప్రజావసరాల కనుగుణంగా ఇసుకను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు సహచర మంత్రి కొలుసు పార్థసారథి, గనుల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, మైనింగ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, డైరెక్టర్ చేతన్ తదితరులు అభినందనలు తెలిపారు.

హెల్త్ వర్సిటీ పేరు మార్పులో చంద్రబాబు అత్యుత్సాహం

- దివంగత సీఎం వైఎస్, ఆయన తనయుడు జగన్ పాలనలో వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత
- అందుకే వైఎస్సార్ పేరు నామకరణం
- కక్ష సాధింపులో భాగంగా వైఎస్సార్ పేరు తొలగింపు

సాక్షి, అమరావతి: పేదలకు మెరుగైన వైద్యసేవలు, విద్యార్థులకు వైద్య విద్యను అందించడంలో పూర్తి నిర్లక్ష్యం వహించిన చంద్రబాబు హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పునకు మాత్రం అత్యుత్సాహం చూపించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పేరును ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీగా మారుస్తూ తీసుకున్న నిర్ణయంపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడుసార్లు సీఎంగా చేసిన బాబు ఏనాడు ప్రభుత్వ వైద్య రంగాన్ని పట్టించుకోలేదు. పైగా ప్రైవేటు వైద్య కళాశాలలను, ప్రైవేటు ఆసుపత్రులను ప్రోత్సహించి వైద్య వృత్తిని వ్యాపారం చేశారు. కానీ, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ, 108, 104 వ్యవస్థలను ప్రవేశపెట్టి వైద్యశాఖను బలోపేతం చేశారు. ఆయన తనయుడైన జగన్ గడిచిన ఐదేళ్లలో వైద్యరంగం రూపురేఖలు మార్చారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఏకంగా 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టారు. అలాగే, నాడు–నేడుతో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు ఆధునీకరించారు. ఈ నేపథ్యంలోనే.. వైద్య రంగాన్ని పేదలకు చేరువ చేసిన వైఎస్సార్ పేరును హెల్త్ యూనివర్సిటీకి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టింది. దీనికితోడు ఎన్టీఆర్ పేరును జిల్లాకు పెట్టి వైఎస్ జగన్ ఆదర్శంగా నిలిచారు. కానీ, రాజకీయ కక్ష సాధింపునకు కొనసాగింపుగా బాబు వైఎస్సార్ పేరును తొలగించి ఎన్టీఆర్ పేరు పెడుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు తప్పుబడుతున్నారు.

మరోసారి 'టెట్'తో డీఎస్సీ ఆలస్యం!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే డీఎస్సీ పోస్టులకు ప్రకటన
- టెట్ కూడా నిర్వహణ
- గ్రూప్–1, గ్రూప్–2, డీఎల్, జేఎల్ పోస్టులకూ నోటిఫికేషన్లు
- వీటిలో కొన్నిటికి పరీక్షల నిర్వహణతోపాటు ఫలితాలూ వెల్లడి
- ఎన్నికలు రావడంతో మరికొన్ని పరీక్షలకు అడ్డంకి
- కొత్త చైర్మన్, సభ్యులు వచ్చాకే పోస్టుల భర్తీకి కొత్త ప్రభుత్వం మొగ్గు!

సాక్షి, అమరావతి: ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 6,100 టీచర్ పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరిలో గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతోపాటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సైతం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 27 నుంచి మార్చి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా టెట్ నిర్వహించింది. అయితే సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా టెట్ నిర్వహించలేదని పేర్కొన్నారు. అంటే.. మరోసారి టెట్ నిర్వహణ పేరుతో డీఎస్సీని ఆలస్యం చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో నిర్వహించిన టెట్‌కు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) అర్హత పరీక్ష పేపర్–1ఏని 1,13,296 మంది, స్కూల్ అసిస్టెంట్ టీచర్ల అర్హత పరీక్ష పేపర్–2ఏని 1,19,500 మంది, ప్రత్యేక విద్య ఉపాధ్యాయ అర్హత పరీక్ష పేపర్–1బి, పేపర్–2బిలను 3,111 మంది రాశారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 2.33 లక్షల మంది టెట్‌కు హాజరయ్యారు. వాస్తవానికి మార్చి 20న టెట్ ఫలితాలు ప్రకటించాలని షెడ్యూల్‌లో ప్రకటించినా.. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఆలస్యమైంది. అయితే, అభ్యర్థులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ టెట్ ఫలితాల ప్రకటన, డీఎస్సీ నిర్వహణకు అనుమతి కోరుతూ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. అయితే, టీడీపీ వర్గాల ఒత్తిడితో ఎన్నికల సంఘం అందుకు అంగీకరించలేదు. ఇప్పటికే నిర్వహించిన టెట్ ఫలితాలు ప్రకటించాల్సింది పోయి, మరోసారి టెట్ నిర్వహించేందుకే ప్రస్తుత ప్రభుత్వం ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. ఇదే జరిగితే.. డీఎస్సీ నిర్వహణ మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

కొత్త ప్రభుత్వం ఉద్దేశం ఇదేనా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రూప్–1, గ్రూప్–2, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, జూనియర్ కళాశాలల లెక్చరర్లు, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్లు, తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. వీటిలో పలు పోస్టులకు ప్రిలిమ్స్ కూడా నిర్వహించి ఫలితాలను ప్రకటించింది. మెయిన్స్ పరీక్షలు జరిగే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కొన్ని పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో నియమితులైన చైర్మన్, సభ్యులు ఉన్నంతకాలం ఈ పోస్టుల భర్తీ చేపట్టకూడదనే ఉద్దేశంతో కొత్త ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. తద్వారా ఆ పోస్టులను తామే భర్తీ చేశామన్న క్రెడిట్‌ను కొట్టేయడమే కొత్త ప్రభుత్వ ఉద్దేశమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీపీఎస్సీలో ప్రస్తుతం ఉన్న సభ్యులను తప్పించేందుకు రాజీనామా చేయాలని వారిపై ఒత్తిడితోపాటు అవసరమైతే వారిపై కేసుల నమోదుకు కూడా పావులు కదుపుతున్నట్టు తెలిసింది. ఇదే కోవలో మరోసారి టెట్ నిర్వహణ పేరుతో డీఎస్సీని ఆలస్యం చేసేందుకు కూడా ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సచివాలయ ఉద్యోగులపై భారం మోపడం విడ్డూరం

గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నారపరెడ్డి



సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు: పింఛన్ల పంపిణీ సచివాలయ ఉద్యోగుల ద్వారా చేయాలన్న మంత్రివర్గం నిర్ణయం కారణంగా సచివాలయ ఉద్యోగులపై పనిభారం పెరుగుతుందని వైఎస్సార్‌టీయూసీ అనుబంధ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నారపరెడ్డి రాజారెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఎలాగైనా ప్రజల నుంచి దూరం చేయాలని చంద్రబాబు ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 5 లక్షల మంది వలంటీర్లు చేసే పనిని 1.40 లక్షల మంది సచివాలయ ఉద్యోగులతో చేయించాలనుకోవడం అవివేకమన్నారు. ఎన్నికల సందర్భంగా వలంటీర్లకు నెలకు రూ.10 వేల జీతం ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు ఆ వలంటీర్ వ్యవస్థని ఎత్తివేయడం విడ్డూరమన్నారు. గతంలో జన్మభూమి కమిటీల్ని ఏర్పాటు చేసి కేవలం తెలుగుదేశం కార్యకర్తలకే ఆ కమిటీల్లో అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. టీడీపీ కార్యకర్తలే జన్మభూమి కమిటీలు నిర్వహించేవారని, వలంటీర్ వ్యవస్థలో అన్ని పార్టీలకు సంబంధించిన వారు ఉన్నారని పేర్కొన్నారు. అటువంటి వ్యవస్థను రద్దు చేయడం విడ్డూరమన్నారు.



దీపం కింద ఒంటరిగా కూర్చుని, తెరిచివున్న పుస్తకం ముందుంచుకుని, కనబడని తరాల మనుషులతో సన్నిహితంగా సంభాషించడం- అలాంటి ఆనందం అవధులు లేనిది.
– యొషిదా కెంకో

సాక్షి

మంగళవారం, 25 జూన్ 2024

లోతైన దర్యాప్తు అవసరం

తవ్వుతున్నకొద్దీ బయటపడుతున్న జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నిర్వాకాలు చూస్తుంటే దాని వాలకం 'అయ్యవారిని చేయబోతే కోతి అయింద'న్న చందంగా మారిందని అందరికీ అర్థమైంది. జేఈఈ మెయిన్ మొదలుకొని నీట్, యూజీసీ నెట్ సహా తొమ్మిది ప్రవేశ పరీక్షలవరకూ నిర్వహిస్తున్న ఈ సంస్థ విడుదల చేసే ప్రశ్నపత్రాలు, వాటి జవాబులు గుజరాత్, హరియాణా, బిహార్, జార్ఖండ్, మహారాష్ట్ర వంటిచోట్ల 'కావలసినవారికి' బజారులో దొరికాయని సీబీఐ రంగ ప్రవేశం చేశాక తేటతెల్లమైంది. బిహార్ పోలీసులు అరెస్టు చేసిన 20 మంది నిందితులను విచారిస్తే మే 5న నిర్వహించిన నీట్–యూజీ ప్రశ్నపత్రం ఒకరోజు ముందే పీడీఎఫ్ రూపంలో వారికి వచ్చిందని తేలింది. ఎందుకో ఈ ప్రశ్నపత్రాల మాఫియా దక్షిణాది రాష్ట్రాలవైపు దృష్టి సారించినట్టు లేదు. గత పదిరోజుల వ్యవధిలో ఎన్టీఏ నిర్వహించాల్సిన నాలుగు పరీక్షలు రద్దుకావటం అసాధారణం. రెండు లక్షలమంది విద్యార్థులు రాయాల్సిన ఆదివారంనాటి నీట్ పీజీ పరీక్షను కేవలం 12 గంటల ముందు రద్దుచేశారు. ఎన్టీఏ చీఫ్ సుబోధ్ కుమార్ సింగ్ దీనంతటికీ బాధ్యుడని తేలుస్తూ ఆయన్ను తొలగించారు. అంతేనా... దీంతో పాపప్రక్షాళన పూర్తయినట్టేనా? 'ఒకే దేశం–ఒకే పరీక్ష' పేరిట ఏమాత్రం పారదర్శకతలేని ఈ వ్యవస్థను సృష్టించిన పాలకుల మాటేమిటి? గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, బెంగాల్, పంజాబ్, హరియాణాల్లో భిన్న సంస్థలు నిర్వహించిన 70కి పైగా పరీక్ష పత్రాలు లీకయ్యాయని మీడియా కథనాలు చెబుతున్నాయి. నిరుడు తెలంగాణలో పరీక్షపత్రాలు లీకవటంతో నిరుద్యోగులు భగ్గుమన్నారు. నిజాయితీగా అహోరాత్రాలూ చదివిన కోటిన్నరమంది విద్యార్థుల భవితవ్యం ఈ లీకుల పర్యవసానంగా దెబ్బతిన్నదని అంటున్నాయి. ఈ లీకుల బెడద లేకుండా అన్ని సంస్థలనూ తలదన్నేలా నెలకొల్పామని చెప్పిన ఎన్టీఏ తీరు సైతం సక్రమంగా లేదంటే ఇక ఏమనాలి?

నిజమే... వైద్య విద్యలో దేశమంతా వర్తించే ఒకే పరీక్ష నిర్వహిస్తే వేలకు వేలు ఖర్చుపెట్టడం, వేర్వేరు పరీక్షలకు సంసిద్ధం కావటంవంటి విద్యార్థుల వెతలు తీరుతాయని సర్వోన్నత న్యాయస్థానం 2011లో భావించింది. లీకులను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందనుకున్నది. కానీ ఆచరణలో ఇందుకు విరుద్ధంగా జరిగింది. వైద్య విద్యకు ఒకే ప్రవేశ పరీక్ష ఉండేలా చర్యలు తీసుకోవాలని అప్పటి భారత వైద్య మండలి(ఎంసీఐ)కి చేసిన సూచన కాస్తా అనేక మలుపులు తిరిగి చివరకు ఇలాంటి ఉమ్మడి పరీక్ష నిర్వహణ రాజ్యాంగ విరుద్ధమని 2013లో సుప్రీంకోర్టే 2–1 మెజారిటీ తీర్పునిచ్చింది. కానీ తీర్పు ఇచ్చే ముందు ముగ్గురు న్యాయమూర్తుల మధ్యా ఎలాంటి చర్చా జరగలేదన్న కారణంతో 2016లో అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం మళ్లీ విచారించి నీట్‌ను అనుమతించింది. దేశంలో ఫెడరల్ వ్యవస్థ ఉన్నదని, ఉమ్మడి జాబితాలోని విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చేముందు రాష్ట్రాలతో, విద్యారంగ నిపుణులతో, ఇతర వర్గాలతో చర్చించాలని ఎవరూ అనుకోలేదు. ఒకపక్క హిందీ భాషాప్రాంత విద్యార్థులకు వారి భాషలో ప్రశ్నపత్రం ఇవ్వాలని నిర్ణయించిన ఎంసీఐ దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు స్థానిక భాషల్లో ఇవ్వటం కుదరదని మొరాయించింది. ఆ తర్వాత 2017లో ఎన్టీఏ ఆవిర్భవించాక 13 భాషల్లో ప్రశ్నపత్రాలు ఇస్తోంది. లీకులకు ఆస్కారంలేదని పెట్టిన వ్యవస్థ అందుకు తగ్గట్టుగా ఉందా అనేది ఉన్నతస్థాయిలో గమనించేవారే లేకపోయారు. కేంద్ర సిలబస్‌లు, ముఖ్యంగా సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్షల్లో రాష్ట్ర సిలబస్‌తో చదివినవారు రాణించగలరా అన్న సందేహమూ రాలేదు. ఫలితంగా దక్షిణాది రాష్ట్రాల్లో దశాబ్దాలుగా వర్ధిల్లుతున్న విద్యా మాఫియా జాతీయ స్థాయికి విస్తరించింది. తమిళనాడు ప్రభుత్వం నియమించిన 2021లో నియమించిన జస్టిస్ రాజన్ కమిటీ అధ్యయనం ప్రకారం నీట్‌కు ముందు ఇంగ్లిష్ మాధ్యమంలో చదివిన విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సులకు 80.2 శాతం నుంచి 85.12 శాతంవరకూ ఎంపికయ్యేవారు. తమిళ మాధ్యమంలో చదివిన వారి శాతం 14.88 శాతం ఉండేది. కానీ నీట్ మొదలైనాక ఇంగ్లిష్ మాధ్యమం విద్యార్థులు 97 శాతంవరకూ సీట్లు తెచ్చుకుంటుండగా, తమిళ మాధ్యమం విద్యార్థుల వాటా దాదాపు 3 శాతానికి పడిపోయింది. నీట్ సాధించేవారిలో అధికాదాయ కుటుంబాల పిల్లల సంఖ్య అంతక్రితంకన్నా పెరగ్గా, నిరుపేద వర్గాల పిల్లల సంఖ్య తగ్గిందని ఆ నివేదిక వివరించింది. నీట్‌వల్ల ప్రతిభావంతులకు సీట్లు వస్తున్నాయన్న వాదనను ఆ కమిటీ ఎండగట్టింది. నీట్‌కు ముందు హెచ్ఎస్‌సీ విద్యార్థుల సగటు స్కోరు 98.1 శాతం వుండగా, ఇప్పుడది 89.05 శాతం మాత్రమే.

ఈసారి వివిధ రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ఒకపక్క, ఎన్టీఏ ప్రశ్నపత్రాల లీకు మరోపక్క మన వ్యవస్థలకున్న విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీశాయి. ఇందులో మొదటిది దేశ ప్రజానీకం ఆకాంక్షల్నీ, రెండోది లక్షలాదిమంది విద్యార్థుల ఆశలనూ తలకిందులు చేసింది. ఇందువల్ల ప్రపంచంలో మనం నగుబాటుపాలయ్యామని ఇప్పటికీ ఎన్డీఏ సర్కారు గ్రహించకపోవటం, దొంగను తేలుకుట్టినట్టు వ్యవహరించటం ఆశ్చర్యకరం. ఈ ప్రపంచంలో విద్యాధనాన్ని మాత్రమే ఎవరూ కొల్లగొట్టలేరని చిన్నప్పుడు అందరం చదువుకున్నాం. కళ్లు మూసుకున్న పాలకుల నిర్వాకం కారణంగా దాన్ని సైతం ఎగరేసుకుపోవచ్చని ప్రశ్నపత్రాల మాఫియా నిరూపించింది. అందుకే ఎన్టీఏ చీఫ్‌ను సాగనంపితే సరిపోదు. ఈ మొత్తం వ్యవహారంపై న్యాయవిచారణ జరిపించి, ఇలాంటి లీకులకు ఆస్కారం లేకుండా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటుచేయాలి.

పరీక్షలు నీటుగా నిర్వహించాలంటే...

విశ్లేషణ



శ్రీధర్ రాజగోపాలన్

ఏ పరీక్ష అయినా వందలాది మంది వ్యక్తులు నిజాయితీగా ఉన్నప్పుడే లీకులు లేకుండా నిర్వహించడం సాధ్యమవుతుంది. వచ్చే ఆర్థిక లాభం ముందు తీసుకునే రిస్క్ తక్కువనిపించినప్పుడు, లీకులకు అవకాశం మరీ ఎక్కువ. పైగా ఏదోలా అడ్మిషన్ పొందితే కోర్సు దానికదే పూర్తవుతుంది అనే ధోరణి ఉన్నప్పుడు అడ్డదారులు తొక్కడం ఇంకా పెరుగుతుంది. అందుకే 'నీట్' ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో అసలు దేశంలో పరీక్షల నిర్వహణ తీరును మార్చడమే దీనికి పరిష్కారం. దేశంలో ప్రస్తుతం కాగితం, పెన్నులతో నిర్వహిస్తున్న అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్షలుగా మార్చడంతో పాటు, ప్రశ్నపత్రాల కూర్పు తీరు కూడా మారాలి.

భారతదేశంలో ఐఐటీలు లేదా ప్రతిష్ఠాత్మక వైద్య కళాశాలల్లో ప్రవేశించడం, వాటి కోర్సులు పూర్తి చేయడం కంటే కష్టం. నాతోపాటు ఐఐటీ మద్రాస్‌లో చేరిన 200 మందిలో నాలుగేళ్ల కోర్సు పూర్తిచేయని వాళ్లు దాదాపుగా లేరు. అందుకే ప్రవేశ పరీక్ష పాసయ్యేందుకు అవసరమైతే అడ్డదారులు తొక్కేందుకూ వెనుకాడరు. అర్హత లేని వారు ఒకవేళ అడ్మిషన్ పొందినప్పటికీ సకాలంలో కోర్సు పూర్తి చేయడం అసాధ్యంగా మారేలా ఉంటే... వాళ్లు ప్రవేశ పరీక్ష గట్టెక్కితే అదే పదివేలనుకునే పరిస్థితి తప్పుతుంది.



కాగితం, పెన్ను ఆధారంగా పరీక్షలు జరిగినప్పుడు కూడా పేపర్లు లీక్‌చేసే గ్యాంగ్‌లు ఉండేవి. అప్పటికి అత్యాధునిక టెక్నాలజీలతో వాళ్లు ప్రశ్న పత్రాల లీక్ చేసే వాళ్లు. అవసరమైన వాళ్లకు చేరవేసే వాళ్లు కూడా. పరీక్ష కేంద్రాల్లో లేదా ప్రశ్న పత్రాల ప్రింటింగ్ కేంద్రాల్లో కొందరితో కుమ్మక్కైతే చాలు. ఏ పరీక్ష అయినా సరే... లీకుల్లేకుండా నిర్వహించడం అనేది వందలాది మంది వ్యక్తులు నిజాయితీగా ఉన్నప్పుడు, అది కూడా భారీ మొత్తాలు ఆశ చూపినా తట్టుకునే సామర్థ్యం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. అందుకే కాగితం పెన్నుతోనైనా సరే... లీకుల్లేకుండా ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించడం అసాధ్యమే. వచ్చే ఆర్థిక లాభం ముందు తీసుకునే రిస్క్ తక్కువనిపిస్తుంది. మరి ఏమిటి చేయడం? దానికోసం నాలుగు సూచనలు:

1. దేశంలో ప్రస్తుతం కాగితం, పెన్నులతో నిర్వహిస్తున్న అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్షలుగా మార్చాలి. జేఈఈ (మెయిన్స్), ఇంకా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మూల్యాంకన పరీక్షలు ఇలాగే జరుగుతున్నాయి. హ్యాకర్లు కంప్యూటర్ ఆధారిత పరీక్షలపై దాడి చేసే అవకాశం ఉంది. అందుకని కంప్యూటర్లలో అనధికార సాఫ్ట్‌వేర్లను నియంత్రించాలి. ఎన్‌క్రిప్షన్‌తో కూడిన ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకునేందుకు తొలి పది నిమిషాలు, పరీక్ష పూర్తయిన తరువాత సమాధానాలను సింక్ చేసేందుకు మరో పది నిమిషాలు మాత్రమే ఇంటర్నెట్ ఇవ్వాలి. రోజురోజుకూ మెరుగవుతున్న కృత్రిమ మేధ సాయంతోనూ హ్యాకింగ్ సమస్యను అధిగమించే అవకాశముంది.

2. ప్రవేశ పరీక్షల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రశ్న పత్రాలను నాణ్యంగా కూర్చడమూ ఎంతో కీలకం. ఎక్కువమందికి టాప్ స్కోర్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. మోసం చేసినా పాసవలేమన్న స్థాయిలో ప్రశ్న పత్రాలు ఉండాలి. భారత్‌లోని యూజీసీ లాంటి అత్యున్నత విద్యా వ్యవస్థల నాయకులతో సహా చాలామంది, పరీక్ష కఠినమైతే కోచింగ్ వంటివి మరింత విస్తృత స్థాయికి చేరుకుంటాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుంటారు. పరీక్ష ఎంత కఠినమైనా... ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి వాటికి కోచింగ్ ఎప్పటికప్పుడు పెరిగేదే కానీ తగ్గదు. ప్రశ్న పత్రాలను తేలికగా కూర్చడం లేదా తక్కువ పరిమితి ఉన్న సిలబస్ ఆధారంగా సిద్ధం చేయడం వల్ల మాత్రమే కోచింగ్‌కు తక్కువ ప్రాధాన్యం ఏర్పడుతుంది. కానీ అప్పుడు నాణ్యత తగ్గిపోతుంది. పరీక్ష స్థాయి ఆధారంగా ప్రశ్నపత్రం కఠినత్వం ఉండాలి. బోర్డు పరీక్షలైతే సగటు విద్యార్థులను వేరు చేయడమన్నది 50 పర్సంటైల్ వద్ద ఉండటం మంచిది. నీట్, జేఈఈ వంటి పరీక్షలైతే ఈ పర్సంటైల్ 90 – 95 మధ్య ఉంటే మంచిది. ఇందుకు పరీక్ష కఠినంగా ఉండటం అవసరం. అదే సమయంలో ప్రతిభావంతుడైన ఒక విద్యార్థి, ఆయా బోధనాంశాల్లో నైపుణ్యమున్నవారు ఇద్దరూ సరిగ్గా సమాధానాలు చెప్పేలా ఉండాలి. ఫ్యాక్చువల్ తప్పులపై ఆధారపడి ప్రశ్నలు రూపొందిస్తే (ఈ ఏడాది నీట్‌లో ఇలాగే జరిగింది) అది నాణ్యమైన ప్రశ్నపత్రం కాదు.

3. అర్థవంతమైన బహుళార్థక ప్రశ్నలు ఇవ్వాలి. ప్రవేశ పరీక్షల్లో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమాధానాలు అంచనా కట్టవచ్చుననీ, సమాధానం కచ్చితంగా తెలియకపోయినా కొన్ని మోసపు పద్ధతుల ద్వారా సరైన సమాధానం రాబట్టవచ్చుననీ అనుకుంటారు. ఇది వాస్తవం కాదు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలంటే విషయంపై లోతైన అవగాహన అవసరం. విద్యార్థుల మేధకు పరీక్ష పెట్టేలా కొన్ని తప్పుడు సమాధానాలు కూడా ఉంటాయి. కాబట్టి నీట్, జేఈఈ వంటి పరీక్షలకు ఈ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు సరిగ్గా సరిపోతాయి. వివరణాత్మకమైన సమాధానాలు రాస్తే... ప్రశ్న పత్రాలు దిద్దేవారి తీరునుబట్టి మార్కుల్లో హెచ్చుతగ్గులు వచ్చే అవకాశం ఉంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు విద్యార్థికి సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించే తత్వం ఉందా, లేదా అనేది తేల్చవు. కాబట్టి కొన్ని వివరణాత్మక ప్రశ్నలూ జోడించడం మేలు. వీటిని సెకెండ్ పేపర్‌లో పెట్టి తులన అనేది టాప్ 20 శాతం విద్యార్థులకే పరిమితం (టాప్ 10 శాతం విద్యార్థులను ఎంపిక చేయడం మన లక్ష్యమైనప్పుడు) చేస్తే దిద్దడంలో తేడాలు గణనీయంగా తగ్గుతాయి.

4. నీట్, జేఈఈ వంటి పరీక్షల నిర్వహణకు అత్యంత కీలకమైన మరో అంశం పారదర్శకత. అన్ని ప్రశ్నలను బహిరంగ పరచకపోయినా నమూనా లేదా మాదిరి ప్రశ్నలు కొన్నింటినైనా జన సామాన్యానికి అందుబాటులో ఉంచాలి. ఎంత శాతం మంది విద్యార్థులు ఏ ఆప్షన్ ఎంచుకున్నారు వంటి సమాచారం అందివ్వాలి. ఈ ఆప్షన్స్‌కూ, విద్యార్థి పరీక్షలో సాధించిన మార్కులకూ మధ్య సంబంధాలను వివరించాలి. ఈ ఏర్పాట్ల వల్ల ప్రధానంగా రెండు లాభాలు ఉంటాయి. ప్రశ్న పత్రాలు కూర్చేవారు ఏకాగ్రతతో ఆ పని చేస్తారు. రెండోది పరీక్ష, నిర్వహణ... రెండింటిపై నమ్మకం పెరుగుతుంది. ర్యాంకుల నిర్ధారణకు పర్సంటైల్స్, స్కేల్డ్ స్కోర్లను జాగ్రత్తగా వినియోగించడం అవసరం. కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షల్లో ఒక్కో విద్యార్థికి ఒక్కో రకమైన ప్రశ్న పత్రం వస్తుంది కాబట్టి సమాధానాల ద్వారా వచ్చిన మార్కులు అర్థం లేనివిగా మారిపోతాయి. అందుకే వీటికి బదులుగా అందరికీ తెలిసిన సైకోమెట్రిక్ టెక్నిక్‌ల సాయంతో స్కేల్డ్ స్కోర్లను నిర్ధారించాల్సిన అవసరముంది. ఈ స్కేల్డ్ స్కోర్స్ ఆధారంగా పర్సంటైల్ మార్కులు సిద్ధమవుతాయి. మోసాలను పసిగట్టేందుకు నిరర్థక ప్రశ్నలు, సైకోమెట్రిక్ అనాలసిస్, స్టాటిస్టిక్స్ వంటివి ఎంతో ఉపయోగపడతాయి. ఒకవేళ ఏదైనా నిరర్థక ప్రశ్న వస్తే వాటిని పక్కనపెట్టాలి. తప్పుడు మార్గాల్లో సమాధానాలు చెప్పే ప్రయత్నం చేసిన వారిని డిస్‌క్వాలిఫై చేయాలి.

జేఈఈ మెయిన్స్ పరీక్ష నిర్వహణకు ప్రస్తుతం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రైవేట్ ఏజెన్సీలపై ఆధారపడుతోంది. నీట్‌ను మాత్రం స్వయంగా నిర్వహిస్తోంది. నాణ్యమైన, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రశ్న పత్రం తయారీ ఎన్టీఏకు కష్టమేమీ కాబోదు. అయితే ఈ రకమైన ప్రశ్న పత్రం తయారీని చాలా శ్రద్ధతో, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో తయారు చేయాల్సి ఉంటుంది. బోధనాంశాలపై పట్టున్నవారు, ప్రత్యేకమైన ఏజెన్సీలు, ప్రశ్నల రూపకల్పన, సమాధానాల విశ్లేషణలకు అత్యాధునిక సైకోమెట్రిక్ పద్ధతులను ఉపయోగించడం అవసరమవుతుంది. ఎందుకంటే ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ఎన్టీఏ విశ్వసనీయతపై, అది నిర్వహించే పరీక్షలపై పెద్ద ప్రశ్న చిహ్నం పడింది కాబట్టి! సమాజం మొత్తం ఈ రకమైన స్థితికి చేరడం భవిష్యత్తులో వృత్తినిపుణులుగా ఎదగాల్సిన విద్యార్థులకు ఏమంత మంచిది కాదు.

వ్యాసకర్త 'ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్' సహ–వ్యవస్థాపకుడు ('ద హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాటలు తాజాగా ఇలా...!

అభిప్రాయాలపై ఆంక్షలా?



తైవాన్ ప్రజల రాజకీయ అభిప్రాయాలకు వారి మీద ఆంక్షలు విధించే, సరిహద్దులకు ఆవల వారిని విచారణ జరిపే హక్కు చైనాకు లేదు. ప్రజాస్వామ్యం నేరం కాదు, నియంతృత్వమే నిజంగా దుర్మార్గమైనది. తైవాన్‌లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వంతో చైనా చర్చలు జరపాలని మరోసారి నేను కోరుతున్నాను.

– లై చింగ్ టీ, తైవాన్ అధ్యక్షుడు

పెరగాల్సిన పెళ్లిళ్లు



కులాంతర వివాహాలు, కులాంతర భోజనాలు మాత్రమే కులాన్ని ఓడించే మార్గాలని అంబేడ్కర్ వాదించారు. అదే తర్కాన్ని మత ఛాందసవాదాన్ని ఓడించటానికి వర్తింపజేయొచ్చు. అందుకోసమే మనం సోనాక్షి (సిన్హా)– జహీర్ (ఇక్బాల్) వివాహాన్ని ఉత్సవం చేయాల్సిన అవసరం ఉంది.

– పమేలా ఫిలిపోస్, జర్నలిస్ట్

సైన్యంతో సమస్యలు



'లష్కర్', 'ఫౌజ్', 'సిపహ్'– అన్నింటి అర్థం ఒకటే, సైన్యం అని! ఇదివరకే ఉన్న భారీ సైన్యానికి తోడుగా భావజాల ఆధారిత పౌరసైన్యాన్ని సృష్టించినప్పుడే పాకిస్తాన్ సమస్యలు రెట్టింపయ్యాయి. అఫ్గానిస్తాన్, ఇండియాకు వ్యతిరేకంగా జరుపుతున్న సంప్రదాయేతర యుద్ధవ్యూహాలు పాకిస్తాన్‌కు భద్రత లేకుండా చేస్తున్నాయి.

– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

మేలు జరిగితే చాలు...



భారత మధ్యతరగతి నిజంగా అవినీతి రాహిత్యాన్ని కోరుకోదు. అవినీతిపరులకు లాగానే వాళ్లూ అంతే లాభపడుతూ, ఎవరికీ దొరికిపోకుండా ఉండే వ్యవస్థ ఒకటి వారికి కావాలి.

– ప్రియాంక లాహిరి, ఫిట్‌నెస్ కోచ్

అదిరిన చట్నీ



వెస్ట్ ఇండీస్‌లోని నాలుగో తరం భారతీయులు కరీబియన్ రెగెయ్ సంగీతానికి, ఇండియన్ పాటలను కలిపి దాన్ని చట్నీ మ్యూజిక్ అంటున్నారు.

– అనంత్ రూపనగుడి, రైల్వేమాన్

ఇన్ బాక్స్

మనం మరచిన గాంధీజీ రక్షకుడు

జాతిపిత మహాత్ముడి ప్రాణాలు కాపాడిన ఓ త్యాగశీలి జన్మదినం నేడు. ఆయన పేరు బతఖ్ మియా అన్సారీ. 1869 జూన్ 25న బిహార్‌లోని మోతీహార్ గ్రామంలో జన్మించారు. బిహార్‌లోని చంపారణ్ జిల్లాలో ఆహార పంటలు వదలి, నీలిమందు లాంటి వాణిజ్య పంటలు పండించమని బ్రిటిష్ వలస పాలకులు రైతులను నిర్బంధించేవారు, హింసించేవారు. ఈ అకృత్యాలను వివరించి అక్కడి రైతులను పరామర్శించమని ఆ ప్రాంతంవారు కొందరు గాంధీజీని అభ్యర్థించారు. దీంతో 1917 ఏప్రిల్‌లో ఆయన అక్కడికి వెళ్లారు. దీంతో ఇర్విన్ అనే బ్రిటిష్ ఇండిగో ఎస్టేట్ మేనేజర్ గాంధీజీని భోజనానికి ఆహ్వానించి అంతం చేయాలని పథకం పన్నాడు. తన వంటమనిషి బతఖ్ మియా అన్సారీని పిలిచి, గాంధీజీకి పాలలో విషం కలిపి ఇచ్చి చంపాలని ఆదేశించాడు. ఈ పని చేస్తే జీతం పదింతలు పెంచుతాననీ, విలువైన భూములు ఇస్తాననీ చెప్పాడు. బాబూ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి గాంధీజీ భోజనానికి వచ్చారు. ఇర్విన్ ఆజ్ఞను ధిక్కరిస్తే గతి ఏమవుతుందో తెలిసినప్పటికీ, పాలు అందిస్తూనే అందులో విషం కలిపిన విషయాన్ని ఆయన గాంధీజీకి చెప్పి ఆయన ప్రాణాలు రక్షించారు. అగ్గిమీద గుగ్గిలమైన ఇర్విన్ ఆ తరువాత అన్సారీ ఇంటినీ, ఆయనకున్న కొద్దిపాటి భూమినీ జప్తుచేయించి ఊరి నుండి వెళ్ళగొట్టాడు.



బతఖ్ మియా అన్సారీ


1950లో మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ మోతీహార్ వెళ్ళి ఒక సభలో ప్రసంగిస్తుండగా తనను కలవడానికి ప్రయత్నిస్తున్న అన్సారీని వేదికపైకి పిలిచి ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నారు. ఇర్విన్ అకృత్యాలు విని విచలితుడై అప్పటికప్పుడు 50 ఎకరాల భూమిని అన్సారీ, ఆయన ముగ్గురు కుమారుల కుటుంబాలకూ కేటాయించాల్సిందిగా ఆదేశించారు. అన్సారీ ఏడేళ్ళపాటు కార్యాలయాల చుట్టూ తిరిగినా రాష్ట్రపతి ప్రకటించిన భూమి ఆయనకు దక్కలేదు. చివరికి 1957 డిసెంబర్ 4న కన్ను మూశారు. మొత్తంమీద ఒక ఆరు ఎకరాల భూమిని ఓ నది ఒడ్డున జిల్లా కలెక్టర్ కేటాయించారు. ప్రస్తుతం నది కోతకు గురై ఐదెకరాల భూమి మాయమై ఎకరం మిగిలింది. ఇప్పటికీ తమకు రావలసిన భూమికోసం అన్సారీ కుటుంబీకులు అర్జీలు పట్టుకుని తిరుగుతూనే ఉన్నారు.

– ఎం.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్

(నేడు బతఖ్ మియా అన్సారీ జయంతి)

శాస్త్రీయత లేని మద్దతు ధరల నిర్ణయం


అభిప్రాయం



సారంపల్లి మల్లారెడ్డి

కేంద్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి గాను 14 రకాల పంటలకు మద్దతు ధరను ప్రకటించింది. గత ఏడాది మద్దతు ధరలపై 5 శాతం నుండి 7 శాతం వరకు మాత్రమే పెంచి ప్రకటించింది. వాస్తవానికి ఈ పెంచిన ధరలు ప్రైవేట్ మార్కెట్లలో ఇప్పటికే అమలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మార్కెట్లలో ఏనాడూ అమలు కాలేదు, ఇప్పుడూ కావడం లేదు. పత్తి, వరి మినహా మిగిలిన పంటలకు ధరలు అమలు జరపడానికి ఏలాంటి వ్యవస్థా లేదు. కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కలిపి ధర నిర్ణయం అయ్యింది.

మద్దతు ధర నిర్ణయంలో ఉత్పత్తి ధర కీలకంగా ఉంటుంది. 2024–25 సంవత్సరానికి ధాన్యం ఉత్పత్తి ధర క్వింటాల్‌కు రూ. 1,523గా నిర్ణయించి దానికి 50 శాతం కలిపారు. వాస్తవానికి 2023–24లో క్వింటాల్ ధాన్యం ఉత్పత్తి ధర రూ. 2,100గా తెలంగాణతో సహా అనేక రాష్ట్రాలు కేంద్రానికి నోట్ పంపాయి. దానిని గమనంలోనికి తీసుకున్నప్పుడు క్వింటాల్ ధాన్యానికి రూ. 3,150గా నిర్ణయించాలి. క్వింటాలున్నర ధాన్యానికి క్వింటాల్ బియ్యం వస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ బియ్యం ధర రూ. 5,500 నుండి రూ. 6,000 వరకు అమ్మకాలు సాగుతున్నాయి. క్వింటాల్ ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వాల సలహా మేరకు రూ. 3,150 నిర్ణయించినప్పటికీ క్వింటాలు బియ్యానికి రూ. 4,650 లకు అమ్మవచ్చు. అయినప్పటికీ క్వింటాల్‌కు రూ. 500 నుండి రూ. 1,500ల వరకు లాభం ఉంటుంది.



పప్పుధాన్యాలకు నిర్ణయించిన ధరల ప్రకారం ముడిపప్పును క్వింటాలుకు కందులు రూ. 7,550కి కొనుగోలు చేసినప్పటికీ 80 కిలోల పప్పు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో పప్పు ధర కిలో రూ. 150 నుండి రూ. 180 వరకు ఉంది. అనగా 80 కిలోలు రూ. 12,000 నుండి రూ. 14,640 వరకు గిట్టుబాటు అవుతుంది. ధాన్యం కానీ, పప్పు ధాన్యాలు కానీ మిల్లు ఆడించినందుకు మిల్లర్‌కు దాని నుండి వచ్చిన ఊక, నూక, పరం, తవుడు తీసుకొని తయారైన సరుకులు ఇస్తారు. కొన్ని సందర్భాల్లో క్వింటాలుకు రూ. 100ల లోపు చార్జీ వేస్తారు. దీనిని బట్టి పరిశీలిస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధరలు రైతుకు కనీసం పెట్టుబడి వచ్చే విధంగా లేవు. ధరల నిర్ణయ విధానంలో తీసుకున్న 'ఉత్పత్తి ధర' అత్యంత మోసపూరితమైనది. వాస్తవ ఉత్పత్తి ఖర్చును ఏనాడూ లెక్కలోకి తీసుకోలేదు.

'ధరల నిర్ణాయక కమిషన్' (సీఏసీపీ) గణాంకాల ద్వారా సేకరించిన సగటు ఉత్పత్తి ధరను కేంద్ర ప్రభుత్వం ఏనాడూ పరిగణనలోకి తీసుకోలేదు. ఆ కమిషన్ రికమండేషన్‌ను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం నిర్ణయించిన మద్దతు ధరలు 60 శాతానికి పైగా పెరగాలి. కమిషన్ రికమండేషన్‌ను క్యాబినెట్ కమిటీ చర్చించి మద్దతు ధరలను నిర్ణయిస్తుంది. వాస్తవానికి కమిషన్ రికమండేషన్‌ను క్యాబినెట్ కమిటీ పరిగణనలోకి తీసుకున్నట్లు కనపడదు.

క్యాబినెట్ కమిటీ ప్రకటించిన ధరలు అమలు జరుపడానికి మార్కెట్ యంత్రాంగం లేదు. మార్కెట్లు రాజ్యాంగం రీత్యా రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. మార్కెట్ కమిటీలు మధ్యదళారీలకు, కార్పొరేట్ సంస్థలకు లోబడి ఉంటాయి. అందువల్ల నిర్ణయించిన మద్దతు ధరలు కూడా అమలు జరుగడం లేదు. మద్దతు ధరలు శాస్త్రీయంగా నిర్ణయించకపోవడం, నిర్ణయించిన వాటిని అమలు జరుపకపోవడం వలన ఏటా రైతులు రూ. 4 లక్షల కోట్ల ఆదాయాన్ని నష్టపోతున్నారు. ఇతర రంగాలకు ఇస్తున్నట్లు ఉచితాలు, మినహాయింపులూ వ్యవసాయ ఉత్పత్తులకు లేవు. పైగా బ్యాంకులు పంట రుణాలు తగ్గించడం వల్ల అత్యధిక వడ్డీకి ప్రైవేట్ అప్పులు తెచ్చి రుణగ్రస్థులు అవుతున్నారు. ఆ రుణాలు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

భారతదేశంలో వ్యవసాయదారుల ఉత్పత్తులకు తక్కువ ధరలు నిర్ణయించి, ఆ ఉత్పత్తులు వినియోగదారులకు చేరేటప్పటికి అత్యధిక ధరలుగా మారేలా వ్యవస్థ ఉండటంతో మధ్య దళారీలు, కార్పొరేట్ సంస్థల వాళ్లు 50 శాతం నుండి 100 శాతం వరకు లాభాలు సంపాదిస్తున్నారు. ఈ లాభాలు మరిన్ని పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వంపై ప్రభావం చూపి కనీస మద్దతు ధరలు పెరగకుండా చూస్తున్నారు.

ఈ పరిస్థితిని అధిగమించడానికి రైతులు, రైతు సంఘాలు గత మూడేళ్లుగా 'మద్దతు ధరల చట్టాన్ని' పార్లమెంటు ఆమోదించాలని పార్లమెంట్‌లో ముసాయిదా బిల్లును కూడా ప్రవేశపెట్టారు. కార్పొరేట్ సంస్థల ప్రభావానికి లొంగి ఆ చట్టాన్ని చర్చించకుండా పెండింగ్‌లో పెట్టింది ప్రభుత్వం. ఒకవైపున ప్రధాని ఆ చట్టాన్ని చర్చిస్తానని రాతపూర్వకంగా రైతుసంఘాలకు హామీ ఇవ్వడంవల్ల అవి తాము సాగిస్తున్న 11 మాసాల పోరాటాన్ని ఉపసంహరించుకున్నాయి. కేంద్రం మాట తప్పడంతో తిరిగి 135 రోజులుగా (జూన్ 25 నాటికి) ఢిల్లీలో వేల మంది రైతులు ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. కొద్దిమంది దళారీలు, కార్పొరేట్ల ప్రయోజనాన్ని, లాభాలను పెంచడానికి చేస్తున్న ఈ ప్రయత్నం వల్ల వ్యవసాయంపై ఆధారపడి ఉన్న 52 శాతం ప్రజలు అనగా 70 కోట్ల మంది జనం నష్టపోతున్నారు. అందుకే మద్దతు ధరలను శాస్త్రీయంగా నిర్ణయించాలంటే ఉత్పత్తి వ్యయాన్ని న్యాయంగా నిర్ణయించాలి.

వ్యాసకర్త ఏఐకేఎస్ మాజీ ఉపాధ్యక్షులు । 94900 98666

ఆచరణ ముఖ్యం

జ్యోతిర్మయం

ఒక రోజు బోధివనానికి వచ్చిన ఓ నడివయస్కుడు బోధిసత్త్వుని పాదపద్మాలను తాకి నమస్కరించాడు. చిరునవ్వుతో అతని వివరాలు అడిగాడాయన. 'దేవా నా పేరు అభినందనుడు. నేను పేదవాడిని. నాకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. లౌకిక పాశాల్లో చిక్కుకుని తల్లడిల్లుతున్నాను. మీరేదైనా పరిష్కారం చెప్పాలి. మీరే నాకు జ్ఞానమార్గం చూపాలి' అని వేడుకున్నాడు ఆ వ్యక్తి.

బోధిసత్త్వుడు 'అభినందనా, ఈ చెట్లకున్న ఆకులను చూడు. అవన్నీ ఎందుకు కదులుతున్నాయో తెలుసా... గాలి వచ్చి ఢీకొనడంతో కదులుతున్నాయి. పాశమనే గాలి వచ్చి ఢీకొన్నప్పుడల్లా మనిషి ఆకులా ఇలా ఊగుతాడు. మొదట నీ మనసులో ఉన్న లౌకిక పాశాలను తెంచుకో. అప్పుడే నీవు జ్ఞానమార్గంలో నడవగలవు. అది నీ వల్ల సాధ్యమేనా?' అన్నాడు. సాధ్యమే అన్నాడు అభినందనుడు. అయితే ఈరోజు నుండి నువ్వు ఇక్కడే ఉండన్నాడు బోధిసత్త్వుడు.

అభినందనుడు అక్కడే ఉండిపోయాడు. కొద్ది రోజులు సన్యాసి జీవితం చక్కగానే గడిపాడు. క్రమంగా అతడు మళ్లీ లౌకిక బంధనాల్లోకి జారుకోవడాన్ని బోధిసత్త్వుడు గమనించాడు.

ఒక రోజు అభినందనుని పిలిచి రెండు పాత్రలు తీసుకున్నాడు. ఓ పాత్రలో రకరకాల పదార్థాలు ఉన్నాయి. మరొకటి ఖాళీ పాత్ర. పదార్థాలు ఉన్న పాత్రను నీటిలో వదిలేశాడు. అది లోపలికి మునిగిపోయింది. ఖాళీ పాత్రను నీటిలో వేశాడు. అది తేలియాడుతూ కనిపించింది. 'బరువైన పాత్ర కనిపించకుండా పోయింది. ఖాళీ పాత్ర తేలుతోంది. ఖాళీ పాత్ర ఉంది చూశావూ, అది జ్ఞానపాత్ర. బరువైన పాత్ర ఉంది చూశావూ, అది బంధనాల పాత్ర. నేను సన్యాసినవుతాననీ, జ్ఞానినవుతాననీ చెప్పడం సులభం. కానీ ఆచరణ కొచ్చేటప్పటికి అది చాలా కష్టం. అది అంత సులభమైన విషయం కాదు. ఆశనూ, లౌకిక పాశాలనూ వదులుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి. ఇప్పుడు నువ్వేంటో నీకు అర్థమై ఉండాలి' అన్నాడు బోధిసత్త్వుడు. అప్పటి నుంచి పూర్తిగా ఆధ్యాత్మిక మార్గంలో నడిచాడు అభినందనుడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: బ.చవితి రా.1.08 వరకు, తదుపరి పంచమి : నక్షత్రం: శ్రవణం సా.4.50 వరకు, తదుపరి ధనిష్ఠ: వర్జ్యం: రా.8.36 నుండి 10.06 వరకు: దుర్ముహూర్తం: ఉ.8.07 నుండి 8.59 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.39 వరకు: అమృత ఘడియలు: ఉ.6.54 నుండి 8.24 వరకు, తిరిగి తె.5.52 నుండి 7.24 వరకు(తెల్లవారితే బుధవారం): రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు: యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు: సూర్యోదయం: 5.31 : సూర్యాస్తమయం: 6.34. సంకటహర చతుర్థి

దుర్గమ్మను దర్శించుకున్న ముకేష్‌కుమార్ మీనా



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ముకేష్‌కుమార్ మీనాకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ డీఈవో లీలాకుమార్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

శ్రీచైతన్య స్కూల్‌లో విద్యా సామగ్రి విక్రయాలు



భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. గత వారంలో పట్టణంలోని నారాయణ స్కూల్‌లో అక్రమంగా జరుగుతున్న స్కూల్ బుక్స్, యూనిఫామ్ వంటి విక్రయాలను ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకోగా.. సోమవారం శ్రీచైతన్య స్కూల్‌లో ఇదేవిధంగా జరుగుతున్న దందాను అడ్డుకుని విద్యాసామగ్రి ఉన్న గదిని సీజ్ చేయించారు. గత వారం నారాయణ స్కూల్లో విద్యాసామగ్రి విక్రయాల బాగోతాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకుని విద్యా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్కూల్ నిర్వాహకులను హెచ్చరించి విద్యా సామగ్రి ఉన్న గదిని సీజ్ చేశారు. కుముదవల్లి రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫామ్ వంటివి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బి.గణేష్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు స్కూల్ వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేస్తుండగా విద్యాశాఖ అధికారి స్కూల్ వద్దకు వచ్చి సిబ్బందిని హెచ్చరించి విద్యాసామగ్రిని సీజ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీను, బి.సిద్ధు, కె.గోవింద్, అనిల్ పాల్గొన్నారు.

అదుపులోకిరాని డయేరియా

- జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో బాధితులకు చికిత్స
- గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు
- వైద్యారోగ్య శాఖాధికారుల సర్వే
- తాజాగా.. మరో 11 కేసులు నమోదు



నాగమ్మ (ఫైల్)



జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో డయేరియా బాధితులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సాక్షి, అమరావతి/జగ్గయ్యపేట/దాచేపల్లి: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో డయేరియా ఇంకా అదుపులోకి రాలేదు. ఐదు రోజులుగా దీనికి సంబంధించిన కేసులు ప్రభుత్వాస్పత్రికి వస్తూనే ఉన్నాయి. తాజాగా.. సోమవారం జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది వాంతులు, విరేచనాలతో పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చేరారు. అలాగే, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలో ఓ వృద్ధురాలు కూడా అతిసార బారినపడి మరణించింది.

79 కేసులు నమోదు..

జగ్గయ్యపేట ప్రాంతంలో ఈనెల 19–24 వరకు మొత్తం 79 డయేరియా కేసులు నమోదయ్యాయని డీఎంహెచ్‌ఓ సుహాసిని తెలిపారు. పట్టణంలో 30, మండలంలో 27, వత్సవాయి మండలంలో 22 కేసులు వచ్చాయని తెలిపారు. ఇందులో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో 67 మందికి చికిత్స అందించగా మరో 12 మంది ఖమ్మం, కోదాడ, తదితర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారన్నారు. ఇక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న 67 మందిలో 33 మందిని డిశ్చార్జ్ చేయగా మెరుగైన వైద్య నిమిత్తం 10 మందిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. 24 మంది జగ్గయ్యపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆమె చెప్పారు. మరోవైపు.. అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు సుహాసిని తెలిపారు. డయేరియాను అదుపు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు కూడా వ్యక్తిగత శుభ్రత, వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఆమె కోరారు. అలాగే, అతిసార వ్యాపించిన గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో 24 గంటల వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డీసీకే నాయక్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ హరీష్, విజయవాడ ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు అరీనా, స్థానిక వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య పనులు..

మరోవైపు.. జగ్గయ్యపేట మండలంలోని బూదవాడ, గండ్రాయి గ్రామాల్లో పంచాయతీ అధికారులు ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రంచేయడంతో పాటు క్లోరినేషన్ చేస్తున్నారు. డ్రెయిన్‌లలో పూడికతీత, మురుగునీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్, దోమల వ్యాప్తిని నిరోధించే మందులను పిచికారీ చేస్తున్నారు. దీంతోపాటు.. డయేరియా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు.

డయేరియా ప్రబలుతుంటే ఏం చేస్తున్నారు?: మంత్రి సత్యకుమార్

ఈ నేపథ్యంలో.. సోమవారం మంత్రి సత్యకుమార్ యాదవ్ డయేరియాతో పాటు సీజనల్ వ్యాధులు, కీటక జనిత వ్యాధులపై ఏపీ సచివాలయం నుంచి డీఎంహెచ్‌ఓలు, డీసీహెచ్ఎస్‌లు, జీజీహెచ్ సూపరింటెండెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డయారియా కేసులు పెరుగుతుంటే క్షేత్రస్థాయిలో ఏం చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. 27 ఏళ్ల యువకుడు డయేరియాతో చనిపోతే ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఈ పరిస్థితి చూసి సిగ్గుపడాలన్నారు. ముందుముందు వైద్యశాఖను ప్రక్షాళన చేసేలా చర్యలుంటాయన్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధుల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీక్షలో వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్యశ్రీ సీఈఓ లక్ష్మీషా, డీఎంఈ డాక్టర్ నరసింహం పాల్గొన్నారు.

తాజాగా 11 కేసులు నమోదు..


జగ్గయ్యపేట మండలంలో సోమవారం వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న 11 మందిని గుర్తించినట్లు వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. వీరంతా బూదవాడ, ముక్త్యాల, రావిరాల.. వత్సవాయి మండలం మంగొల్లు, వేములనర్వ, పెద్దమోదుగపల్లి.. పట్టణంలోని సీతారాంపురం, చెరువుబజార్‌కు చెందిన వారు. గండ్రాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమణ తాగునీటి ట్యాంకులను పరిశీలించారు.

అతిసారతో వృద్ధురాలు మృతి..

పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వంగూరి నాగమ్మ (62) అతిసార బారినపడి చికిత్స పొందుతూ సోమవారం మృత్యువాత పడింది. ఈ గ్రామంలో అతిసార బారినపడి 16 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నాలుగు రోజుల కిందట నాగమ్మ కూడా ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేరింది. వాంతులు, విరేచనాలు అదుపులోకి రాకపోవడంతోపాటు కిడ్నీల సమస్య తలెత్తింది. దీంతో ఆమెను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి ఆదివారం తరలించగా.. చికిత్స పొందుతూ మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ దళిత నేత ఇంటిపై దాడి

- ముసుగులు ధరించి ఇంట్లోకి చొరబడి విధ్వంసం
- ఆయన భార్య, కుమారుడికి గాయాలు
- చిత్తూరు జిల్లాలో ఘటన
- టీడీపీ శ్రేణుల పనే!




దుండగుల దాడిలో ధ్వంసమైన ఎర్రబల్లి శ్రీనివాసులు ఇల్లు

పెద్దపంజాణి (చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఓ దళిత నేత ఇంట్లోకి టీడీపీకి చెందిన వారిగా భావిస్తున్న ముగ్గురు వ్యక్తులు చొరబడి, ఆయన భార్య, కుమారుడిపై దాడి చేసి, విధ్వంసం సృష్టించారు. బాధితుని కథనం ప్రకారం.. దళితుడైన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎర్రబల్లి శ్రీనివాసులు పెద్దపంజాణి మండలం వీరప్పల్లి పంచాయతీ కెళవాతి సమీపంలోని తన పొలం వద్ద ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో ముసుగులు ధరించి కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతని ఇంట్లోకి చొరబడ్డారు. శ్రీనివాసులు కోసం ఆరాతీశారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో అతని భార్య, కుమారుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను తీసుకున్నారు. పెద్దగా కేకలు వేస్తూ వారిద్దరిపైనా దాడి చేసి, గాయపరిచారు. ఇంట్లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేశారు. గతంలో సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వ్యతిరేకంగా శ్రీనివాసులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని, అతన్ని ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టబోమని, రాష్ట్రం విడిచి వెళ్లే వరకూ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించి వెళ్లిపోయారు. కుటుంబీకుల సమాచారంతో ఇంటికి చేరుకున్న శ్రీనివాసులు పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు స్వల్ప అస్వస్థత

- ఆస్పత్రిలో చికిత్స, డిశ్చార్జి
- సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై ఖండన



మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం అర్ధరాత్రి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు నగరంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సోమవారం సాయంత్రానికి కోలుకున్న అదీప్‌రాజ్‌ను వైద్యులు డిశ్చార్జి చేశారు. కాగా, అదీప్‌రాజ్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరితే ఓ వర్గం సోషల్ మీడియా వేదికగా ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని విస్తృత ప్రచారం చేయడాన్ని అదీప్‌రాజ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లి భోజనం చేశామన్నారు. అయితే అర్ధరాత్రి పొట్టలో గ్యాస్ సంబంధిత సమస్యతో ఇబ్బందిగా ఉండడంతో ఆస్పత్రిలో చేరానని తెలిపారు. కానీ ఓ వర్గం తన అనారోగ్యాన్ని వక్రీకరించి సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని ప్రజలెవ్వరూ నమ్మవద్దని అదీప్‌రాజ్ కోరారు. తాను ఇప్పుడు పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉన్నానని, రెండు మూడు రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తానని పేర్కొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు సోమవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన మహిళకు, నున్న గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. భర్తతో మనస్పర్థల కారణంగా ఆమె పిల్లలను తీసుకుని ఇబ్రహీంపట్నంలోని పుట్టింట్లో ఉండేది. కొన్నాళ్ల తరువాత భర్త వచ్చి తన ఐదేళ్ల పెద్ద కుమార్తెను నున్నలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. అయితే ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాంబేకాలనీకి చెందిన 20 ఏళ్ల కుంచాల దుర్గారావు అలియాస్ తమ్మిశెట్టి దుర్గారావు అలియాస్ దుర్గా ఆ పాపను డాబాపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరుసటి రోజు పాపకు స్నానం చేయిస్తుండగా మర్మాంగాల వద్ద ఇన్ఫెక్షన్ రావడాన్ని గమనించిన తల్లి ఆరా తీయగా దుర్గారావు చేసిన అత్యాచారం బయటపడింది. వెంటనే పాపను చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పాపపై అత్యాచారం జరిగినట్లు వైద్యులు నిర్ధారించడంతో పాప తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2019 ఏప్రిల్ ఆరో తేదీన నున్న పోలీసులు కేసు నమోదు చేసి 2020 ఆగస్టు 12వ తేదీన నిందితుడు దుర్గారావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో నిందితుడు దుర్గారావుకు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అనధికార ఫుడ్ డెలివరీ ముఠా గుట్టురట్టు

- రాజమండ్రికి చెందిన ఫ్రాంచైజీ నిర్వాహకురాలు అరెస్టు
- దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఫ్రాంచైజీలు



ఫ్రాంచైజీ నిర్వహిస్తున్న మహిళను అరెస్టు చేసిన ఆర్‌పీఎఫ్ పోలీసులు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని వివిధ రైల్వే స్టేషన్లలో ఆన్‌లైన్ ద్వారా అనధికారిక ఫుడ్ డెలివరీ చేస్తున్న ముఠాను విజయవాడ కమర్షియల్ విభాగం క్యాటరింగ్ అధికారులు పట్టుకున్నారు. ఫుడ్ డెలివరీ సర్వీస్ గురించి వాట్సాప్ మెసేజ్‌ల రూపంలో రైలు ప్రయాణంలో తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం డెలివరీ చేస్తున్నామంటూ ప్రయాణికులను ఆకర్షిస్తున్న మెసేజ్‌లు వైరల్‌గా మారాయి. దీన్ని గుర్తించిన కమర్షియల్ విభాగం కేటరింగ్ అధికారులు వారి కదలికలపై నిఘా పెట్టారు. రాజమండ్రి స్టేషన్‌లో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో ఫుడ్ డెలివరీ చేస్తున్న డెలివరీ బాయ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనధికారికంగానూ, చట్టవిరుద్ధంగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ఫ్రాంచైజీ నిర్వహిస్తున్న రాజమండ్రికి చెందిన కొమ్ము లక్ష్మీ ప్రసన్న అనే మహిళను ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ఈ నెట్‌వర్క్ పరిధిలో దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఫ్రాంచైజీలు పనిచేస్తున్నాయని కమర్షియల్ విభాగం కేటరింగ్ అధికారులు తెలిపారు.

14న దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో జూలై 14న బంగారు బోనం సమర్పించనున్నారు. ఈ మేరకు బోనాల కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, కమిటీ సభ్యులు సోమవారం దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు, డీఈవో లీలాకుమార్‌ను కలిసి కార్యక్రమ వివరాలను తెలియజేశారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏటా అమ్మవారికి బోనాలను సమర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే జూలై 28న ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం తరఫున పాతబస్తీలోని అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించాల్సిందిగా బోనాల కమిటీ ప్రతినిధులు కోరారు.

కష్టపడ్డ వారికి పదవులు

- త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ
- కార్యకర్తలను గౌరవిస్తాం..
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: టీడీపీ విజయానికి కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. పార్టీ నేతలు ఇచ్చే రిపోర్టులతో పాటు ఇతర మార్గాల్లో కూడా రిపోర్టులు తెప్పించుకుని కష్టపడిన వారికే పదవులు వచ్చేలా చేస్తామని ఆయన చెప్పారు. ఎమ్మెల్యేలు, ఇంఛార్జిలు, పార్లమెంట్ అధ్యక్షులతో చంద్రబాబు సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారాన్ని అడ్డంపెట్టుకుని పార్టీకి, కార్యకర్తలకు నష్టంచేసి, వేధించిన వైసీపీ నేతలకు తెలుగుదేశం పార్టీలోకి ఎంట్రీ లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేరుస్తున్నామని, మెగా డీఎస్సీకి కేబినెట్ కూడా ఆమోదం తెలిపిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను గత ప్రభుత్వం స్వార్థం కోసం ప్రవేశపెట్టిందని దాని రద్దుకు కూడా నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు చెప్పారు. ఇక గత ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పెన్షన్లు ఇవ్వడం అసాధ్యమని చెప్పిందని, అది సాధ్యమవుతుందని చెప్పడానికే సచివాలయ సిబ్బందితో పెన్షన్ల పంపిణీ చేపట్టబోతున్నామని ఆయన తెలిపారు.

నిర్మాణ కంపెనీలతో సీఎం సమావేశం

అమరావతి నిర్మాణాలకు సంబంధించి వివిధ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమావేశమయ్యారు. సచివాలయంలోని తన కార్యాలయంలో గతంలో అమరావతి నిర్మాణంలో పాలుపంచుకున్న కాంట్రాక్ట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఆయా నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో నిలిచిపోయిన పనుల ఎలా కొనసాగించాలనే దానిపై చర్చించారు. సమావేశం అనంతరం మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ కొందరు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతంలో మొలిచిన తుమ్మ చెట్లను త్వరలో తొలగిస్తామని చెప్పారు.

నేతన్నలకు అండగా నిలుద్దాం

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



చీరలను పరిశీలిస్తున్న మంత్రి సవిత

సాక్షి, అమరావతి: చేనేత వస్త్రాలను ఆదరించి నేతన్నలకు అండగా నిలవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కోరారు. విజయవాడ గవర్నర్ పేటలోని ఆప్కో మెగా షోరూమ్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. అధికారులతో సమీక్ష అనంతరం షోరూమ్‌లోని చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. పెద్ద పెద్ద వస్త్ర షోరూంలకు దీటుగా ఆప్కో మెగా షోరూంను విజయవంతంగా నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారంలో కనీసం ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహించాలని మంత్రి సవిత కోరారు. ఆప్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. పవనమూర్తి, జనరల్ మేనేజర్ ఎస్.అనూజారాణి, షోరూమ్ మేనేజర్ వై.గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సేవలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. భట్టి దంపతులు మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, దేవస్థాన ఈవో డి.పెద్దిరాజు స్వామి వారి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు. కాగా, మల్లన్నను దర్శించుకున్న వారిలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ (అచ్చంపేట), రాజేష్‌రెడ్డి (నాగర్ కర్నూలు), మేఘారెడ్డి(వనపర్తి), కసిరెడ్డి నారాయణరెడ్డి(కల్వకుర్తి) తదితరులు ఉన్నారు. ఆలయం వెలుపల డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.



మల్లన్న దర్శనానికి వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు

టీడీపీ నేతల ఒత్తిళ్లతో ప్రైవేటు స్కూలుకు మూత

- వైఎస్సార్ జిల్లా కమలాపురం టీడీపీ నేతల దారుణం
- వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చిన నారాయణ పాఠశాల యజమాని

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చాడనే నెపంతో ఓ ప్రైవేటు పాఠశాలనే మూసివేయించి సుమారు 600 మంది విద్యార్థులను ఇబ్బందుల్లోకి నెట్టారు టీడీపీ నేతలు. వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో టీడీపీ నేతల దాష్టీకమిది. వల్లూరు మండలం చెరువుకిందిపల్లె గ్రామానికి చెందిన కుంచం అనంతరెడ్డి కమలాపురం మండలంలోని కొండాయపల్లె వద్ద నారాయణ ఇంగ్లిషు మీడియం పాఠశాల ఏర్పాటు చేశారు. భారీ ఖర్చుతో భవనాలు నిర్మించారు. ఈ విద్యా సంవత్సరంలో సుమారు 600 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ఈ పాఠశాల టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డి స్వగ్రామానికి సమీపంలోనే ఉంది. ఎన్నికల్లో ఆయన కుమారుడు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కమలాపురం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కౌంటింగ్ ముగిసిన వెంటనే సదరు టీడీపీ నేత పాఠశాల యజమానిని దూషించడమే కాక పాఠశాల మూసివేయాలని హుకుం జారీ చేశారు. అధికారులపై ఒత్తిళ్లు పెంచి పాఠశాలను మూసి వేయించారు. ఈ క్రమంలో పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాల యజమానిపై ఒత్తిళ్లు అధికమయ్యాయి. వారికి ఏమి చెప్పాలో పాలుపోని పరిస్థితుల్లో ఆయన ఆదివారం సాయంత్రం నుండి కనిపించకుండా పోయాడు. ఈ మేరకు ఆయన బంధువులు కడపలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసలు పాఠశాల యజమాని ఉన్నాడో లేదో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గంవ్యాప్తంగా ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఏజెంట్‌పై టీడీపీ వర్గీయుల దాడి


కర్నూలు జిల్లా ఉయ్యాలవాడలో..



గాయపడిన సుధాకర్

ఓర్వకల్లు/సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డె సుధాకర్‌పై సోమవారం టీడీపీ శ్రేణులు దాడిచేశాయి. సుధాకర్ భార్య సునీత గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేసింది. సుధాకర్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఏజెంట్‌గా వ్యవహరించాడు. ఈ విషయాలను జీర్ణించుకోలేని గ్రామ టీడీపీ నాయకుడు కృష్ణయ్యచౌదరి అనుచరులు నన్నూరు గ్రామ సమీపంలోని రెడ్డి దాబాలో భోజనం చేస్తున్న సుధాకర్‌పై దాడిచేశారు. ఎన్నికల ఏజెంటుగా ఎందుకు కూర్చున్నావని నిలదీశారు. ఈ విషయంలో తప్పేముందని సుధాకర్ సమాధానం ఇవ్వడంతో కృష్ణయ్యచౌదరి, అనుచరులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అక్కడున్నవారు అడ్డుకుని గాయపడిన సుధాకర్‌ను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులను అడగగా తమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డే సుధాకర్‌పై టీడీపీ గూండాలు దాడిచేయటాన్ని శాసనమండలిలో విప్ లేళ్ళ అప్పిరెడ్డి ఖండించారు.

‘విజయవాడ’లో పలు రైళ్ల రద్దు, పునరుద్ధరణ



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని నిడదవోలు–కడియం సెక్షన్‌లో జరుగుతున్న ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా మంగళవారం నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు పలు రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్‌వో నుస్రత్ మండ్రూప్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రద్దయిన రైళ్లు: రాజమండ్రి–విశాఖపట్నం (07466/07467), విజయవాడ–కాకినాడ పోర్టు (17257/17258), మచిలీపట్నం–విశాఖపట్నం (17219/17220), తిరుపతి–కాకినాడ టౌన్ (17249/17250), గుంటూరు–విశాఖపట్నం (17339/17340), గుంటూరు–రాయగడ (17243/17244), విజయవాడ–విశాఖపట్నం (12718/12717), లింగంపల్లి–విశాఖపట్నం (12806/12805), చెంగల్‌పట్టు–కాకినాడ పోర్టు (17643/17644), గుంటూరు–విశాఖపట్నం (22702/22701), లింగంపల్లి–కాకినాడ టౌన్ (12776/12775), తిరుపతి–విశాఖపట్నం (22708/22707).

పునరుద్ధరణ: ఇప్పటికే రద్దు చేసిన కొన్ని రైళ్లను దశల వారిగా పునరుద్ధరించి నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. యశ్వంత్‌పూర్–టాటా (18112) రైలును ఈ నెల 30, జూలై 7, 14, 21, 28, ఆగస్టు 4 తేదీల్లో, కాకినాడ పోర్టు–విజయవాడ (17258/17257) రైళ్లను మంగళవారం నుంచి ఆగస్టు 12 వరకు, సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 15 వరకు, విశాఖపట్నం–లింగంపల్లి (12806) రైలును మంగళవారం నుంచి ఆగస్టు 10 వరకు, సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 15 వరకు, లింగంపల్లి–విశాఖపట్నం (12806) రైలును మంగళవారం నుంచి ఆగస్టు 11 వరకు, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు, చెంగల్‌పట్టు–కాకినాడ పోర్టు (17643) రైలును మంగళవారం నుంచి ఆగస్టు 10 వరకు, కాకినాడ పోర్టు–చెంగల్‌పట్టు (17644) రైలును మంగళవారం నుంచి ఆగస్టు 11 వరకు పునరుద్ధరించనున్నారు.

పవన్ ‘వారాహి’ దీక్ష

రేపటి నుంచి ప్రారంభం

సాక్షి, అమరావతి/మంగళగిరి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 26 నుంచి వారాహి అమ్మవారి దీక్ష చేపడతారని జనసేన పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 11 రోజులపాటు చేయనున్న ఈ దీక్షలో ఆయన పాలు, పండ్లు, ద్రవాహారం తీసుకుంటారని వెల్లడించింది. గతేడాది జూన్‌లో చేపట్టిన వారాహి విజయయాత్ర సందర్భంగానూ అమ్మవారికి పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారని పేర్కొంది.

మంత్రివర్గ శాఖలపై సూచనలివ్వండి

మంత్రివర్గంలో పవన్ కళ్యాణ్‌తో సహా జనసేనకు కేటాయించిన మంత్రిత్వ శాఖలకు సంబంధించి ఆన్‌లైన్‌లో గూగుల్ ఫామ్ ద్వారా ఎవరైనా సలహాలు, సూచనలు అందజేయొచ్చని జనసేన పార్టీ ‘ఎక్స్’లో కోరింది. ఇందుకు సంబంధించి పార్టీ రూపొందించిన ప్రత్యేక గూగుల్ ఫామ్‌లో సంబంధిత వ్యక్తి పేరు, మొబైల్ నంబర్, ఏ ప్రాంతానికి చెందినవారు వంటి వివరాలతో సూచనలు అందించవచ్చని పేర్కొంది. ఈ మేరకు ఆన్‌లైన్ ఫామ్‌కు సంబంధించిన లింక్‌ను ఎక్స్‌లో పోస్టు చేసింది.

జనసేన కార్యాలయం ఎదుట మహిళల ఆందోళన



రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర జనసేన పార్టీ కార్యాలయం ఎదుట సోమవారం మహిళలు ఆందోళనకు దిగడం ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పవన్ కళ్యాణ్‌ను కలిసేందుకు ఉభయగోదావరి జిల్లాలతో పాటు పలు ప్రాంతాల నుంచి మహిళలు మంగళగిరికి తరలివచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలను ఆయనకు ఇచ్చేందుకు రాగా పవన్ కళ్యాణ్ వారిని కలవలేదు. వినతిపత్రాలను తీసుకుని వారిని పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో తాము నేరుగా పవన్ కళ్యాణ్‌నే కలుస్తామని మహిళలు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మహిళలతో ఆందోళన విరమింపజేశారు.

తెలంగాణ

బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు కాల్

- బాంబు లేదని తెలియడంతో ఊపిరిపీల్చుకున్న ఖాకీలు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది

సనత్‌నగర్(హైదరాబాద్): ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసులు ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. అయితే ఎయిర్‌పోర్ట్ పేరును మెయిల్‌లో ప్రస్తావించకపోవడంతో దేశవ్యాప్తంగా పోలీసు బలగాలు అప్రమత్తమై అన్ని విమానాశ్రయాల్లో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా బేగంపేట విమానాశ్రయంలోనూ రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర బలగాలు రంగంలోకి దిగి అణువణువూ జల్లెడ పట్టాయి. బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్యతో పాటు ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, సెంట్రల్ ఫోర్స్ సైతం భారీగా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని మూడు గంటలకుపైగా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు లేదని తేలడంతో అటు పోలీసులు, ఇటు ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

హైదరాబాద్–విజయవాడ ఆరు లేన్ల రహదారిని త్వరగా పూర్తి చేయండి

కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల కారణంగా పెండింగ్‌లో ఉన్న హైదరాబాద్–విజయవాడ ఆరు లేన్ల జాతీయ రహదారి పనులను పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సోమవారం ఢిల్లీలో గడ్కరీతో ఆయన దాదాపు గంటపాటు భేటీ అయి రాష్ట్రానికి సంబంధించిన రోడ్డు ప్రాజెక్టులపై చర్చించారు. తర్వాత గడ్కరీతో చర్చించిన విషయాలను కోమటిరెడ్డి మీడియాతో పంచుకున్నారు. ప్రతిరోజూ 60వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిపై 17 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని గడ్కరీతో చెప్పామన్నారు. ఈ విషయాన్ని గతంలో గడ్కరీ దృష్టికి తీసుకురాగా.. మరమ్మతుల నిమిత్తం రూ.375 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారని చెప్పారు. అయితే వాటికి మరమ్మతులు చేయాల్సిన జీఎంఆర్ సంస్థ వివిధ సాకులతో రెండు పర్యాయాలు కోర్టుకు వెళ్లిందని, మూడోసారి టెండర్లు పిలిచి రెండు రోజుల క్రితం పనులు ప్రారంభించినట్లు తెలిపానన్నారు.





ఎంపీగా ప్రమాణం చేశాక రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ప్రధాని మోదీ • పార్లమెంట్ నూతన భవనంలో కొలువుదీరిన 18వ లోక్‌సభ

సభ్యుల ప్రమాణ స్వీకారం

తొలుత ప్రమాణం చేసిన మోదీ

- తర్వాత ప్యానెల్ స్పీకర్లు, మంత్రులు..
- తర్వాత అక్షరమాల ప్రకారం రాష్ట్రాలవారీగా సభ్యుల ప్రమాణం

న్యూఢిల్లీ: లోక్‌సభ తొలిరోజు సమావేశాల్లో ప్రమాణస్వీకార పర్వం కొనసాగింది. సోమవారం ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్యానెల్ స్పీకర్లు రాధా మోహన్ సింగ్, ఫగన్ సింగ్ కులస్తేలు నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు రాష్ట్రపతిభవన్‌లో భర్తృహరి చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణంచేయించారు. ఆ తర్వాత లోక్‌సభ ప్రారంభం అయిన వెంటనే వయనాడ్ స్థానానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన రాజీనామాను ఆమోదించినట్లు ప్రొటెం స్పీకర్ మెహతాబ్ ప్రకటించారు. అనంతరం 11.07 గంటలకు ప్రధాని మోదీ వరుసగా మూడోసారి ఎంపీగా హిందీలో ప్రమాణం చేయడంతో లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆరంభమైంది. ప్రధాని తర్వాత ప్యానెల్ స్పీకర్లు రాధామోహన్, కులస్తేలు ప్రమాణం చేశారు. తర్వాత మంత్రిమండలి సభ్యులు ఒకరి తర్వాత ఒకరు ప్రమాణం చేశారు. ముందుగా కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ తదితర మంత్రులు ప్రమాణం చేశారు. తర్వాత స్వతంత్ర హోదా ఉన్న సహాయకమంత్రులు తర్వాత సహాయక మంత్రులు ప్రమాణంచేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణం చేసేందుకు వెళ్తున్న సమయంలో 'నీట్ ఫెయిల్డ్ మినిస్టర్', నీట్-నెట్ అంటూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. తర్వాత మెహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించినందుకు నిరసనగా కాంగ్రెస్ సభ్యుడు కె.సురేశ్, డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు, టీఎంసీ సభ్యుడు సుదీప్ బంధోపాధ్యాయ్‌లు స్పీకర్‌ప్యానెల్ సభ్యులుగా ప్రమాణం చేయలేదు. ఎనిమిదిసార్లు ఎంపీగా గెలిచిన దళిత నేత సురేశ్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపికచేయనందుకు నిరసన తెలపాలని విపక్షపార్టీలు నిర్ణయించిన నేపథ్యంలో ఈ ముగ్గురు ప్యానెల్ స్పీకర్ల పదవులకు దూరంగా ఉండిపోయారు. ప్రమాణస్వీకారం మొదలుకాగానే సురేశ్, టీఆర్ బాలు, సుదీప్‌లు సభ నుంచి వాకౌట్‌చేశారు. ప్యానెల్ సభ్యుల ప్రమాణంవేళ ' రాజ్యాంగ ఉల్లంఘన' అని విపక్షసభ్యులు నినాదాలు చేశారు. తర్వాత అక్షరమాల ప్రకారం రాష్ట్రాలవారీగా సభ్యులు ప్రమాణంచేశారు. మిగతా సభ్యులు మంగళవారం ప్రమాణం చేయనున్నారు.

పలు భాషల్లో ప్రమాణాలు

ప్రమాణస్వీకారం వేళ సభలో భాషా వైవిధ్యం కనిపించింది. పలువురు ఎంపీలు తమ మాతృభాషలో ప్రమాణంచేశారు. ఇంగ్లిష్‌తోపాటు సంస్కృతం, డోగ్రీ, బెంగాలీ, అస్సామీ, ఒడియా, మరాఠీ, తదితర భాషల్లో ప్రమాణంచేశారు. అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ, జ్యోతిరాదిత్య సింధియా, ఖట్టర్ హిందీలో ప్రమాణంచేశారు. ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి కన్నడలో, విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒడియాలో, పోర్ట్‌లు, నౌకాయాన మంత్రి సర్బానంద సోనోవాల్ అస్సామీలో, విద్యుత్, పునరుత్పాదక ఇంధన సహాయ మంత్రి శ్రీపాద్ వై నాయక్ సంస్కృతంలో, పర్యాటకం , పెట్రోలియం మంత్రి సురేష్ గోపి మలయాళంలో సభ్యులుగా ప్రమాణం చేశారు. లోక్‌సభ ప్రారంభానికి శుభసూచకంగా సభ్యులంతా తొలుత లేచి నిలబడి కొద్దిసేపు మౌనంగా ఉన్నారు.

తొలి వరుసలో రాహుల్, అఖిలేశ్

సభలో విపక్షాలకు కేటాయించిన కుర్చీల్లో మొదటి వరుసలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, టీఎంసీ నేత కళ్యాణ్ బెనర్జీ, ఎస్పీ నేతలు అఖిలేశ్ యాదవ్, అవదేశ్ ప్రసాద్‌లు కూర్చున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మూడో వరుసలో కూర్చున్నారు. తొలిసారి సభకు ఎన్నికైన దివంగత సుష్మాస్వరాజ్ కుమార్తె బాన్సురీ స్వరాజ్ సభలో అందరినీ పలకరిస్తూ కనిపించారు. సెల్ఫీలు దిగారు. ఎస్పీ సభ్యులు ఎర్రని టోపీలు, ఎర్ర కండువాలు ధరించి హిందీలో ముద్రించిన రాజ్యాంగ ప్రతులను పట్టుకొచ్చారు.

సభలో హైలైట్స్

- రైతు నేత, సీపీఐ (ఎం) ఎంపీ అమ్రా రామ్ ట్రాక్టర్‌లో పార్లమెంట్‌కు వచ్చారు.
- 'రేసుగుర్రం' నటుడు, బీజేపీ ఎంపీ రవికిషన్ ధోతీలో అలరించారు.
- శ్వేతవర్ణ చీరకట్టులో మండీ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
- తిహార్ జైలులో ఉన్న బారాముల్లా స్వతంత్ర ఎంపీ, నిందితుడు అబ్దుల్లా రషీద్ షేక్ బెయిల్ దొరక్కపోవడంతో ప్రమాణం చేయలేకపోయారు.
- తొలిసారి ఎంపీగా గెలిచిన మధ్యప్రదేశ్ బీజేపీ నాయకురాలు అనిత నగర్‌సింగ్ చౌహాన్ వేళ్లకు పెద్ద ఉంగరాలు, మెడలో భారీ సంప్రదాయ నగలతో సభకు వచ్చారు.
- టీవీ రాముడు అరుణ్ గోవిల్ అందరితో మాట్లాడుతూ కనిపించారు.
- కొందరు సభ్యులు తమ రాష్ట్ర సంప్రదాయ వస్త్రధారణలో కనిపించారు.
- మోదీ ప్రమాణం చేసేటప్పుడు ఎన్‌డీఏ నేతలంతా జైశ్రీరాం అని నినాదాలు చేశారు. అప్పుడు విపక్ష సభ్యులంతా లేచి రాజ్యాంగ ప్రతిని చూపించారు. కొందరు సభ్యులు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద సాష్టాంగ నమస్కారం చేసి లోపలికి వచ్చారు

రాజ్యాంగం వర్ధిల్లాలి

పార్లమెంట్ ప్రాంగణంలో 'ఇండియా' ఎంపీల నినాదాలు

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ ప్రారంభమైన తొలి రోజే ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీల నినాదాలతో పార్లమెంట్ ప్రాంగణం దద్దరిల్లింది. సోమవారం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా పార్లమెంట్ ప్రాంగణంలో గతంలో గాంధీజీ విగ్రహం ఉన్నచోట విపక్ష ఎంపీలు గుమికూడారు. రాజ్యాంగం ప్రతులను చేతబూని నినాదాలు చేశారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలి, రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం, మనమంతా కలిసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి అంటూ బిగ్గరగా నినదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం జోలికి రావొద్దు: రాహుల్

పవిత్రమైన మన రాజ్యాంగంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా నిస్సిగ్గుగా దాడి చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగం జోలికి రావొద్దని హెచ్చరించారు. ప్రతిపక్ష కూటమి సందేశం ప్రజల్లోకి వెళ్లిందన్నారు. రాజ్యాంగంపై ఎవరు దాడికి దిగినా సహించబోమని తేల్చిచెప్పారు. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. దేశంలో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనలకు ప్రధాని మోదీ బాధ్యత వహించాలన్నారు. దేశంలో ఏ శక్తి కూడా రాజ్యాంగాన్ని టచ్ చేయలేదని తేల్చిచెప్పారు. రాజ్యాంగాన్ని కచ్చితంగా కాపాడుకుంటామని స్పష్టంచేశారు.

ప్రభుత్వాన్ని నిలదీస్తాం

ప్రజా సమస్యలను పక్కనపెట్టి, ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో ప్రధాని మోదీ బిజీగా ఉన్నారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. రాజ్యాంగంపై దాడి చేయడాన్ని తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. ప్రజల గొంతుకను సభలో వినిపిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం నుంచి మోదీ తప్పించుకోలేరని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 15 రోజుల్లో ఎన్నో ఘోరాలు, ప్రమాదాలు జరిగాయని, పరీక్షల్లో పేపర్ లీకేజీలు చోటుచేసుకున్నాయని, ధరలు పెరిగిపోయాయని రాహుల్ గాంధీ విమర్శించారు.



పార్లమెంట్ ఆవరణలో రాజ్యాంగ ప్రతులు చేబూని నినదిస్తున్న విపక్ష సభ్యులు

పదేళ్లపాటు మోదీ అప్రకటిత ఎమర్జెన్సీ

నైతికంగా ఓడిపోయినా మోదీలో అహంకారం తగ్గలేదు: ఖర్గే

న్యూఢిల్లీ: ఎమర్జెన్సీపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తిప్పికొట్టారు. అప్పట్లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీని ప్రకటించి అమలు చేస్తే, గత పదేళ్లలో నరేంద్ర మోదీ ఎమర్జెన్సీ ప్రకటించకుండానే అమలు చేశారని విమర్శించారు. మోదీ విధించిన అప్రకటిత అత్యవసర పరిస్థితికి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ముగింపు పలికారని పేర్కొన్నారు. ఈ మేరకు ఖర్గే సోమవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని వెల్లడించారు. ఎన్నికల్లో నైతికంగా ఓడిపోయినప్పటికీ మోదీలో అహంకారం మాత్రం ఇంకా తగ్గలేదని మండిపడ్డారు. పరీక్ష పేపర్లు లీక్ కావడంతో యువత నష్టపోయారని, ప్రధాని మోదీ కనీసం సానుభూతి తెలపడం లేదని తప్పుపట్టారు. బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదంపై మాట్లాడడం లేదని ఆక్షేపించారు.

'ఎమర్జెన్సీ' మాయని మచ్చ

▶ మొదటి పేజీ తరువాయి

ధన్యవాదాలు తెలియజేశారు. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చామని, తమ ప్రభుత్వ బాధ్యత మూడు రెట్లు పెరిగిందని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గతంలో కంటే మూడు రెట్లు కష్టపడి పనిచేస్తుందని, మూడు రెట్లు ఫలితాలను తీసుకొస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. "ప్రజాస్వామ్య పార్లమెంటరీ చరిత్రలో ఇదొక గర్వించదగ్గ, అద్భుతమైన రోజు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత తొలిసారి నూతన పార్లమెంట్ భవనంలో ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఈ సందర్భంగా కొత్త ఎంపీలకు నా అభినందనలు. సామాన్య ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కొత్త ఉత్సాహంతో సరికొత్త శిఖరాలను అధిరోహించేందుకు ఇదొక సువర్ణావకాశం. 2047 నాటికి వికసిత్ భారత్ అనే లక్ష్య సాధనకు మనమంతా కలిసి పనిచేద్దాం. అభివృద్ధి చెందిన భారత్ అనే సంకల్పాన్ని నెరవేర్చడానికి, ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి మనం చేతులు కలపాలి" అని మోదీ పిలుపునిచ్చారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మెజార్టీ అవసరం అయినప్పటికీ, దేశాన్ని ముందుకు నడిపించేందుకు ఏకాభిప్రాయం చాలా ముఖ్యమని తాము విశ్వసిస్తున్నానని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఇదే సంప్రదాయాన్ని నెలకొల్పేందుకు తాము ప్రయత్నించామన్నారు. 140 కోట్ల మంది పౌరుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ ఏకాభిప్రాయం సాధించడం ద్వారా దేశానికి సేవ చేయాలనేది తమ ప్రభుత్వ ప్రయత్నమని పేర్కొన్నారు. ఇదే సమయంలో 18వ సంఖ్య ప్రాముఖ్యతను ప్రధాని నొక్కిచెప్పారు. "18వ లోక్‌సభలో చాలామంది యువ ఎంపీలు ఎన్నికయ్యారు. భారతీయ సంప్రదాయాల ప్రకారం 18 సంఖ్యకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. భగవద్గీతలో కర్మ, కర్తవ్యం, కరుణ సందేశాన్ని అందించే 18 అధ్యాయాలు ఉన్నాయి. పురాణాలు, ఉప పురాణాల సంఖ్య 18. దీనికితోడు దేశంలో చట్టపరమైన ఓటింగ్ వయస్సు 18 ఏళ్లు. అమృతకాల సమయంలో 18వ లోక్‌సభ ఏర్పాటు కావడం శుభసూచకం " అని అన్నారు.

స్పీకర్ పదవిపై వీడని సస్పెన్స్



న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎవరుంటారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్డీఏలోని మిత్రపక్షాలతో బీజేపీ సంప్రదింపులు మొదలుపెట్టింది. ఈ నెల 26న జరిగే స్పీకర్ ఎన్నికకు మంగళవారం నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. 293 మంది ఎంపీలతో ఎన్డీఏ సంకీర్ణానికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఎన్డీఏ తమ స్పీకర్ అభ్యర్థి ఎవరనే దానిపై ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. పలు ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. అయితే విపక్ష ఇండియా కూటమికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని భావిస్తోంది. మరోవైపు ఇండియా కూటమి స్పీకర్ పదవికి పోటీపడే అంశాన్ని చురుకుగా పరిశీలిస్తోందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. స్పీకర్‌పై ఎలాంటి తుది నిర్ణయాన్ని తమకు తెలుపలేదని, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో సహా కూటమి నేతలందరూ కలిసి నిర్ణయం తీసుకుంటారని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. బీజేపీ నాయకత్వం తనతో సంప్రదింపులు జరిపిందని ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నాయకుడొకరు తెలిపారు. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. బీజేపీ తమ అగ్రనేతలందరికీ మునుపటి శాఖలే కేటాయించి.. కొనసాగింపును భూమికగా ఎంచుకున్నందున 17వ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కొనసాగించొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఎన్డీఏ వైఖరిని బట్టి స్పీకర్ పోస్టుకు తమ అభ్యర్థిని పోటీకి నిలుపడంపై నిర్ణయం తీసుకుంటామని ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు కేటాయించడం సంప్రదాయంగా వస్తోందని, బీజేపీకి అందుకు ముందుకు రాకపోతే పోటీచేయక తప్పదని ఇండియా కూటమి నేతలు అంటున్నారు. కొత్త స్పీకర్‌పై ఏకాభిప్రాయాన్ని నిర్మించడానికి విపక్షాలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతుందని, అలా జరగని పక్షంలో తాము స్పీకర్ పదవికి పోటీ పెడతామని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షమైన రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఎంపీ ఎన్‌కే ప్రేమచంద్రన్ సోమవారం విలేకరులతో అన్నారు. ఎన్డీఏ అభ్యర్థి ఎవరనేది మాకు తెలిపిన తర్వాత పోటీపై నిర్ణయం తీసుకుంటామని ఇండియా కూటమికి చెందిన నాయకుడొకరు అన్నారు. బలహీనవర్గాలకు చెందిన అభ్యర్థిని పోటీ పెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇండియా కూటమికి 234 మంది ఎంపీల బలముంది.

అయోధ్య గర్భాలయంలోకి

వర్షపు నీరు

అయోధ్య: హోరు వర్షం ధాటికి అయోధ్య రామాలయం గర్భాలయ నిర్మాణంలో లోపాలు వెలుగుచూశాయని రామజన్మ భూమి ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ సోమవారం ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం అర్ధరాత్రి అయోధ్యలో కురిసిన భారీ వర్షం కారణంగా గర్భగుడిలో బాలరాముడిని పూజించేందుకు పూజారులు కూర్చునే చోట, దర్శనార్థం వీఐపీ భక్తులు వచ్చే మార్గంలోనూ వర్షపు నీరు లీక్ అవుతోందని దాస్ ఆరోపించారు. వర్షపు నీరు బయటకు వెళ్లడానికి ఎలాంటి డ్రైనేజీ వ్యవస్థ గుడిలో లేదని తెలిపారు. దీనిని తీవ్రమైన సమస్యగా పరిగణించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆలయ యాజమాన్యాన్ని ఆయన కోరారు. " దేశవ్యాప్తంగా దిగ్గజ ఇంజనీర్లు అయోధ్య ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. జనవరి 22న ఆలయానికి ప్రాణ ప్రతిష్టచేశారు. ప్రపంచప్రఖ్యాత ఆలయం ప్రారంభమయ్యాక పడిన తొలి భారీ వర్షానికే నీరు లీక్ అవడం ఆశ్చర్యంగా ఉంది. ఎందుకిలా జరుగుతోంది? అనుభవజ్ఞులైన ఇంజనీర్లు కట్టినా ఇలాంటి ఘటన జరగడం పెద్ద తప్పే' అని అన్నారు. దీంతో హుటాహుటిన ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా అక్కడికి చేరుకున్నారు. తక్షణం కప్పుకు మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. " ఆలయం మొదటి అంతస్తులో ఇంకా పనులు పూర్తికాలేదు. జూలైకల్లా పూర్తిచేస్తాం. డిసెంబర్‌కల్లా మొత్తం ఆలయనిర్మాణం పూర్తిఅవుతుంది' అని వివరణ ఇచ్చారు.

సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

- హైకోర్టు తప్పు చేస్తే తాము కూడా చేయాలా? అని ప్రశ్నించిన ధర్మాసనం
- హైకోర్టు ఉత్తర్వుల కోసం ఎదురుచూడాలని కేజ్రీవాల్‌కు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మరోసారి నిరాశే ఎదురయ్యింది. సుప్రీంకోర్టులో ఆయనకు ఊరట దక్కలేదు. తనకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన రెగ్యులర్ బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేసేందుకు నిరాకరించింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మనూ సింఘ్వీ వాదనలు వినిపించారు. ట్రయల్ కోర్టు నుంచి లిఖిత పూర్వక ఆదేశాలు రాకముందే బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే ఇవ్వడం సరికాదని చెప్పారు. కింది కోర్టు ఆర్డర్‌ను చూడకుండా హైకోర్టు స్టే ఇచ్చినప్పుడు, హైకోర్టు ఆర్డర్‌పై సుప్రీంకోర్టు ఎందుకు స్టే ఇవ్వకూడదని అన్నారు. జస్టిస్ మిశ్రా స్పందిస్తూ.. హైకోర్టు తప్పుడు చేస్తే మమ్మల్ని కూడా తప్పు చేయమంటారా? అని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాలను రిజర్వ్ చేయడం అసాధారణ పరిణామమని వ్యాఖ్యానించారు. సాధారణంగా బెయిల్‌పై అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవచ్చని, రిజర్వ్ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. అయితే, ఢిల్లీ హైకోర్టు నుంచి ఆదేశాలు వెలువడక ముందే సుప్రీంకోర్టు విచారణ జరపడం ముందుగానే చర్యలు తీసుకుంటున్నట్లుగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు ఉత్తర్వులు వెలువడిన తర్వాత కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణ చేపడతామని వెల్లడించింది. హైకోర్టు ఉత్తర్వుల కోసం ఎదురుచూడాలని కేజ్రీవాల్‌కు సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తుది ఉత్తర్వులు జారీ చేయనుంది.



రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాత్రి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన విందులో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, మంత్రులు

రష్యాలో మరో ఉగ్రఘాతుకం

- రెండు చర్చిలు, యూదు ప్రార్థనా మందిరంపై దాడి
- 15 మంది పోలీసులు సహా 20 మంది మృతి

మాస్కో: రష్యాలోని ముస్లిం ప్రాబల్య దక్షిణ ప్రాంత దగెస్తాన్ రిపబ్లిక్‌లో ఉగ్రవాదులు పేట్రేగిపోయారు. ఆదివారం సాయంత్రం ఏకకాలంలో దగెస్తాన్ రాజధాని మఖచ్కాలాలోని ఓ చర్చి, ఓ ట్రాఫిక్ పోలీస్ పోస్ట్‌పైనా కాల్పులు జరపడంతోపాటు డెర్బెంట్ నగరంలోని ఒక చర్చి, ఒక యూదు ప్రార్థనా మందిరంలో దాడి చేసి నిప్పుపెట్టారు. ఉగ్రవాదులు డెర్బెంట్ ట్రినిటీ సండే చర్చిలో ఉన్న రెవరెండ్ నికోలాయ్ కొటెల్నికోవ్ (66)గొంతుకోసి చంపడంతోపాటు ఆ చర్చికి నిప్పుపెట్టారని అధికా రులు తెలిపారు. రెండు ఘటనల్లో 15 మంది పోలీసులు, ఒక బోధకుడు సహా 20 మంది చనిపోయారు. క్షతగాత్రులైన 46 మందిలో 13 మంది పోలీసు సిబ్బంది కూడా ఉన్నారు. నలుగురు పోలీసు అధికారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. భద్రతా బలగాల ఎదురు దాడిలో ఆరుగురు ఉగ్రవాదులు హతమ య్యారన్నా రు. అయితే, ఈ ఘటనల్లో ఎందరు ఉగ్రవా దులు పాల్గొన్నదీ వారు వివరించలేదు. హతమైన వారిలో ఉగ్రవాదుల్లో ముగ్గురిని రష్యాలోని ప్రధాన యునైటెడ్ రష్యా పార్టీకి దగెస్తాన్ హెడ్‌గా ఉన్న మగోమెద్ ఒమరోవ్ ఇద్దరు కుమారులు, బంధువుగా అధికారులు గుర్తించారు.

క్షీణిస్తున్న ఢిల్లీ మంత్రి అతిశి ఆరోగ్యం



న్యూఢిల్లీ: హరియాణా నుంచి ఢిల్లీకి వాటా కింద రావాల్సిన తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ జలశాఖ మంత్రి అతిశి చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఆమె ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోందని, ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించాలంటూ డాక్టర్లు సూచించారని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు వెల్లడించారు. అయితే, చికిత్స పొందడానికి అతిశి నిరాకరించారు. హరియాణా నుంచి నీటి సరఫరా ప్రారంభమయ్యేదాకా దీక్ష కొనసాగిస్తానని తేల్చిచెప్పారు. తన శరీరంలో రక్తపోటు, చక్కెర స్థాయిలు పడిపోయాయని, బరువు తగ్గిపోతున్నానని అతిశి పేర్కొన్నారు. ప్రమాదకరమైన కీటోన్ స్థాయి పెరిగిపోతోందన్నారు. తన ఆరోగ్యం ఎలా ఉన్నప్పటికీ దీక్ష మాత్రం ఆపబోనని స్పష్టం చేశారు. ఈ నెల 21న దీక్ష ప్రారంభించినప్పుడు అతిశి 65.8 కిలోల బరువు ఉండగా, సోమవారం 63.6 కిలోలకు చేరుకున్నారు.

ప్రధాని మోదీకి ఢిల్లీ మంత్రుల లేఖ

దేశ రాజధాని నగరంలో నీటి సంక్షోభాన్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీ కేబినెట్ మంత్రులు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. హరియాణా నుంచి ఢిల్లీకి వాటా కిం రావాల్సిన నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో వడగాడ్పులు వీస్తున్నాయని, సరిపడా నీరు రాకపోవడంతో జనం కష్టాలు ఎదుర్కొంటున్నారని లేఖలో ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు.

రాజ్యసభ నేతగా జేపీ నడ్డా



న్యూఢిల్లీ: బీజేపీ చీఫ్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా రాజ్యసభాపక్ష నేతగా నియమితులయ్యారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. ఇటీవలి ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికైన గోయల్ సోమవారం లోక్‌సభ సభ్యునిగా ప్రమాణం చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్నారు. నడ్డాతోపాటు మరో 11 మంది కేంద్ర మంత్రులు రాజ్యసభ సభ్యులుగా ఉన్న విషయం తెల్సిందే. రాజ్యసభ నేతగా నియమితులైన జేపీ నడ్డాను కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అభినందించారు. సభలో అభిప్రాయాలను స్వేచ్ఛగా వినిపించేందుకు ప్రతిపక్షానికి అవకాశం కల్పించాలని నడ్డాను కోరారు.

నీట్‌ను ఎత్తివేయండి: మమత

ప్రవేశ పరీక్షల నిర్వహణను రాష్ట్రాలకే వదిలేయండి



కోల్‌కతా: వైద్య విద్యలో ప్రవేశాల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీకృత నీట్‌ను ఎత్తివేయాలని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఇదివరకటిలాగే రాష్ట్రాలకు ప్రవేశ పరీక్షలను నిర్వహించుకునే వెసులుబాటును కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నీట్ పేపర్ లీక్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మమత ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. నీట్-యూజీలో అవకతవకలను బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. 'వైద్య విద్యలో ప్రవేశాలకు రాష్ట్రాలు సొంతంగా పరీక్షలు నిర్వహించే పాత పద్ధతిని తేవడానికి తక్షణం చర్యలు తీసుకోవాలి. కేంద్రీకృత నీట్ పరీక్షను రద్దు చేయాలి' అని మమత కోరారు. అప్పుడే విద్యార్థులకు వ్యవస్థపై విశ్వాసం కల్పించగలమని, సాధారణ పరిస్థితులు నెలకొల్పగలుగుతామని పేర్కొన్నారు.

సరోగసీతో తల్లులయ్యే వారికీ ప్రసూతి సెలవు

తాజాగా నిబంధనలు మార్చిన కేంద్రం



న్యూఢిల్లీ: సరోగసీ(అద్దె గర్భం) ద్వారా సంతానవంతులైన ప్రభుత్వ ఉద్యోగినులు కూడా ఇకపై 180 రోజుల ప్రసూతి సెలవు తీసుకోవచ్చు. ఇందుకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం 50 ఏళ్లనాటి సెంట్రల్ సివిల్ సర్వీసెస్(లీవ్) రూల్స్-1972లోని నిబంధనలను తాజాగా సవరించింది. దీని ఫలితంగా, సరోగసీ ద్వారా తండ్రి అయ్యే ఉద్యోగులు సైతం 15 రోజుల పితృత్వ సెలవు తీసుకోవచ్చు. 'ఇద్దరు కంటే తక్కువ మంది జీవించి ఉన్న సంతానం కలిగిన అద్దెగర్భం ధరించిన మహిళ, కాబోయే తల్లి..వీరిలో ఏ ఒక్కరైనా లేదా వీరిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ 180 రోజుల ప్రసూతి సెలవుకు అర్హులే'అని సిబ్బంది వ్యవహారాల శాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. అదే సమయంలో, ఇద్దరు కంటే తక్కువ మంది జీవించి ఉన్న సంతానం కలిగి, సరోగసీ ద్వారా తండ్రయ్యే ప్రభుత్వ ఉద్యోగి కూడా బిడ్డ జన్మించిన తేదీ నుంచి ఆరు నెలల్లోపు ఎప్పుడైనా 15 రోజుల మాతృత్వ సెలవును వాడుకోవచ్చని కూడా ఈ నెల 18న విడుదల చేసిన ఆ నోటిఫికేషన్‌లో వివరించింది.

లిథియం బ్యాటరీ ఫ్యాక్టరీలో పేలుడు

దక్షిణ కొరియాలో 22 మంది కార్మికుల దుర్మరణం



సియోల్: దక్షిణ కొరియాలోని లిథియం బ్యాటరీ తయారీ కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో 22 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఎనిమిది మంది గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం దేశరాజధాని సియోల్ దగ్గర్లోని హవాసియాంగ్ సిటీలో ఎరిసెల్ కంపెనీకి చెందిన లిథియం బ్యాటరీ ఫ్యాక్టరీ ఉంది. సోమవారం ఉదయం 10.30గంటలప్పుడు 102 మంది కార్మికులు పనిచేస్తున్న సమయంలో అక్కడి కొన్ని బ్యాటరీలు పేలాయి. దీంతో రెండో అంతస్తుల్లో మంటలంటుకుని ఫ్యాక్టరీలో దావానంలా వ్యాపించాయి. దీంతో 22 మంది అగ్నికి ఆహుతయ్యారు. వీరిలో 18 మంది చైనా కార్మికులు ఉన్నారు. తయారైన బ్యాటరీలను తనిఖీచేసి ప్యాక్ చేస్తుండగా ఈ ఘటన జరిగిందని తెలుస్తోంది. అయితే పేలుడుకు ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా ఒకరి జాడ తెలీడంలేదు. ఘటనాస్థలిని ప్రధాని హాన్ డ్యుక్ సో సందర్శించారు.

ఐబీ చీఫ్ డేకా పదవీకాలం ఏడాది పొడిగింపు



న్యూఢిల్లీ: ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) చీఫ్ తపన్ కుమార్ డేకా పదవీ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 2025 జూన్ వరకు బాధ్యతల్లో కొనసాగుతారని సోమవారం కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ తెలిపింది. ఈ నెల 30వ తేదీన ముగియనున్న డేకా పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించిందని వెల్లడించింది. 1988 బ్యాచ్ హిమాచల్ ప్రదేశ్ కేడర్ ఐపీఎస్ అయిన డేకా 1998లో ఐబీలో చేరారు. 2022 జూలై ఒకటో తేదీన ఆయన ఐబీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా, జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్సీ) సెక్రటరీ జనరల్ భరత్ లాల్ పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగిస్తూ సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులిచ్చింది.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

మంగళవారం : 25 : జూన్ : 2024



సోమవారం బెళగావి వద్ద బయలు ప్రదేశంలో కనువిందుగా నెమళ్ల సంచారం

న్యూస్‌రీల్

చిరుత బందీ



మైసూరు: ఒక పాడుబడి ఉన్న ఇంటిలో చిరుతపులి దాక్కుందని తెలిసి అటవీ సిబ్బంది బోనులు పెట్టి చిరుతను బంధించారు. జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని యాలహళ్ళి గ్రామంలో చోటుచేసుకుంది. అడవిలో నుంచి ఆహారం కోసం వచ్చిన చిరుత గ్రామంలో మహాదేవప్పకు అనే వ్యక్తికి చెందిన పాడుబడిన ఇంట్లో మకాం వేసింది. స్థానికులు సమాచారం ఇవ్వగా అటవీ సిబ్బంది చేరుకుని చుట్టూ వలలు, బోనులు ఏర్పాటు చేశారు. చివరకు దానిని బంధించారు. స్థానిక యువకుడు ఒకరు బోనులో ఉన్న చిరుతతో సెల్ఫీ కి ప్రయత్నిస్తుండగా పంజాతో అతని వీపు మీద దాడి చేసింది. దీంతో స్వల్ప గాయాలయ్యాయి. అతన్ని మైసూరు కేఆర్ ఆస్పత్రికి తరలించారు.

రోగిని తరలిస్తున్న అంబులెన్స్ బోల్తా



దొడ్డబళ్లాపురం: రోగిని ఆస్పత్రికి తీసికెళ్తున్న అంబులెన్స్ టైర్ పేలి బోల్తాపడ్డ సంఘటన అరకలగూడు-హాసన్ మార్గంలో చోటుచేసుకుంది. లోపల ఉన్న రోగితో పాటు ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అరకలగూడు నుండి రోగితో వస్తున్న అంబులెన్స్ హాసన్ శివారులో శ్రీరామనగర్ వద్ద టైర్ పేలి రోడ్డుపక్కకు బోల్తాకొట్టింది. సమాచారం అందుకున్న హాసన్ ట్రాఫిక్ పోలీసులు రోగిని మరో అంబులెన్స్‌లో తరలించారు.

ధర్మస్థలలో యడియూరప్ప



దేవస్థానంలో యడియూరప్ప

యశవంతపుర: బీజేపీ మాజీ సీఎం యడియూరప్ప సోమవారం ధర్మస్థల మంజునాథ స్వామిని దర్శించుకున్నారు. చాలా ఏళ్ల తరువాత స్నేహితులతో కలిసి ధర్మస్థలకు వచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో వర్షాభావం కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, బాగా వర్షాలు పడి విరివిగా పంటలు పండాలని స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. ఆలయ ధర్మాధికారి వీరేంద్రహెగ్గె ఆయన వెంట ఉన్నారు.

త్వరలో పెళ్లి.. బీజేపీ నేత అరెస్టు



నిందితుడు అరుణ్

శివమొగ్గ: మహిళను వేధింపులకు గురి చేస్తున్న ఆరోపణలపై బీజేపీ యువ మోర్చా శివమొగ్గ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ కుక్కెని పోలీసులు అరెస్టు చేశారు. అరుణ్ కుక్కె తనపైన అత్యాచారం చేశాడని, తరచూ వేధింపులకు పాల్పడుతున్నాడని శివమొగ్గ నగరానికి చెందిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అరుణ్‌కు ఈ నెల 28వ తేదీన ఓ యువతితో పెళ్లి జరగాల్సి ఉంది. అంతలోనే కటకటాల పాలు కావడం గమనార్హం.

సాయం కోసం అబలల ఆక్రోశం

వారు ఆకాశంలో సగమైనప్పటికీ ఆవేదన మాత్రం తీరనిది. రాష్ట్రంలో, అందులోనూ సిలికాన్ నగరంలో మహిళలు సురక్షితంగా ఉన్నారనుకుంటే పొరపాటే. ఇంటా బయటా సమస్యలతో పోరాటం చేయాల్సి వస్తోంది. రక్షకులు కూడా భక్షకులుగా ఎదురవుతారు. ఇలాంటప్పుడు సహాయం కోసం మహిళా కమిషన్ తలుపులు తడతారు.

- దౌర్జన్యాలపై మహిళా కమిషన్‌కు వనితల మొర
- బెంగళూరులో నాలుగేళ్లలో 2,861 ఫిర్యాదులు
- భద్రతకు భరోసా అంతంతే



కుటుంబ హింస కేసులు పెరుగుతున్నాయి



లైంగిక దాడులకు వ్యతిరేకంగా బెంగళూరులో మహిళా సంఘాల ర్యాలీ (ఫైల్)

బనశంకరి: విద్యావంతులు, ఉద్యోగస్తులు అధికంగా ఉండే బెంగళూరు నగరంలో మహిళల సురక్షత కోసం సేఫ్ సిటీ పథకం కింద వేలాదిగా సీసీ కెమెరాల పర్యవేక్షణ, హెల్ప్‌లైన్లు అమలు చేసినప్పటికీ మహిళలపై దాడులు, దౌర్జన్యాలు తగ్గుముఖం పట్టలేదు. వనితలు పనిచేసే స్థలాల్లో వేధింపులు, కుటుంబంలో సతాయింపులు, వరకట్న వేధింపులు, అత్యాచారాలు తదితరాలపై రాష్ట్ర మహిళా కమిషన్‌కు వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయి.

- 2021- 22 నుంచి 2023- 24 ఏప్రిల్ వరకు బెంగళూరు నగర జిల్లాకు సంబంధించి 2,861 ఫిర్యాదులు మహిళా కమిషన్‌కు అందాయి. ఇందులో కుటుంబ దాడులు, కట్న వేధింపులు, ప్రేమ మోసాలు, ఆఫీసుల్లో వేధింపులు ఎక్కువగా ఉన్నాయి.

కట్నం, ప్రేమ వేధింపులు

బెంగళూరు నగర జిల్లాలో 191 వరకట్న వేధింపుల ఫిర్యాదులు రాగా 5 శాతం కేసుల్లో ఫిర్యాదులు అబద్ధాలని తేలింది. పలు ఫిర్యాదులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించారు. ప్రేమించి మోసం చేశారని, ప్రేమ పేరుతో దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ 146 మంది సాయం కోరారు. ఇందులో 50 శాతం బాధితులు, నిందితులు విద్యావంతులే ఉన్నారు.

పోలీసులపై 67 మంది ఫిర్యాదు

మహిళా ఉద్యోగులపై ఆఫీసుల్లో దాడుల గురించి బెంగళూరు నగర జిల్లాలో 2021-22 నుంచి 2024-25 వరకు 89 ఫిర్యాదులు నమోదయ్యాయి.

- తమపై పోలీసులు దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ 67 మంది మహిళలు ఫిర్యాదు చేశారు.
- ఇటీవల మెట్రో రైల్ సంస్థలో మహిళా సిబ్బందిని ఇద్దరు సీనియర్ అధికారులు దూషించడంపైనా ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేపట్టి నివేదిక అందించాలని మెట్రో ఎండీకి కమిషన్ ఆదేశించింది.
- సాధారణంగా మహిళలు దాచుకున్న డబ్బును వడ్డీ వస్తుందని తెలిసినవారికి అప్పు ఇస్తుంటారు. చీటీలు కట్టడం పరిపాటి. ఇలా చేసి మోసపోయామని 24 మంది ఫిర్యాదు చేశారు.

న్యాయం కోసం చర్యలు: ఛైర్‌పర్సన్

95 శాతం కేసుల్లో ఫిర్యాదులు నిజమైనవే. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. కుటుంబంలో దౌర్జన్యాలతో పాటు మరికొన్ని కేసుల్లో నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యను పరిష్కరిస్తున్నామని మహిళా కమిషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి తెలిపారు.



2022-23 లో అత్యధిక ఫిర్యాదులు

బెంగళూరు నగర జిల్లాలో 2021-22లో 928 ఫిర్యాదులు, 2022-23లో 969, 2023-24లో 890, ఈ ఏడాది ఏప్రిల్ వరకు 74 ఫిర్యాదులు మహిళా కమిషన్‌కు అందాయి. 2022-23లో కేసుల తీవ్రత ఎక్కువగా ఉంది. ఆ ఏడాది 802 కుటుంబ దౌర్జన్య కేసులే ఉన్నాయి. భర్తలు ఏ పనీ చేయకుండా మద్యానికి బానిస కావడం, నిత్యం భార్యా పిల్లలను కొట్టడంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇలాంటి కేసుల్లో దంపతులను కూర్చోబెట్టి కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వివాదం సమసిపోలేదు. మళ్లీ పోలీస్ స్టేషన్లు, ఫ్యామిలీ కోర్టును ఆశ్రయిస్తున్నారని అధికారులు తెలిపారు.

ఒంటిపై పేడ పూసుకుని రైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

బనశంకరి: గుడిసె నివాసులకు ఇంటి భాగ్యం కల్పించాలి, పాడి రైతులకు ప్రోత్సాహకధనం తక్షణం విడుదల తదితర డిమాండ్లతో రైతులు భారీ ధర్నాకు దిగారు. సోమవారం కనకపుర రోడ్డు నుంచి పాదయాత్ర చేపట్టిన రైతులు కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. పాదయాత్రను విశ్రాంత లోకాయుక్త సంతోష్ హెగ్డే ప్రారంభించారు. కొందరు రైతులు ఒంటిపై పేడ పూసుకుని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మార్గమధ్యలో పోలీసులు బ్యారికేడ్లు అడ్డు పెట్టి వారిని నిలువరించారు. పోలీసులు, రైతుల మధ్య తోపులాట జరిగింది. కోపోద్రిక్తులైన రైతులు తమ సమస్యలను పరిష్కరించడం అధికారులకు చేతకాదని, వ్యవసాయ మంత్రి ఘటనా స్థలానికి రావాలని మండిపడ్డారు.

దొంగను పట్టించిన కెమెరాలు



చోరీకి యత్నిస్తున్న ప్రకాశ్‌బాబు

యశవంతపుర: శుక్రవారం అర్ధరాత్రి ఉడుపి జిల్లా గొంగోళ్లిలో ముళ్లికట్టె పంచగంగా వ్యవసాయ సేవా సహకార సంఘం ఆఫీసులో చోరీకి వచ్చిన దొంగను సకాలంలో గుర్తించి పట్టుకున్నారు. కేరళలోని కొల్లంకు చెందిన ప్రకాశ్‌బాబు పాత నేరస్తుడు. సొసైటీలో చోరీకి వచ్చాడు. బీరువాలోకి చేయిపెట్టి నగదు కోసం వెతుకుతుండగా, సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు 10 నిముషాలలో చేరుకొని దొంగను అరెస్ట్ చేశారు.

సూరజ్‌కు 8 రోజుల పోలీసు కస్టడీ

- ఇక ఎమ్మెల్సీ విచారణ పర్వం



సూరజ్, శివకుమార్

బనశంకరి: యువకునిపై అసహజ లైంగిక దాడి కేసులో అరెస్టయిన జేడీఎస్ ఎమ్మెల్సీ హెచ్‌డీ సూరజ్ రేవణ్ణకు బెంగళూరు నగర 42వ ఏసీఎంఎం కోర్టు 8 రోజుల పాటు పోలీసు కస్టడీకి ఆదేశించింది. సోమవారం సీఐడీ పోలీసులు సూరజ్‌ని కోర్టులో హాజరుపరిచారు. విచారణ కోసం 14 రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఆదేశించాలని ప్రభుత్వ న్యాయవాది మనవిచేశారు. చివరకు జడ్జి 8 రోజులకు అనుమతించారు. జూలై 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు సూరజ్‌ను కోర్టులో హాజరుపరచాలని జడ్జి ఆదేశించారు. అంతకుముందు ఆదివారం రాత్రి హాసన్ నుంచి బెంగళూరుకు తరలించి ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు జడ్జి ముందు సూరజ్‌ను హాజరుపరచగా 14 రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి ఆదేశించడంతో పరప్పన అగ్రహార జైలుకు తరలించారు. మళ్లీ సోమవారం కోర్టుకు తరలించి రిమాండుకు తీసుకుని విచారణ ప్రారంభించారు.

సూరజ్ అప్తుని కోసం గాలింపు

యశవంతపుర: ఎమ్మెల్సీ సూరజ్ ఆప్తుడు శివకుమార్ అదృశ్యమయ్యాడు. లైంగిక దాడి కేసులో ఇతడు రెండవ నిందితునిగా ఉన్నారు. శివకుమార్ ఓ బాధిత మహిళను బ్లాక్ మెయిల్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సూరజ్ రేవణ్ణ లైంగికంగా వేధించాడని బాధిత మహిళ హొళెనరసీపుర గ్రామాంతర పోలీసులకు ఫిర్యాదు చేయగా శివకుమార్‌ను 2 నిందితుడిగా చేర్చారు. తనపై లైంగికంగా వేధించారని, ఆస్పత్రికి వెళ్లాలని వేడుకున్నా శివకుమార్ పంపలేదని మహిళ ఆరోపించారు.

కాబోయే వైద్యురాలు కాటికి

- పీజీ మెడికోకు డెంగీ జ్వరం
- అదే కాలేజీలో అరకొర వైద్యం
- పరిస్థితి విషమించి కన్నుమూత
- సుళ్యలో వైఎస్సార్ జిల్లా యువతి విషాదాంతం



మెడికో సజని (ఫైల్)

బనశంకరి: మంగళూరులో మెడిసిన్ పీజీ చదువుతున్న వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల కు చెందిన వైద్య విద్యార్థిని డెంగీ జ్వరంతో మరణించింది. ఎర్రగుంట్ల మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పీ.మాధురి, వెంకటరమణారెడ్డి కుమార్తె పడిగపాటి సజని (27) మంగళూరు వద్ద సుళ్యలో కేవీజీ మెడికల్ కాలేజీలో గైనకాలజీలో పీజీ విద్యార్థిని. 18న సజనికి జ్వరం రావడంతో అదే మెడికల్ కాలేజీలోనే వైద్యం చేయించుకుంది. డెంగీ అని నిర్ధారణ కాగా ప్లేట్‌లేట్స్ తగ్గిపోయాయి. సరైన వైద్యం అందించకపోవడంతో ప్లేట్‌లేట్స్ బాగా తగ్గి సజని ఆరోగ్యం విషమించింది. కాలేజీ సిబ్బంది ఆలస్యంగా తల్లిదండ్రులకు చెప్పడంతో హైదరాబాద్ నుంచి మంగళూరుకు బయలుదేరారు. కానీ సజని ఆరోగ్య విషయంలో కాలేజీ డాక్టర్లు చేతులెత్తేసి మెరుగైన వైద్యం కోసం మంగళూరుకు వెళ్లాలని సూచించారు. దీంతో వైద్యసిబ్బంది ఆమెను మంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో కోమాలోకి చేరుకుంది. తల్లిదండ్రులు మంగళూరుకు వెళ్లి కోమాలో కొన ఊపిరితో ఉన్న కుమార్తెను చూసి తల్లడిల్లిపోయారు. చివరి మాటలకు కూడా నోచుకోలేదని విలపించారు. 21 తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కన్నుమూసిందని తల్లిదండ్రులు తెలిపారు.

స్పందన లేని వైద్యులు

తమ బిడ్డకు సరిగా వైద్యం చేయలేదని తల్లిదండ్రులు మంగళూరు నార్త్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కాలేజీకి వెళ్లి విచారణ జరిపారు. సజనికి ట్రీట్‌మెంట్ గురించి వైద్యులు సరైన సమాధానం చెప్పలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామం పోట్లదుర్తికి మృతదేహాన్ని తీసుకువచ్చి మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

త్వరలో కోర్సు పూర్తి..

సజని చదువులో మంచి ప్రతిభాశాలి. ఇంటర్ పూర్తయిన తరువాత మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటును హైదరాబాదులోని గాంధీ మెడికల్ కాలేజీలో సంపాదించింది. తరువాత సుళ్యలో పీజీ కోర్సు చివరి ఏడాది చేస్తోంది. ఆమె మరణంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. త్వరలో ఎంఎస్ పూర్తి చేసుకుని వస్తుందని కోటి ఆశలతో ఉన్న తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ వైద్య విద్యార్థినికే కనీస వైద్యం అందించకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

డెంగీ బారిన పాలికె చీఫ్



కమిషనర్ తుషార్

బనశంకరి: బృహత్ బెంగళూరు మహా నగర పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్ డెంగ్ బారిన పడ్డారు. ప్రజారోగ్యాన్ని పర్యవేక్షించాల్సిన ప్రధాన కమిషనర్‌కు డెంగీ రావడం ఆందోళన కలిగించే అంశం. అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఆయన విధులను నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ షెడ్యూల్‌ను కొనసాగిస్తున్నారు. ఈనెల 19న ఆయనకు జ్వరం వచ్చింది. వైద్యుల సిఫార్సు మేరకు డెంగీ పరీక్ష చేయగా పాజిటివ్ అని వచ్చింది. ఇదిలా ఉంటే నగరంలో డెంగీ కేసులు, వైరల్ జ్వరాలు పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. పది రోజుల్లో నగరంలో మొత్తం 550 డెంగీ కేసులు నమోదయ్యాయి.

నూతన ఎమ్మెల్సీల ప్రమాణం



నూతన ఎమ్మెల్సీలతో సీఎం, సభాపతి

శివాజీనగర: రాష్ట్ర విధానపరిషత్‌కు శాసనసభ, ఉపాధ్యాయుల, పట్టభద్రుల నియోజకవర్గాల నుండి ఎన్నికైన 17 మంది నూతన ఎమ్మెల్సీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. విధానసౌధ బ్యాంక్వెంట్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. వీరిలో మంత్రి బోసురాజు, సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర, బీజేపీ నేత సీటీ రవి తదితర ప్రముఖులున్నారు. సభాపతి బసవరాజ హొరట్టి వీరిచేత ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం సిద్దరామయ్య, న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్.కే.పాటిల్‌తో పాటుగా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఢిల్లీలో కుమార ప్రమాణం

మండ్య ఎంపీ, కేంద్రమంత్రి హెచ్.డీ.కుమారస్వామి సోమవారం ఢిల్లీలో పార్లమెంటులో ఎంపీగా ప్రమాణం చేశారు. కన్నడలో దేవుని పేరుతో ప్రమాణ స్వీకారం చేశారు. తన జీవితంలో చిరస్మరణీయ గౌరవం కలిగిన క్షణమని ఎక్స్‌లో తెలిపారు. మండ్య ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

స్నాచర్‌పై షూటౌట్

- గాయాలతో ఆస్పత్రిపాలు



రిజ్వాన్



ఆస్పత్రిలో రిజ్వాన్

తుమకూరు: ఒంటరి మహిళల మెడలో బంగారు ఆభరణాలను చోరీ చేస్తున్న దొంగపై పోలీసులు కాల్పులు జరిపారు. జిల్లాలోని మధుగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈజీహళ్ళి క్రాస్ వద్ద సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు ఏపీలోని పుట్టపర్తి జిల్లాలోని హిందూపురానికి చెందిన రిజ్వాన్ (34) అనే చైన్ స్నాచర్ అని తెలిపారు.

బీరు బాటిల్‌తో దాడికి యత్నం

వివరాలు.. జిల్లాలో జరిగిన పలు స్నాచింగ్‌లు రిజ్వాన్ పనేనని పోలీసులు గుర్తించారు. దీంతో హిందూపురం వద్ద అతనిని పట్టుకుని తుమకూరుకు తరలిస్తున్నారు. ఈజీహళ్ళి క్రాస్ వద్ద బహిర్భూమికని చెప్పడంతో పోలీసులు జీపును ఆపారు. దిగగానే రిజ్వాన్ అక్కడ పడి ఉన్న బీరు బాటిలును పగలగొట్టి పోలీసులపై దాడి చేసి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతనిపై కాల్పులు జరపడంతో చేతికి గాయాలయ్యాయి. వెంటనే అతన్ని నిర్బంధించి మధుగిరి ఆస్పత్రిలో చేర్పించారు. సుమారు 15 పైగా స్నాచింగ్ కేసులు నిందితునిపై ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఆస్పత్రిలో అతన్ని జిల్లా ఎస్పీ, డీఎస్పీ తదితరులు కలిసి సమాచారం సేకరించారు.

ఇక రంగు పడకుండా చికెన్ పకోడా



బనశంకరి: హోటళ్లు, వీధుల్లో విక్రయించే శాకాహార, మాంసాహార వంటకాలు బాగా కనిపించాలని వ్యాపారులు ఎరుపు, ఊదా వంటి కృత్రిమ రంగులను ఉపయోగిస్తుంటారు. ఆ రంగుల వల్ల ప్రజలకు అనారోగ్యం కలుగుతోందని ఆరోపణలు రావడంతో కృత్రిమ రంగుల వాడకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి నిషేధించింది. ఆహార తనిఖీ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 39 చికెన్ పకోడా, కబాబ్ శాంపిల్స్‌ను సేకరించి ల్యాబొరేటరీలో పరీక్షలు నిర్వహించారు. ఇందులో 8 కబాబ్‌ల్లో హానికారకమైన కృత్రిమ రంగులను వాడినట్లు తేలింది. దీంతో కృత్రిమ రంగుల వాడకాన్ని సర్కారు నిషేధించింది. ఉల్లంఘనకు పాల్పడితే 7 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశముందని ఆహార సురక్షత నాణ్యత ప్రమాణాల శాఖ కమిషనర్ తెలిపారు.

వాల్మీకి మండలి స్కాంలో ఈడీ దర్యాప్తు

శివాజీనగర: బెంగళూరులో మహర్షి వాల్మీకి ఎస్టీల అభివృద్ధి మండలిలో వందల కోట్ల రూపాయల కుంభకోణం మలుపు తిరిగింది. ఈ కేసులో కేంద్ర ఈడీ అధికారులు ప్రత్యేక తనిఖీని చేపట్టారు. అక్రమంగా వంద కోట్లకు పైగా సొమ్ము బదిలీ చేసి స్వాహా చేసిన కుంభకోణంలో ఇప్పటికే జైలులో ఉన్న నిందితులను విచారించారు. వాల్మీకి మండలి ఎండీ పద్మనాభ్, లెక్కాధికారి పరశురామ్‌ల నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. మరోవైపు సీబీఐ కూడా ప్రత్యేకంగా దర్యాప్తు జరుపుతోంది.

గతంలో మంత్రి రాజీనామా

వాల్మీకి అభివృద్ధి మండలి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ కొన్నిరోజుల క్రితం శివమొగ్గలోని తన ఇంటిలో ఆత్మహత్య చేసుకొన్నారు. డెత్‌నోట్‌లో రూ. కోట్ల అక్రమాలు జరుగుతున్నాయని, తాను ఈ అవినీతిని చూస్తూ ఉండలేనని రాశారు. ఈ నేపథ్యంలోనే బ్యాంక్ నుండి రూ.94 కోట్లు బయటకు బదిలీ అయినట్లు వెల్లడైంది. నగదు బదిలీపై ప్రభుత్వానికి ఎలాంటి మెయిల్, మొబైల్ మెసేజ్‌లు రాలేదు. నగదు నిల్వ చేసిన బ్యాంక్ సిబ్బంది ద్వారానే నకిలీ ఆధారాలు సృష్టించి మోసగించారని ఆరోపిస్తూ మండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. బ్యాంక్‌కు చెందిన 6 మంది సిబ్బందిపై హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ తరువాత భారీ అక్రమాల నేపథ్యంలో సీబీఐ, ఈడీ సైతం తనిఖీ చేపట్టాయి. ఆ శాఖ మంత్రి బి.నాగేంద్ర రాజీనామా చేశారు. ఈడీ, సీబీఐ విచారణతో సిద్దరామయ్య సర్కారుకు ఇబ్బందులు తప్పవని అనుమానాలున్నాయి. వాల్మీకి మండలి స్కాం విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను నియమించింది. సిట్ పోలీసులు ఇప్పటివరకు 9 నిందితులను అరెస్ట్ చేశారు. మొత్తం రూ. 94 కోట్ల 73 లక్షల అవినీతి జరిగినట్లు తెలిసింది. ఇందులో రూ.14.5 కోట్ల నగదును సిట్ పోలీసులు సీజ్ చేశారు.

దర్శన్ జైలు మార్పు?

- పరప్పన నుంచి తుమకూరుకు!



పరప్పన అగ్రహార జైలు వద్ద వినోద్ ప్రభాకర్

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టై పరప్పన అగ్రహార జైలులో ఉన్న ప్రముఖ నటుడు, చాలెంజింగ్ స్టార్ దర్శన్‌ను మరో జైలుకు మారుస్తారని తెలుస్తోంది. ఈ జైలులో అయితే దర్శన్ భద్రత కల్పించడం కష్టమని భావిస్తున్నారు. దర్శన్‌ను మరో జైలుకు తరలించడానికి అవకాశం కల్పించాలని ఎస్‌పీపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు అనుమతిస్తే దర్శన్‌ను తుమకూరు జైలుకి తరలించే అవకాశం ఉంది. దర్శన్ అనుచరులు, ఇతర రౌడీల మధ్య జైలులో ఘర్షణలు జరిగే అవకాశం ఉన్నట్లు జైలు అధికారులు భావిస్తున్నారు.

దర్శన్‌తో నటుడు వినోద్ భేటీ

చట్టానికి ఎవరూ అతీతులు కాదు, అన్యాయం జరిగిన వారికి న్యాయం జరగాలని నటుడు వినోద్ ప్రభాకర్ అన్నారు. సోమవారంనాడు పరప్పన అగ్రహార జైలులో దర్శన్‌ను కలిసిన తరువాత మీడియాతో మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానమే అన్నారు. ఇలా జరగకుండా ఉండాల్సింది అని, రేణుకాస్వామి ఆత్మకు శాంతి లభించాలని చెప్పారు. తాను దర్శన్‌ను కలిసి 4 నెలలు అయ్యిందన్నారు. అన్నపూర్ణేశ్వరి పోలీస్‌స్టేషన్‌లో కలవాలని ప్రయత్నించినప్పటికీ వీలుకాలేదని, అందుకే జైలులో భేటీ అయినట్లు తెలిపారు. దర్శన్‌తో ఏమీ మాట్లాడలేకపోయానని, నన్ను చూసి టైగర్ అన్నాడని, బాస్ ఎలా ఉన్నారు అని అడిగానని తెలిపారు.



చిత్రాల్ రంగస్వామి

రేణుకాస్వామి నుంచి అశ్లీల మెసేజ్‌లు: చిత్రాల్

హత్యకు గురైన రేణుకాస్వామిపై బుల్లి తెర నటి చిత్రాల్ రంగస్వామి ఆరోపణలు చేశారు. తన ఆరోపణలకు సాక్ష్యంగా కొన్ని స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఆమె.. రేణుకాస్వామి వేరే పేర్లతో నాకు కూడా చాలాసార్లు అశ్లీల మెసేజ్‌లు పంపించాడని తెలిపింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. రేణుకాస్వామి పలు అకౌంట్ల నుంచి అశ్లీల మెసేజ్‌లు పంపించేవాడని అలాంటి అక్కౌంట్లను తాను బ్లాక్ చేశానన్నారు. చిత్రాల్ గతంలో బిగ్‌బాస్ పోటీదారుగా ఉండింది. ఆమె బాడీ బిల్డర్‌గా కూడా పేరుపొందారు. మరోవైపు వందలాది మంది అభిమానులు దర్శన్‌ను చూడాలంటూ జైలు వద్ద హంగామా సృష్టించారు. కొందరైతే దర్శన్ ఖైదీ నంబరైన 6106 పోస్టర్లను ప్రదర్శించారు.

మట్టి మిద్దె వాసులకు వర్షగండం


శిథిలావస్థలో ఉన్న ఇంటిపై పరదా కప్పిన దృశ్యం


కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇంటి గోడ

- గుడిసెలు లేని ఇళ్లకు విముక్తి ఎన్నడో?
- ఏప్రిల్ నుంచి 100 పాత ఇళ్లు నేలమట్టం
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న పేదలు

సాక్షి బళ్లారి: జిల్లాలో అపారమైన ఇనుప ఖనిజ సంపద నిల్వలున్నాయి. దేశంలోనే ఇనుప ఖనిజ నిల్వలున్న ప్రాంతాల్లో బళ్లారి జిల్లా అగ్రస్థానంలో ఉంది. గనుల యజమానులు ఓ వైపు వేల కోట్ల సంపాదన, హెలికాప్టర్లు, విమానాలు కొనుగోలు చేసుకొని రాజ మహారాజుల్లా ఆకాశంలో విహరిస్తూ విలాసవంతమైన భవనాల్లో జీవిస్తున్నారు. మరో వైపు ఇదే జిల్లాలో పేదరికం కూడా రాష్ట్రంలోనే ఇతర జిల్లాలతో పోలిస్తే మొదటి స్థానంలో ఉండటం బాధాకరం. బళ్లారి జిల్లాలో పూరి గుడిసెలు, మట్టి మిద్దెల్లో నివసిస్తున్న పేదలకు వర్షకాలం వచ్చిందంటే ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. 2002 నుంచి ఖనిజ సంపదకు విపరీతమైన డిమాండ్ రావడంతో ఇక్కడ నుంచి వేల కోట్లు ప్రభుత్వానికి కూడా ఆదాయం వచ్చింది.

మూలుగుతున్న కోట్లాది నిధులు

మైనింగ్ నుంచి వచ్చిన నిధులతో బళ్లారి జిల్లాలో మౌలిక సదుపాయాలకు కూడా వెచ్చించాలని కొంత మేరకు నిధులు కేటాయించారు. డీఎంఎఫ్, కేఎంఆర్‌సీ నిధులు వేలాది కోట్ల రూపాయలు మూలుగుతూనే ఉన్నాయి. గుడిసెలు లేని, మట్టి మిద్దెలు లేని ఇళ్లను నిర్మిస్తామని పాలకులు, అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూనే ఉంటారు. ఇందులో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పాలకులు దొందూ దొందుగానే వ్యవహరించడంతో జిల్లాలో పేదలకు కనీస వసతులు లేక మట్టి మిద్దెల్లో నివసిస్తున్నారు. ఈఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వర్షాల కారణంగా మట్టి మిద్దెలు సుమారు 100 వరకు కూలిపోయినట్లు అధికార గణాంకాలు తెలియజేస్తున్నాయి. జూన్ 12 నుంచి మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో మరో 69 ఇళ్లు దెబ్బతిన్నాయి. బళ్లారిలో–10, సిరుగుప్ప–5, సండూరు–5, కంప్లి–4 మట్టి మిద్దెలు నేలకూలాయి.

పరిపాటిగా మట్టి మిద్దెల పతనం

ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే మట్టి మిద్దెలు నేలకూలిపోవడం పరిపాటిగా మారింది. జిల్లా యంత్రాంగం తూతూమంత్రంగా పరిహారం అందిస్తూ చేతులు దులుపుకుంటున్నారే కానీ శాశ్వతంగా ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పేదలకు సొంత ఇంటి కల కలగానే మిగిలింది. జిల్లాలో ఐదు తాలూకాల్లో వేలాది కుటుంబాలు ఇళ్లు లేక కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. ప్రతి ఏటా జిల్లా పంచాయతీ, నగర పంచాయతీ, పట్టణ పంచాయతీ సమావేశాల్లో ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఇళ్లు లేని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయడం, అధికారులు, మంత్రులు చర్చించడం, నిధులు మంజూరు చేస్తామనడం పరిపాటిగా మారింది. అయితే జిల్లాలో ఇలాంటి చర్చలు జరుగుతున్నాయే కానీ గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో మట్టి మిద్దెలు, గుడిసెలు లేని గ్రామాలు కనిపించడం లేదు. ఈనేపథ్యంలో ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే మట్టి మిద్దెలు నేలకూలడంతో ఆయా గృహ యజమానులు రాత్రిళ్లు, పొరుగిళ్లల్లో తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది.


దుస్థితిలో ఉన్న పాత మిద్దె ఇల్లు


భారీ వర్షానికి కూలిన మట్టి ఇల్లు

నెరవేరని నేతల హామీలు

2019 నుంచి ఇప్పటి వరకు భారీ వర్షాల వల్ల పాత మిద్దెలు కూలి జిల్లాలో పలువురు మృతి చెందిన సంగతి తెలిసిందే. సిరుగుప్ప, బళ్లారి నగరంతో పాటు జిల్లాలో అక్కడక్కడ పాత మిద్దెలు కూలి అందులో నివసిస్తున్నవారు మృతి చెందినప్పుడు అధికార, ప్రతిపక్ష నాయకులు మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చి జిల్లాను ఇకపై మట్టి మిద్దెలులేని జిల్లాగా మారుస్తామని హామీలు ఇస్తున్నారే కానీ ఆచరణలో అమలు కాకపోవడంతో పేదలకు వర్షాకాలంలో ఇళ్లల్లో నివసించేందుకు భయం భయంగా గడపాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంటోంది. ఇకనైనా సంబంధిత అధికారుల, పాలకులు జిల్లాలో పాత మిద్దెల్లో నివాసం ఉంటున్న వారిని గుర్తించి ప్రభుత్వ ఇళ్లను మంజూరు చేసి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అభివృద్ధి పనులకు భూమిపూజ


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: తాలూకాలోని రాజేనహళ్లి గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో కూడిన నూతన జీపీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కేవై నంజేగౌడ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌లు పనులను నాణ్యతతో చేయాలని సూచించారు. జీపీ పెద్దల సహకారంతో 70 ఎకరాలకు పైగా భూమిని రక్షించామన్నారు. గ్రామంలో నూతన జీపీ, అంగన్‌వాడీ కేంద్రం, మొరార్జి దేశాయి, పీయూ విద్యార్థి నిలయాన్ని నిర్మించే యోచన ఉందన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున పనులు సజావుగా సాగుతాయని, నిధుల కొరత ఉండదన్నారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ కొరత ఉన్న నిధులను ఎమ్మెల్సీ ఫండ్స్ నుంచి విడుదల చేస్తామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హెచ్ఎం విజయనరసింహ, జీపీ అధ్యక్షురాలు మంజులమ్మ, ఉపాధ్యక్షుడు నాగరాజ్, పీడీఓ సోమేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానించింది కాంగ్రెస్

శివాజీనగర: రాజ్యాంగాన్ని ఓ మూలన పడేసి సర్వాధికార ధోరణితో వ్యవహరించిన వారు ఇందిరాగాంధీ, అత్యవసర పరిస్థితి విధించి న్యాయ, పత్రికా రంగాన్ని అణచివేశారని శాసనసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ ఆరోపించారు. మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ దేశంపై విధించిన అత్యవసర పరిస్థితిని ఖండిస్తూ నగరంలోని ఫ్రీడం పార్కులో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆనాడు హేమాహేమీ నాయకులను జైలులో పెట్టారు. అత్యవసర పరిస్థితి సమయంలో తాను కూడా జైలుకు వెళ్లాను. తనతో పాటుగా సురేశ్‌కుమార్‌ను కూడా అరెస్ట్ చేశారని, నెల పాటు జైల్లో ఉండిన తమకు చిత్రహింసలు పెట్టారు. ఉండేందుకు సరైన స్థలం ఉండేది కాదు. అంతేకాకుండా తినడానికి భోజనం కూడా పెట్టేవారు కాదు. తమను హింసకు గురిచేసిన కాంగ్రెస్ నేడు రాష్ట్రంలో అధికారంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ముఖం పెట్టుకొని వీరు ఓటు అడుగుతున్నారు? అంబేడ్కర్ రాజ్యాంగం, దేశంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, ప్రజలకు క్షమాపణ కోరాలి. రాహుల్ గాంధీ దీని గురించి మాట్లాడాలి. అత్యవసర పరిస్థితిని విధించటం తప్పా, కాదా అనేది స్పష్టం చేయాలని సవాల్ చేశారు. మాజీ డీసీఎం డాక్టర్ సీ.ఎన్.అశ్వత్థనారాయణ్, మాజీ ఎమ్మెల్యే ఎస్.మహేశ్, పీ.రాజీవ్, పరిషత్ సభ్యుడు ఎన్.రవికుమార్ ధర్నాలో పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యాలయానికి తరలి పోస్టర్ అతికించేందుకు ప్రయత్నించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

కార్యకర్తలకు పసందైన విందు


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు బాగేపల్లి ఎమ్మెల్యే విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న చిక్కబళ్లాపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ... కార్యకర్తలకు ధన్యవాదాలు చెప్పేందుకు ఎమ్మెల్యే సుబ్బారెడ్డి విందు భోజనం ఏర్పాటు చేయడం సంతోషకర విషయమని అన్నారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి మాట్లాడుతూ...తాను బాగేపల్లి నుంచి పలు పర్యాయాలు విజయం సాధించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలేనని, ప్రత్యర్థులతో గొడవలు జరిగినా వెనుకాడలేదని అన్నారు. అలాంటి వారికి విందు భోజనం ఇవ్వడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాంసాహార విందును ఆరగించారు.


డిమాండ్ల సాధన కోసం సోమవారం బెంగళూరు ఫ్రీడం పార్కులో అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీనివాసపురం: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి 33వ సంవత్సర వార్షికోత్సవ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిపారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. అమ్మవారికి విశేష అలంకరణ నెరవేర్చారు. సాయంత్రం వాసవి మహిళా మండలి సభ్యులు భక్తి గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు.

బస్సులు ఆపాలని రాస్తారోకో

రాయచూరు రూరల్: బస్సు సౌకర్యం కోసం సోమవారం జిల్లాలోని మాన్వి తాలూకా కప్పగల్ వద్ద విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. మాన్వి–రాయచూరు రహదారికి అడ్డంగా హైస్కూలు విద్యార్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హైస్కూలుకు వెళ్లాలంటే వేళకు సరిగా సక్రమంగా ఆర్టీసీ బస్సులు రావడం లేదన్నారు. నాన్ స్టాప్ బస్సు అంటూ ప్రతి వాహనానికి బోర్డు పెట్టుకొని ఉదయం పూట బస్ డ్రైవర్లు బస్టాప్‌ల వద్ద బస్సులను నిలపకుండా నేరుగా వెళుతుండటాన్ని ఖండించారు. ఇందువల్ల ఉదయం వేళలో పాఠశాలకు హాజరు కాలేకపోతున్నట్లు వాపోయారు. తమకు బస్‌లను ఆపాలంటూ మూడు గంటల పాటు విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు.

కోలారు వార్తలు...

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం


మాట్లాడుతున్న ఎస్పీ నారాయణ

కోలారు: ఆనంద ఆశ్రమ స్వామీజీ ఆచార్య చిన్మయానంద అవధూత హత్య కేసుకు సంబంధించి ఇప్పటికే నిందితులను అరెస్టు చేశామని, హత్యపై ఉన్నత స్థాయి తనిఖీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎం.నారాయణ తెలిపారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1978 నుంచి నిర్వహిస్తున్న ఆనంద ఆశ్రమం పాలక మండలి, పాలిటెక్నిక్ కళాశాల మధ్య వ్యాజ్యం నడుస్తోందన్నారు. దీనికి సంబంధించి రెండు గుంపుల మధ్య జరిగిన ఘర్షణలో హత్య చోటు చేసుకుందన్నారు. కోల్‌కతా నుంచి ఆచార్య అమిశైనంద వచ్చి ఇక్కడ కళాశాల నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం ఆచార్య చిన్మయానంద అవధూతను ప్రిన్సిపాల్‌గా నియమించారన్నారు. దీనిని సహించలేని నిందితులు కుట్ర పన్ని బాత్‌రూంలో ఉన్న చిన్మయానందపై స్ప్రే చల్లి హత్య చేశారన్నారు. చిన్మయానంద తాలూకాలోని కిత్తండూరులో కూడా ఆశ్రమం నిర్వహిస్తున్నారన్నారు. హతుడు చిన్మయానంద, నిందితుడు ప్రణవానంద అవధూతల మధ్య 2002 నుంచి గొడవ జరుగుతోందన్నారు. హత్య అనంతరం నిందితులు తమిళనాడుకు పరారు కావాలని చూస్తుండగా పోలీసులు అరెస్టు చేశారన్నారు.

మూడు నెలల్లో పనుల పూర్తికి సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు: నగరోత్థాన పథకం పనులను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం నగరంలోని నగరసభ సభాంగణంలో నిర్వహించిన ప్రతి పరిశీలన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలోని 35 వార్డుల్లో జరుగుతున్న పనులను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. అధికారులు నిత్యం జరుగుతున్న పనుల్లో సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటుండాలన్నారు. ఎలాంటి లోపాలు జరిగినా అధికారులే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. సాకులు చూపి పనులను మధ్యలోనే నిలిపేస్తే సహించేది లేదన్నారు. ఒక పని పూర్తి చేసిన అనంతరం మరో పనిని చేపట్టాలని సూచించారు. అధికారులకు నిర్ణీత సమయం ఉంటే ప్రజాప్రతినిధులు ఎల్లవేళలా ప్రజల సమస్యలపై స్పందించాలన్నారు. సమావేశంలో సభ్యుడు ప్రసాద్ బాబు, రాకేష్ సూరి, మురళీగౌడ, కమిషనర్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దళితుడు విద్యావంతుడు కావాలి


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

మాలూరు: ప్రతి దళితుడు విద్యావంతుడు కావడంతో పాటు వ్యసన ముక్తులు కావాలని, స్వచ్ఛమైన జీవితం గడపాలని అజ్ఞానాన్ని పారదోలి, అందరితో కలిసిమెలసి జీవించడం అలవాటు చేసుకోవాలని బెళగావి తోంటదార్య మఠం నిజగుణానంద ప్రభు మహాస్వామి తెలిపారు. సోమవారం తాలూకాలోని పుర గ్రామంలో అంబేడ్కర్ యువక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ, బసవ, అంబేడ్కర్ జయంతిని ప్రారంభించి మాట్లాడారు. బుద్ధ, బసవ, అంబేడ్కర్‌ల ఆదర్శాలను అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ జీవితాన్ని అనుభవించాలన్నారు. సమాజంలో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి వారికి అవసరమైన సహాయ హస్తం అందించాలన్నారు. దేశ మూల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. బుద్ధ, బసవ, అంబేడ్కర్‌లను కాదని సమాజంలో జీవించడం అసాధ్యమన్నారు. ఈ ముగ్గుర విశిష్ట వ్యక్తులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బుద్ధ చరిత్ర, బసవణ్ణ వచనాలు, అంబేడ్కర్ 15 సంపుటాల గురించి అధ్యయనం జరగకపోతే దేశానికి భవిష్యత్తు లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేవై నంజేగౌడ, నివృత్త డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధరల పెంపుపై నిరసన


పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, కార్యకర్తలు

సిరుగుప్ప: ఇచ్చిన మాట నిలుపుకోలేక మద్యం, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, రిజిస్ట్రేషన్ ఫీజులను కూడా రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకు పెంచడం, ఎస్టీ కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల నిధులు దుర్వినియోగం, ఇచ్చిన ఐదు గ్యారెంటీల్లో కొన్నింటిని సక్రమంగా అమలు చేయలేక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప ఘాటుగా విమర్శించారు. ఆయన సోమవారం నగరంలో అభయాంజనేయస్వామి ఆలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, ఎస్టీ కార్పొరేషన్‌లో నిధుల దుర్వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన ప్రదర్శనలో పాల్గొని మాట్లాడారు. అనంతరం తాలూకా బీజేపీ అధ్యక్షుడు కుంటనాళ్ మల్లికార్జున, ధరప్పనాయక తదితరులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డారు. పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన ర్యాలీని విజయవంతం చేశారు.

బకాయి వేతనాలు చెల్లించండి

రాయచూరు రూరల్: కాంట్రాక్ట్ పద్ధతిపై ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఏడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్షయగౌడ పేర్కొన్నారు. సోమవారం పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ విషయంలో మీనమేషాలు లెక్కించడం తగదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలను కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా భర్తీ చేసే ప్రక్రియ సాగుతోందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడానికి సర్కార్ పునరాలోచించాలన్నారు. ఏజెన్సీల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను కొనసాగేలా చూడాలన్నారు. సమయానికి వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, జీపీఎఫ్‌లు చెల్లించాలన్నారు.

నలుగురిపై కేసుల నమోదు

హుబ్లీ: రెండు ప్రత్యేక కేసుల్లో ఇక్కడి కేశ్వాపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లుగా కప్పిపుచ్చడంతో పాటు అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిపై కేసులు నమోదయ్యాయి. గదగ్ రోడ్డు వినోబా నగర రైల్వే క్వార్టర్ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రశాంత్ బప్పురిపై కేశ్వాపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అలాగే కుసుగల్ రోడ్డు సన్‌సిటీ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రవి ఎలెగార, విజయ్ దార్ల, ఆథోటి మేరిబాలపై కూడా మరో కేసు దాఖలైంది.

26, 27 తేదీల్లో క్రైస్తవ ఉజ్జీవ కూడికలు


దైవ వర్తమానికులు పాస్టర్ శ్రీని

హొసపేటె: కర్ణాటక కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీల్లో క్రైస్తవ ఉజ్జీవ కూడికలు జరుపనున్నట్లు నిర్వాహకులు పాస్టర్ రెవరెండ్ ఎం.జక్కయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా మరియమ్మనహళ్లి కల్వరి చర్చిలో రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ప్రార్థనా కూడికలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక దైవ వర్తమానికులుగా దుబాయ్‌లో దేవుని సేవలందిస్తున్న బళ్లారి ఎల్‌షడాయ్ మినిస్ట్రీస్ నిర్వాహకులు పాస్టర్ శ్రీని పాల్గొంటారు. ఈ ప్రార్థనా కూడికల్లో బెంగళూరుకు చెందిన పాస్టర్ స్టీఫెన్ రతినమ్ ప్రత్యేక ఆరాధన నిర్వహిస్తారు. క్రైస్తవ భక్తి పాటలను ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపి దైవ సందేశాన్ని పాస్టర్ శ్రీని వినిపిస్తారని ఆయన తెలిపారు.

27న కెంపేగౌడ జయంతి

చిక్కబళ్లాపురం: జిల్లా పాలక మండలి, ఒక్కలిగ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న కెంపేగౌడ జయంతిని నిర్వహిస్తున్నట్లు ఏడీసీ తిప్పేస్వామి తెలిపారు. మరకు సిద్ధేశ్వర స్వామి ఆలయం నుండి ఒక్కలిగ కళ్యాణ మంటపం వరకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తామని, ఆదిచుంచనగిరి శ్రీశ్రీ నిర్మలానందనాథస్వామీజీ ఆధ్వర్యంలో కార్యక్రమ ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు సుధాకర్, శివరాజ్ తంగడిగి, ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, ఎంపీ సుధాకర్ పాల్గొంటారని అన్నారు.

రాజధానిలో ఈడీ సోదాలు

బనశంకరి: బెంగళూరు, మైసూరు నగరాల్లో పేరుపొందిన బిల్డర్ల ఇళ్లు, కార్యాలయాలపై సోమవారం ఈడీ అధికారులు దాడులు చేపట్టారు. బెంగళూరు నగరంలోని యుబీ సిటీ కింగ్‌ఫిషర్ టవర్, మల్లేశ్వరం, బసవేశ్వరనగరలో బన్నేరుఘట్ట రోడ్డు, హనుమంతనగర, మైసూరు నగరంలో రెండుచోట్లతో కలిపి మొత్తం 11 ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ముఖ్యమైన ఫైళ్లు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. స్థలాలు, ఫ్లాట్లు ఇస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసి మోసగించడం, ఆస్తి పన్నుల్లో అక్రమాలు తదితర ఆరోపణలు రావడంతో ఆకస్మిక తనిఖీలను ప్రారంభించారు. ఇటీవలి కాలంలో ప్రతి నెలా రెండు నెలలకు ఒకసారి ఈడీ, ఐటీ దాడులు బెంగళూరులో జరుగుతున్నాయి.

ప్రబుద్ధ కేసు సీఐడీకి

బనశంకరి: బెంగళూరు దక్షిణ పరిధిలోని సుబ్రమణ్యపురలో హత్యకు గురైన విద్యార్థిని ప్రబుద్ధ కేసును సీఐడీ అప్పగించాలని సీఎం సిద్ధరామయ్య ఆదేశించారు. మృతురాలి తల్లి సౌమ్యా సోమవారం సీఎంను కలిసి న్యాయం చేయాలని మనవిచేశారు. ప్రబుద్ధ మే 15న ఇంట్లో బాత్‌రూంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితునికి బెయిలు వచ్చిందని, కేసును సీఐడీ కి అప్పగించి సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరారు. బాధ్యులకు తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కేసును సీఐడీతో విచారణ చేయాలని డీజీపీ అలోక్ మోహన్‌కు సీఎం సూచించారు.

మేకల మందపై చిరుత దాడి

మండ్య: మేకల మందపై చిరుత దాడి చేసి ఒక మేకను చంపి చెరకు తోటలోకి లాక్కొని పారిపోయిన ఘటన మైసూరు తాలూకా మంగళ గ్రామ సమీపంలోని సోమవారం చోటు చేసుకుంది. మంగళ గ్రామానికి చెందిన మీనాక్షి సన్నెగౌడ అనే రైతుకు చెందిన తోటలో మేకలు మేస్తుండగా ఒక్కసారిగా చిరుత మందపై దాడి చేసి ఒక మేకను ఎత్తుకుని వెళ్లిపోయింది. అక్కడే ఉన్న ఓ మహిళ గట్టిగా అరవడంతో స్థానికులు అక్కడికి చేరుకోవడంతో చిరుత పారిపోయింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని ర్యాలీ


ఊరేగింపుగా వెళ్తున్న దళితులు

చింతామణి: తాలూకాలోని కంబాలహళ్లిలో గతంలో దళితుల సజీవ దహనం ఘటన అనంతరం 23 ఏళ్ల వారు పట్టణ శివారులోని కోలారు రోడ్డులోని మిని కంబాలహళ్లిలో నివాసం ఉంటున్నారు. ఇక్కడ కనీస సౌకర్యాలు కూడా లేవు. దీంతో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు కృష్ణప్ప, శ్రీనివాస్, రవిచంద్ర, దళితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి


ఆందోళన చేస్తున్న నేతలు

రాయచూరు రూరల్: భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా వ్యాఖ్యానించిన ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షుడు వినాయకరావ్ మాట్లాడారు. రాజ్యాంగంపై హేళనగా మాట్లాడిన రాహుల్‌గాంధీ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు.

ఆలయాల అభివృద్ధితో భక్తిభావం వృద్ధి


ఆలయ జీర్ణోద్ధరణకు డీడీని అందజేస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: ధార్మిక కేంద్రాలను రక్షిస్తే భగవంతుడిపై విశ్వాసం మరింత పెరుగుతుందని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ తాలూకా యోజనాధికారి ప్రకాష్ కుమార్ తెలిపారు. సోమవారం తాలూకాలోని ఇమరకుంట గ్రామంలోని లక్ష్మీనారాయణ ఆలయ జీర్ణోద్ధరణను ప్రారంభించి ఆలయ అభివృద్ధికి రూ.1.50 లక్షల డీడీని అందించిన అనంతరం ఆయన మాట్లాడారు. ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్గే మార్గదర్శనంలో రాష్ట్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా ధార్మిక శ్రద్ధా కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం సంస్థ కోట్ల రూపాయలను వెచ్చిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకుని గ్రామంలోని ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. టీపీ సభ్యుడు నాగవేణి రెడ్డి, ఆలయ అధ్యక్షుడు మునిస్వామి రెడ్డి, ఎంసీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఎల్‌కేజీ, యూకేజీ

- ప్రారంభించాలని తీర్మానం : మంత్రి

బనశంకరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభించాలని తీర్మానించామని మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ తెలిపారు. సోమవారం విధానసౌధ వద్ద మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ విలేకరులతో మాట్లాడుతూ... కళ్యాణ కర్ణాటక మినహా మిగిలిన కొత్త అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ విద్య అందించడంపై నిపుణులతో కమిటీకి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సూచించారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడమే తమ ఉద్దేశమన్నారు. పిల్లలకు శిశుసంక్షేమశాఖ నుంచి యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు అందించాలని తీర్మానించామని అలాగే పాఠశాల తరహాలో టీసీ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప, శిశుసంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలి


ర్యాలీగా వస్తున్న బీజేపీ నాయకులు

తుమకూరు: దేశంలో ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో జూన్ 25న దేశం మొత్తం అత్యవసర పరిస్థితిని తీసుకువచ్చిన రోజును నిరసిస్తూ బీజేపీ నాయకులు తుమకూరులో భారీ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బ్లాక్‌డే పోస్టర్లను తీసుకుని నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు అందించడానికి యత్నించగా వారిని పోలీసులు అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు.

తండ్రి చేతిలో పెంపుడు కుమారుడు హత్య

యశవంతపుర: జ్ఞానభారతి పరిధిలోని దొడ్డగొల్లరహట్టికి చెందిన పెయింటర్ ఆనంద్ (37) తండ్రి చేతిలో హత్యకు గురయ్యాడు. రోజూ తాగి వస్తున్న తండ్రి పుట్టస్వామితో పెంపుడు కుమారుడు ఆనంద్ గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి ఇంటి అద్దె విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గొడవ తీవ్ర స్థాయికి చేరుకోవడంతో పుట్టస్వామి వంట గది నుంచి చాకు తీసుకుని వచ్చి ఆనంద్ కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

గెలుపోటములు సహజం


వాలీబాల్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

గౌరిబిదనూరు: గెలుపు ఓటములు క్రీడల్లో సహజమని, పోటీలలో పాల్గొనడమే ప్రధానమని అగ్నిమాపకదళ అధికారి నాగరాజు తెలిపారు. సోమవారం అగ్నిమాపక కార్యాలయం ఆవరణంలో జరిగిన వాలీబాల్ టోర్నీలో ఆయన మాట్లాడారు. క్రీడలు దేహదారుఢ్యంతో పాటు మానసికమైన స్థైర్యాన్ని కలుగజేస్తాయన్నారు. పోటీ తత్వాన్ని అలవరచుకొనేలా చేస్తుందన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ బాయ్స్ జట్టు మొదటి బహుమతి, ఫైర్ ఫైటర్స్ జట్టు రెండో బహుమతి చేజిక్కించుకుంది. కార్యక్రమంలో బ్యాంకు ఎంప్లాయీస్ క్రికెట్ క్లబ్ సంచాలకులు ఎం చంద్రశేఖర్, సోమశేఖర్, రాధాకృష్ణ, మహేశ్ కాంబ్లే, మంజునాథ్, బాబు, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తపై కాల్పులు

యశవంతపుర: మడికేరి కుశాలనగరలో పారిశ్రామికవేత్తపై కాల్పులు జరిపారు. ప్రమాదవశాత్తు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పారిశ్రామికవేత్త శశిధర్ (46)పై తుపాకీతో కాల్పులు జరిపారు. నిందితుడు జరిపిన కాల్పుల్లో నాలుగైదు తూటాలు కారుకు తగిలాయి. శశిధర్ కాలుకు ఒక గుండు తగిలింది. దీంతో స్వల్ప గాయాలయ్యాయి. కాల్పులు జరిపిన నిందితుడు అనుదీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యాయత్నానికి గల కారణాలు తెలియటంలేదు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు హత్య


హత్యకు గురైన సెల్వం, మంజునాథ్ (ఫైల్)

యశవంతపుర: సిలికాన్ సిటీలో వేర్వేరు ప్రాంతాల్లో రెండు హత్యలు జరిగాయి. వివరాలు... గంగమ్మన గుడి కూడలిలో ఆదివారం అర్ధరాత్రి మంజునాథ్ (17) అనే వ్యక్తిని మారణాయుధాలతో హత్య చేశారు. మృతుడికి తల్లిదండ్రులు లేరు. చిన్నాన్నతో కలిసి ఉంటున్నారు. హత్యకు కారణాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విధంగా మల్లేశ్వరంలో పన్నీర్ సెల్వం (38) అనే కార్మికుడిని రాళ్లతో కొట్టి హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అన్ని వర్గాలకూ డీసీఎం ఇచ్చినా అభ్యంతరం లేదు

దొడ్డబళ్లాపురం: అన్ని సామాజిక వర్గాలకు తలా ఒక డీసీఎం పదవి ఇచ్చినా తమకు అభ్యంతరం ఏమీ లేదని మాజీ ఎంపీ డీకే సురేశ్ అన్నారు. బెంగళూరులోని సదాశివనగర్‌లో ఉన్న తమ నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన పార్టీ తీసుకునే నిర్ణయాలకు తాము కట్టుబడి ఉంటామని, అన్ని సామాజిక వర్గాలకూ ఒక్కో డీసీఎం పదవి ఇచ్చి న్యాయం చేయడంలో తప్పు లేదన్నారు. పార్టీలో సీనియర్ నాయకులైన ఈశ్వర్ ఖండ్రె, రామలింగారెడ్డి, సతీష్ జార్కిహోళి, జమీర్ అహ్మద్, క్రిష్ణబైరేగౌడ, చెలువ రాయస్వామి, ఆర్‌వీ దేశపాండె ఇలా అనేకమంది ఉన్నారని అందరినీ డీసీఎం చేయమనండి. ఎవరు కాదన్నారు అంటూ వ్యాఖ్యలు చేసారు. కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామికి తనను, డీకే శివకుమార్‌ను గుర్తు చేసుకోకపోతే పొద్దు గడవదన్నారు.

రాష్ట్రానికి తలమానికం ఈ అద్భుతాలు

- చారిత్రక నేపథ్యం, రాచరికానికి ఇప్పటికీ ప్రతీకలు
- ప్రపంచ పర్యాటక స్థలాలుగా ఖ్యాతి


దశాబ్దాల చరిత్ర కలిగిన మైసూరు ప్యాలెస్


రాయల కాలం నాటి సుందర స్మారకం ఈ రాతి రథం

బసవంతిరి: చారిత్రక, సాంస్కృతిక, సంప్రదాయక కళలు, పురాతన కట్టడాలు, ప్రకృతి రమణీయతకు నిలయం కర్ణాటక. కర్ణాటక రాష్ట్రంలో ఏడు అద్భుతాలు రాష్ట్రానికే తలమానికంగా నిలిచాయి. ప్రపంచ పర్యాటక స్థలాలుగా ఖ్యాతి గడించడం విశేషం.

1.హిరేబెణకల్ శిలా సమాధి :
కొప్పళ జిల్లా గంగావతి తాలూకాలోని హిరేబెణకల్ శిలా సమాధులు కర్ణాటకలోని ఏడు అద్భుతాల్లో ఒకటి. ఇది దేశంలోని అతిపెద్ద మెగాలిథిక్ నిలయం. ఇది క్రీ.పూ.800 నుంచి 200 క్రితం స్థలమని పరిశోధకులు ధ్రువీకరించారు. ఈ స్థలంలో 400కు పైగా శిలాసమాధులు ఉన్నాయి. బెంగళూరు నుంచి 360 కిలోమీటర్ల దూరంలో గల చారిత్రక స్థలానికి 5 గంటల్లో చేరుకోవచ్చు. శిలాసమాధుల అడుగు ఎత్తు నుంచి 10 అడుగుల ఎత్తువరకు ఉన్నాయి. ఈ సమాధి రాళ్లు చాలా దృఢంగా ఉంటాయి.

2.హంపీ :
హంపీ విజయనగర జిల్లా హొసపేటే వద్ద గల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చారిత్రక పర్యాటకస్థలం. ఇది 1336–1565 వరకు విజయనగర సామ్రాజ్య రాజధానిగా ఉండేది. యునెస్కో ప్రపంచ పర్యాటక నిలయంగా ప్రకటించింది. హంపీ తన చారిత్రక నేపథ్యం కలిగిన కర్ణాటక 7 అద్భుతాల్లో ఒకటి. విరూపాక్షదేవస్థానం, ఉగ్రనరసింహ విగ్రహం, కమల మహల్, హంపీబజార్, విఠలదేవాలయం, బడవిలింగ, మహా నవమిదిబ్బ, రాతిరథం హంపీ ప్రత్యేక ఆకర్షణలు ఉన్నాయి.

3.గోల్‌గుంబజ్ :
బీజాపుర గోల్‌గుంబజ్ చారిత్రక పర్యాటక స్థలం. దెక్కన్ ప్రాంతంలో కనబడే ఇస్లామిక్ ఇంజనీరింగ్ అద్భుతం. గోల్‌గుమ్మట కర్ణాటక ప్రముఖ స్మారకాల్లో ఒకటి. ఇది అత్యుత్తమ వాస్తుశిల్ప, ఏడు అష్ట భుజాకృతి ఫలకాలు, ఆకర్షణీయమైన గుమ్మటాలతో గోల్‌గుమ్మట ఆదిల్‌షా సమాధి. ప్రపంచంలో అతిపెద్ద మానవ నిర్మితమైన గుమ్మటం కాగా మహమ్మద్ ఆదిల్‌షా నిర్మించారు. ఇటలీ రోమ్‌నగర బెసిలికా చర్చ్, ప్రపంచంలో అతిపెద్ద మానవనిర్మిత గుమ్మటం. ప్రముఖ పర్యాటక నిలయంగా విరాజిల్లుతుంది.


4.గోమటేశ్వర విగ్రహం :
శ్రావణ బెళగోళ దక్షిణ కర్ణాటక ప్రముఖ జైనయాత్ర స్థలం. భారతీయ చారిత్రక పరంపరలో ప్రముఖ భాగం. శ్రవణబెళగోళ హాసన జిల్లా ప్రముఖ పర్యాటక నిలయం. గోమటేశ్వర విగ్రహాన్ని గంగరమంత్రి, సేనాదండనాయక చావుండరాయ క్రీ.శ.981లో నిర్మించారు. వింధ్యగిరి కొండపై ఉండే ఎత్తైన ఏకశిలా విగ్రహం ఇది. 57 అడుగులు ఎత్తు కలిగి ఉంది. ఇక్కడ 700 మెట్లతో పర్యాటకులను వింధ్యగిరి కొండకు తీసుకెళుతుంది. భగవాన్ గోమటేశ్వర విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడ చంద్రగిరి కొండలు ఇతర 14 జైన దేవాలయాలను వీక్షించవచ్చు.

5.మైసూరు ప్యాలెస్ :
మైసూరు ప్యాలెస్ అంటే ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. అంబావిలాస ప్యాలెస్ దేశంలోనే అత్యధిక మంది పర్యాటకులు సందర్శించే ప్యాలెస్. ప్యాలెస్ ఒడియార్ రాజవంశం అధికారిక నివాసం కాగా మైసూరు సామ్రాజ్యానికి నిలయం. 97,000 విద్యుత్‌దీపాలతో కూడిన ప్యాలెస్ ఆదివారం, సెలవురోజుల్లో సంధ్యా సమయంలో విద్యుత్ వెలుగులు నయనమనోహరంగా ఉంటాయి. 14వ శతమానం ప్రారంభంలో ఒడియార్ రాజవంశం నిర్మించిన ప్యాలెస్ అగ్నిమంటలతో దెబ్బతిన్న అనంతరం నాలుగోసారి పునఃనిర్మించారు.

6.జోగ్ జలపాతం :
కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ జిల్లాలో జోగ్‌జలపాతం దట్టమైన అడవుల్లో ప్రవహిస్తూ ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటుంది. దేశంలో రెండో అతి ఎత్తైన జలపాతం. దీనిని గేరుసొప్పి జలపాతం అని కూడా పిలుస్తారు. జోగ్ జలపాతం సుమారు 292 మీటర్ల ఎత్తునుంచి జాలువారుతుంది. శరావతినది నాలుగు పాయలుగా ప్రవహిస్తుంది. ప్రత్యేకంగా వర్షాకాలం అనంతరం జోగ్ జలపాత దృశ్యాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. రాజా, రాణి, రాకెట్, రోరర్ అనే నాలుగు జలపాతాలతో కూడుకుంది జోగ్‌జలపాతం. కర్ణాటక పశ్చిమ కనుమలు అటవీ ప్రదేశాల మధ్య జోగ్ జలపాతం ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

7.నేత్రాణి ద్వీపం :
నేత్రాణి ద్వీపం కర్ణాటకలోని ఏడు అద్భుతాల్లో ఒకటి. పావురాలు ద్వీపం అని పిలిచే నేత్రాణి అరేబియా సముద్రం దేశంలో ఒకద్వీపం. ఇది మురుడేశ్వర నుంచి సుమారు 10 కిలోమీటర్లు దూరంలో ఉంది. స్కూబా డైవింగ్‌గా పేరుపొందిన నేత్రాణి ద్వీపం అండమాన్, నికోబార్ ద్వీపాల అనంతరం రెండో అత్యుత్తమ స్థలం. ఉత్తర కన్నడ జిల్లా మురుడేశ్వరలో నేత్రాణిద్వీపాన్ని హృదయ ఆకారద్వీపం అని కూడా పిలుస్తారు. నేత్రాణి ద్వీపంలో పర్యాటకులు సాహస క్రీడలతో సందడి చేయవచ్చు. ఇది 310 కిలోమీటర్లు పొడవు తీరం కలిగిఉంది.


శ్రావణబెళగోళ గోమటేశ్వరుడు


పర్యాటకులను కనువిందు చేసే జోగ్ జలపాతం


కొప్పళ జిల్లాలో శిలా సమాధులు


ప్రపంచంలో అతిపెద్ద మానవ నిర్మిత గుమ్మటం


మురుడేశ్వర్ సమీపంలోని నేత్రాణి ద్వీపం

చెన్నపట్టణలో జనస్పందన

దొడ్డబళ్లాపురం: ఉప ఎన్నికలు జరుగుతున్న మూడు నియోజకవర్గాలపై దృష్టి పెట్టిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తమ ఇలాఖాలోని చెన్నపట్టణపై ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం చెన్నపట్టణలో ఆయన జనస్పందన కార్యక్రమం నిర్వహించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో డీకే సురేశ్ ఓటమిపాలవడంతో ఈసారి చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో శతాయ, గతాయ గెలవాలనే సంకల్పంతో డీకే బ్రదర్స్ పావులు కదుపుతున్నారు. అయితే ఇప్పటి వరకూ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది తెలియకుండా కాంగ్రెస్ పార్టీ జాగ్రత్త పడుతోంది. ఇప్పటికే చెన్నపట్టణ నియోజకవర్గంలో ఒక రౌండ్ సంచరించిన డీకే శివకుమార్ ఈ వారంలో మరోసారి క్షేత్రంలో పర్యటించనున్నారు. చెన్నపట్టణ నుండి తానే పోటీ చేస్తాననే లీక్ ఇచ్చిన డీకే శివకుమార్ తరువాత అభ్యర్థి ఎవరైనా తానే అభ్యర్థిగా భావించి ఆశీర్వదించాలని మాట మార్చారు.

రాజకీయ పునర్జన్మనిచ్చారు

గౌరిబిదనూరు: రాజకీయంగా పునర్జన్మ నిచ్చిన మీకు పాదాభివందనం చేస్తున్నానని చిక్కబళ్లాపురం పార్లమెంటు సభ్యుడు డా సుధాకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం బీజేపీ–జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు జరిపిన అభినందన సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రం నుంచి నిధులు సక్రమంగా అందేలా చూసి అభివృద్ధికి సహకరిస్తామన్నారు. గౌరిబిదనూరు రాజకీయంగా, చారిత్రాత్మకంగా పేరు గడించిందని, విద్యావేత్త, సంస్కరణవేత్త హెచ్ నరసింహయ్య జన్మస్థలం, విదురాశ్వత్థంలో ఎందరో స్వాతంత్ర సమరయోధులు బలయ్యారని గుర్తు చేసుకున్నారు. జేడీఎస్ నాయకుడు నరసింహమూర్తి మాట్లాడుతూ... మోదీ మూడోసారి ప్రధాని అయితే దేశాభివృద్ధి సాధ్యమని, దీంతో బీజేపీతో పొత్తు పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ శశిధర్, రవి నారాయణరెడ్డి, రామలింగప్ప, వేమారెడ్డి, రమేశ్ రావ్ శెల్కే, మార్కెట్ మోహన్, వేణుగోపాలరెడ్డి, నాగభూషణరావ్, డెయిరీ రమేశ్, బైపాస్ నాగరాజు, ముక్త మునియప్ప పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు సన్మానం



మైసూరు: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పుణ్య స్మరణను మైసూరు నగరంలోని కృష్ణరాజ నియోజకవర్గంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన ఐదుగురిని సన్మానించారు. ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స పాల్గొని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేబినెట్ అంతా డీసీఎంలు కావాలంటే అవుతుందా ?

- మంత్రి ప్రియాంక్ ఖర్గే

శివాజీనగర: ఉప ముఖ్యమంత్రి చేయటంతోనే అన్ని అవుతాయంటే మంత్రి మండలి మొత్తం డీసీఎంలు కావాలంటే అవుతుందా అని మంత్రి ప్రియాంక్ ఖర్గే ప్రశ్నించారు. విధానసౌధలో సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, ముగ్గురు డీసీఎం స్థానాలు సృష్టించే విషయంపై మంత్రి రాజణ్ణ వ్యాఖ్యలపై స్పందించారు. అది ఆయన వ్యక్తిగత విషయం. అందరికీ అడిగే హక్కు ఉంది. హైకమాండ్ వద్ద వెళ్లి అడిగని. ఎవరు వద్దన్నారన్నారు. డీసీఎం చేయటం ద్వారానే అన్ని అవుతాయనుకుంటే సీఎంను మాత్రం విడిచి క్యాబినెట్ అంతా డీసీఎంలు కావాలనుకుంటే అవుతుందా? తమ పని ఏమిటీ? లోకసభ ఎన్నికల్లో ఊహించినట్లుగా సీట్లు రాలేదు. నాలుగైదు స్థానాలు తక్కువ వచ్చాయి. దాని గురించి ఆత్మపరిశీలన చేసుకోవాలి. సీఎం స్థానాన్ని అడగండి ఎవరు వద్దన్నారు. కర్ణాటకలో నీట్ పరీక్ష విషయంపై ఎలాంటి నిర్ణయాన్ని తీసుకొంటారని అడిగిన ప్రశ్నకు శరణ ప్రకాశ్ పాటిల్, సీఎం, డీసీఎం చర్చించారు. 25 లక్షల మంది యువకుల భవిష్యత్ నాశనం చేశారని మండిపడ్డారు. అశ్వత్థనారాయణ, విజయేంద్ర, ఆర్.అశోక్ ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు.

పౌరాణికాలకు పుట్టినిల్లు కల్పతరునాడు



తుమకూరు: కల్పతరునాడు తుమకూరు జిల్లా పౌరాణిక నాటకాలకు పుట్టినిల్లు అని, తుమకూరు జిల్లాలో రంగభూమి కళాకారులు పెద్ద సంఖ్యలో ఉన్నారని హిరెమఠాధ్యక్షుడు డాక్టర్.శ్రీ శివానంద శివాచార్య స్వామీజీ అన్నారు. నగరంలో ఉన్న డాక్టర్ గుబ్బి వీరణ్ణ కళా క్షేత్రంలో శ్రీ కెంపెగౌడ కళా సంఘం, తుమకూరు జిల్లా రంగభూమి కళాకారుల సంఘం, కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో రంగభూమి సీనియర్ కళాకారుడు హెత్తనహళ్లి హెచ్.టి. రంగస్వామికి వెండి కిరీటంతో సన్మానించి సంపూర్ణ రామాయణ నాటక ప్రదర్శన ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... తుమకూరు జిల్లాలో రంగభూమి కళాకారులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారాంతాలలో ఏదో ఒక రోజు పౌరాణిక నాటకాల ప్రదర్శన ఇస్తునే ఉంటారని అన్నారు.

డాక్యుమెంట్ల డిజిటలైజేషన్‌కి నమూనా సిద్ధం

దొడ్డబళ్లాపురం: రెవెన్యూశాఖకు సంబంధించిన రిజిస్ట్రేషన్, సర్వే ఇతర డాక్యుమెంట్లను డిజిటలైజేషన్ చేసేందుకు బ్లూప్రింట్ సిద్ధం చేసామని రెవెన్యూ మంత్రి క్రిష్ణబైరేగౌడ అన్నారు. కలబుర్గిలో రెవెన్యూశాఖకు సంబంధించి తొమ్మిది జిల్లాల అధికారులతో సమావేశమైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు, భూముల యజమానుల ఆర్‌టీసీలను డిజిటలైజేషన్ చేస్తున్నామని, ఇప్పటికే 1.70 కోట్ల ఆర్.టీ.సీ.లను ఆధార్‌తో లింక్ చేయడం జరిగిందన్నారు. అనేక జిల్లాల్లో 70 శాతం పని పూర్తయిందన్నారు. ఆస్తులకు ఆధార్ లింక్ జరిగితే రాబోవు రోజుల్లో మ్యుటేషన్, దస్తావేజుల డిజిటలైజేషన్ సులభం అవుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా అందాలనేదే తమ ఉద్దేశమన్నారు.

వరుసగా ఢీకొన్న కార్లు

- ఆరు వాహనాలు ధ్వంసం

మైసూరు: మైసూరు జిల్లా హుణసూరు తాలూకా కొలగట్ట గ్రామం వద్ద కార్లు ఒకదానికొకటి ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. దీంతో ఆరు వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. ముందు వెళ్తున్న ఓ కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో అదే వేగంతో వెనుకాల వస్తున్న వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. కార్ల ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓ కారులో ఉన్న వారు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. బిళికెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


ధ్వంసమైన కారు ముందు భాగం


ఘటన స్థలం వద్ద పోలీసుల విచారణ



హోసూరు వార్తలు..

దివ్యాంగులకు సంక్షేమ ఫలాలు


దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేసిన దృశ్యం

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో దివ్యాంగులకు సంక్షేమ ఫలాలను అందజేశారు. కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాగునీరు, రోడ్ల వసతి, ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టుయంత్రాలు, వృద్ధాప్య పెన్షన్ కోరుతూ 308 ఫిర్యాదులను అందజేశారు. ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అంగవికల సంక్షేమ శాఖ ద్వారా 7 మంది దివ్యాంగులకు రూ. 72 వేలు విలువ చేసే ఉచిత కుట్టుయంత్రం, ఊత కర్రలు, వీల్‌చైర్ తదితరాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో సాధనకురల్, అధికారులు పన్నీర్‌సెల్వం, పద్మలత, సుందరరాజ్, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడికూర తిని బాలుడు మృతి

కెలమంగలం: కెలమంగలంలో కోడి కూర తిన్న బాలుడు అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాల మేరకు కెలమంగలం పట్టణ పంచాయతీ పనందోపు కాలనీ ప్రాంతానికి చెందిన మణి, రమ్య దంపతులకు చరణ్ (8), ఆరణ్ (7) పిల్లలున్నారు. రమ్య అదే ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీచర్. చరణ్ అదే పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో వండిన కోడికూరని తిన్న చరణ్‌కు వాంతులు విరేచనాలు అయ్యాయి. వెంటనే కెలమంగలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించుకొని ఇంటికొచ్చారు. బాలుడు మళ్లీ అనారోగ్యానికి గురి కావడంతో హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. కూరని సక్రమంగా నిల్వ ఉంచకపోవడం వల్ల కలుషితమై ఉంటుందని అనుమానాలున్నాయి.

ప్రదీప్ ఈశ్వర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి


సమావేశంలో బలిజ సముదాయం నేతలు

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే మద్దతుదారులు, బలిజ సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని వారు విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో బలిజ సముదాయం నుండి ప్రదీప్ ఈశ్వర్ ఒక్కరే ఎన్నికయ్యారని, ఆయనకు మంత్రి మండలిలో అవకాశం ఇవ్వాలని, అదే విధంగా బలిజల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో బలిజ సంఘం నేతలు శ్రీనివాస్, గంగాధర్, రమేశ్, సుధా వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎటుచూసినా ట్రాఫిక్ ఇబ్బందులే


హోసూరు- బెంగళూరు జాతీయ రహదారిలో స్తంభించిన వాహనాలు

హోసూరు: హోసూరు పట్టణంలోని ప్రధాన రోడ్లలో ఏ వైపు వెళ్లినా వాహనదారులు ట్రాఫిక్ సమస్యల్లో ఇరుక్కుపోవలసిందే. హోసూరు– డెంకణీకోట మార్గంలో రైల్వే రోడ్డు విస్తరణలో భాగంగా రైల్వేస్టేషన్ సమీపంలో వంతెన నిర్మాణంతో ఆ మార్గాన్ని మూసివేశారు. బస్టాండు నుంచి డెంకణీకోట, కెలమంగలం వైపు వెళ్లే వాహనాలను తళి రోడ్డుపై మళ్లించారు. దీంతో తళి రోడ్డులోని రైల్వేగేట్ ప్రాంతంలో గంటల తరబడి వాహన రాకపోకలు స్తంభించి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీనికి తోడు మత్తిగిరి కూడలి రోడ్డు వద్ద కెలమంగలం నుంచి అత్తిపల్లి వైపు వెళ్లే ప్రధాన రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో అక్కడ కూడా ట్రాఫిక్ రద్దీ తప్పడం లేదు. కార్మికులు, ఉద్యోగులు సమయానికి విధులకెళ్లలేకపోతున్నారు. దీనికి తోడు హోసూరు – బెంగళూరు జాతీయ రహదారి సిప్‌కాట్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ప్రభుత్వం తక్షణం పనులను పూర్తిచేసి ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు


విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

హోసూరు: ప్రభుత్వ పాఠశాలలో పది, ప్లస్‌టూ తరగతుల్లో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ద్వారా నగదు బహుమతిని అందజేశారు. హోసూరు తాలూకా బాగలూరులో లయన్స్ క్లబ్ కార్యవర్గ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రవివర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటగా కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేసుకొన్నారు. అధ్యక్షుడిగా కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యదర్శులుగా శ్రీనాథ్, గాంధీలాల్, కోశాధికారిగా సంతోష్‌కుమార్‌లను ఎంపిక చేశారు. బాగలూరు ప్రాంతంలో లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, కంటి చికిత్సా శిబిరాలతో పాటు పాఠశాల పిల్లలకు బహుమతులు, అనాథ శరణాలయాలకు భోజనం అందజేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా బాగలూరు లోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో 10, ప్లస్‌టూ తరగతుల్లో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. సంఘం చైర్మన్ షణ్ముగవేలు, వై.వి.ఎస్.రెడ్డి, రమేష్‌బాబు, నంబి, పళనియప్ప, మోహన్‌సెందిల్, కుమార్, ఐచ్చంగూరు పంచాయతీ అధ్యక్షులు చంద్రశేఖరరెడ్డి, జిల్లా కౌన్సిలర్ ఆర్.కే.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో శవం

కెలమంగలం: తాళం వేసిన ఇంట్లో వ్యక్తి శవమై కనిపించిన ఘటన డెంకణీకోట వద్ద జరిగింది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని కురుబరపల్లి గ్రామానికి చెందిన మాదేవ (34) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి తాగుడు అలవాటుండేది. గత రెండు రోజులుగా మాదేవ ఇళ్లు వేసిన తాళం వేసినట్లే ఉండేది. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు డెంకణీకోట పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తాళాలు పగులగొట్టి లోనికెళ్లి చూడగా మాదేవ శవమై కనిపించాడు. శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో కల్తీ సారా ప్రవాహం

- అన్నా డీఎంకే నేతల ఆరోపణ


పాల్గొన్న కార్యకర్తలు



మాట్లాడుతున్న నాయకులు

క్రిష్ణగిరి: డీఎంకే ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో కల్తీ సారా నదిలా ప్రవహిస్తుందని, దీని వల్ల అమాయక ప్రజలు బలైపోతున్నారని, ముఖ్యమంత్రి స్టాలిన్ రాజీనామా చేయాలని సోమవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో అన్నాడీఎంకే పార్టీ ఆందోళన నిర్వహించింది. క్రిష్ణగిరి ఎమ్మెల్యే అశోక్‌కుమార్, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి, వేపనపల్లి ఎమ్మెల్యే కే.పి.మునిస్వామి, రాజ్యసభ ఎంపీ తంబిదురై పాల్గొని మాట్లాడుతూ నాటుసారా, కల్తీ సారా ఏరులై పారుతుందని, దీని వల్ల సాధారణ ప్రజలు చనిపోయి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో గంజా, గుట్కా విక్రయాలతో పాటు మాదక ద్రవ్యాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపించారు. ఈ ఆందోళనలో వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

శిలువను కూలగొట్టిన కూటమి నేతలు

పోలీసులకు ఫిర్యాదు చేసిన క్రైస్తవ యువత


గొట్రాలి కొండపై కూల్చివేసిన శిలువ

యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం నియోజక వర్గం పెద్దారవీడు మండలంలోని పోతంపల్లిలో కూటమి నేతలు శిలువను కూల్చివేశారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోతంపల్లిలోని తిరుమలనాథ స్వామి గొట్రాలి కొండపై ఉన్న శిలువను తీసి వేయాలని పలుమార్లు బీజేపీ, టీడీపీ నాయకులు క్రైస్తవులను కోరారు. ఈ విషయంపై రెండు పర్యాయాలు వివాదాలకు దారితీయగా.. అప్పుడు ఇరువర్గాల వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం గొట్రాలి కొండ తిరుమలనాథ స్వామి తిరునాళ్ల జరుగుతుండగా.. దీనిని అదునుగా తీసుకున్న కూటమికి చెందిన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు శిలువను కూల్చివేశారు. దీనిపై క్రైస్తవులు పోలీసులను ఆశ్రయించారు. తిరునాళ్ల జరుగుతుండటం వలన విచారణ చేయడం కష్టంగా ఉంటుందని, 2 రోజుల్లో విచారణ చేసి నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెప్పినట్లు క్రైస్తవులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో గ్రామంలో ప్రత్యేక పోలీస్ దళాలను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు.

మాజీ వలంటీర్‌పై టీడీపీ నేతల దాడి

తీవ్రగాయాలతో ఆస్పత్రిలో బాధితుడు


దాడిలో గాయపడిన హనుమకొండ రాజీవ్ కుమార్

కావలి: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలోని 34వ వార్డుకు చెందిన మాజీ వలంటీర్ హనుమకొండ రాజీవ్ కుమార్‌పై టీడీపీ నాయకులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాడికి పాల్పడ్డారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ప్రచారం చేశాడనే నెపంతో ఇంటికి వెళ్తున్న రాజీవ్ కుమార్‌పై 15 మంది టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో రాజీవ్‌కు తల, ముఖంపైన తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు రావడంతో నిందితులు పరారయ్యారు. స్థానికులు రాజీవ్‌ను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, దాడి ఘటన తీవ్ర కలకలం రేపడంతో టీడీపీ నేతలు ముందు జాగ్రత్తగా కౌంటర్ కేసులతో బాధితుడిపైనే ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించేందుకు పోలీసులపైన ఒత్తిడి తెస్తున్నారు.


వైఎస్సార్‌సీపీ వీరాభిమాని మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

నందిగామ: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక అనారోగ్యానికి గురైన ఓ వీరాభిమాని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పార్టీ నాయకుడు నెలకుదిటి శివ నాగేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం..ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కేతవీరునిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వీరాభిమాని గోలి లక్ష్మీనారాయణ (46) చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పార్టీ ఓటమి పాలు కావడంతో తట్టుకోలేక అప్పటినుంచి కొద్ది రోజులు నిద్రాహారాలు మానేశాడు. ఆ తర్వాత అదే ఆలోచనతో అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జగనన్న లే అవుట్ ధ్వంసం

- రాళ్లు తొలగించి చదునుచేసిన టీడీపీ నేతలు
- నంద్యాల జిల్లా ఓబులాపురంలో దుశ్చర్య


పొక్లెయిన్‌తో ప్లాట్‌లను చదును చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: నంద్యాల జిల్లా డోన్ మండలంలోని ఓబులాపురంలో టీడీపీ నేతలు బరితెగించారు. జగనన్న లే అవుట్‌ను ధ్వంసం చేశారు. ఎనిమిది నెలల కిందట గ్రామంలోని సర్వే నంబరు 532లో 1.5 ఎకరాల్లో 65 మంది ఇళ్లులేని అర్హులైన నిరుపేదలకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలను మంజూరు చేసింది. సోమవారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొందరు ఈ జగనన్న లే అవుట్‌లోని రాళ్లను తొలగించి చదును చేశారు. ఇళ్లు నిర్మించుకుందామనుకుంటున్నామని, ఇప్పుడు టీడీపీ వర్గీయులు ఏకంగా లే అవుట్‌ను ధ్వంసం చేశారని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. అధికార పార్టీ నాయకులే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి స్పందిస్తూ.. వీఆర్‌ఏ ద్వారా పూర్తి సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శిలాఫలకాల ధ్వంసం

ద్విచక్ర వాహనం దహనం.. వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ కండువా


కుందురువారిపాలెంలో దహనమైన ద్విచక్ర వాహనం


మండపేటలో దుండగులు ధ్వంసం చేసిన శిలాఫలకం


శెట్టిపేటలో ధ్వంసం చేసిన సొసైటీ భవన ప్రారంభోత్సవ శిలాఫలకం


పాఠశాలలో ధ్వంసం చేసిన నాడు–నేడు శిలాఫలకం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు శిలాఫలకాలను ధ్వంసం చేస్తూనే ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రగతి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆదివారం రాత్రి, సోమవారం ధ్వంసం చేశారు. వాహనాల దహనం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు.

- తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం శెట్టిపేటలో రూ.27 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ భవనం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ఈ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. త్రిసభ్య కమిటీ పేరుపై ఫ్లెక్సీ ఏర్పాటుచేయగా చైర్మన్‌గా వ్యవహరించిన గంధం వెంకటరత్నం (షావుకారు) పేరు సైతం తొలగించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామంలోని మండల ప్రజాపరిషత్ పాఠశాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు–నేడు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీనిపై ఎంఈవో సూచన మేరకు ప్రధానోపాధ్యాయురాలు గంటా రజనీప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మండపేట–ద్వారపూడి రహదారి పనులకు సంబంధించి స్థానిక తాపేశ్వరం రోడ్డులోని లాకులకు వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. శిలాఫలకంపై ఉన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఫొటోను పూర్తిగా తొలగించారు. ఘటనాస్థలాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాధాకృష్ణ తదితరులు పరిశీలించారు. శిలాఫలకాల ధ్వంసం దారుణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వెంటనే స్పందించి, ఇటువంటి ఘటనలను నిలువరించకపోతే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.
- ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయగూడెంలో శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లేదారిలో గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు తెలిపే శిలాఫలకాన్ని తొలగించారు. ఇటువంటి చర్యలకు పాల్పడటం బాధాకరమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.
- పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం కుందురువారిపాలెం గ్రామంలో బత్తుల రాంబాబు ద్విచక్ర వాహనాన్ని దహనం చేశారు. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన రాంబాబు ద్విచక్రవాహనాన్ని ఇంటి ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి దాటాక మంటలు రావటాన్ని గమనించిన స్థానికులు మంటల్ని ఆర్పివేశారు. అప్పటికే ద్విచక్రవాహనం పూర్తిగా కాలిపోయింది. రాంబాబు భార్య స్వాతి గ్రామంలో వలంటీరుగా పనిచేసింది. టీడీపీ నాయకులు విజయోత్సవ సంబరాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. అదే సమయంలో ద్విచక్రవాహనం దహనమైంది. ఘటనాస్థలాన్ని ఎస్.ఐ. పి.హజరత్తయ్య పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.
- ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని మర్లపాడు గ్రామ సెంటర్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు టీడీపీ కండువా వేశారు. టీడీపీ నాయకుల అగడాలు తారస్థాయికి చేరాయని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి టీడీపీ కండువా కప్పి అవమానించారని వైఎస్సార్‌సీపీ మర్లపాడు గ్రామ అధ్యక్షుడు సంగమనేని బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

వెంకన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన టీడీపీ నేతలు

వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతిష్ఠించారన్న అక్కసుతో దుశ్చర్య


టీడీపీ నేతలు ధ్వంసం చేసిన వెంకటేశ్వర స్వామి విగ్రహం

పెరవలి: ఇప్పటి వరకూ వైఎస్సార్‌సీపీ కార్యాలయాలు, శిలాఫలకాలను మాత్రమే ధ్వంసం చేసిన టీడీపీ నేతలు వెంకటేశ్వర స్వామి విగ్రహంపైనా విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతిష్ఠించారనే అక్కసుతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. టీడీపీ ప్రోద్బలంతో జరిగిన ఈ ఘటనలో విగ్రహం కాలు, చేయిని విరగ్గొట్టడంతో గ్రామస్తుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. వివరాల్లోకి వెళితే.. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లిలో జాతీయ రహదారి పక్కన కూరగాయల మార్కెట్లో వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు గత నెలలో ప్రతిష్ఠించారు. విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేశారన్న అక్కసుతో టీడీపీ నేతలు అప్పటినుంచీ రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి స్వామివారి విగ్రహం చెయ్యి, కాలు విరగ్గొట్టారు. విగ్రహం ఏర్పాటు చేసిన దిమ్మెను తవ్వేసి.. స్వామి విగ్రహాన్ని పెకలించి సమీపంలోని రైతు భరోసా కేంద్రం వద్ద పడేశారు. ఘటనపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు మోహరించారు.

మంత్రి అనగాని ఇలాకాలో శ్రుతిమించిన దౌర్జన్యం

దాడులకు తెగబడుతున్న అనగాని అనుచరగణం

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు
- రాంబొట్లవారిపాలెం నేత రాజ్‌కుమార్‌పై టీడీపీ దాడి
- కులంపేరుతో దూషించి కొట్టి తీవ్రంగా గాయపరిచిన వైనం
- చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లోను వరుస దాడులు


రాజ్‌కుమార్‌ను విచారిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికారం అండతో టీడీపీ నేతలు పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. వాహనాలను తగులబెడుతున్నారు. కులం పేరుతో దూషిస్తున్నారు. ఊరు వదిలిపోవాలని హెచ్చరిస్తున్నారు. వెళ్లనివారిపై దాడులు చేసి కొడుతున్నారు. తీవ్రంగా గాయపరుస్తున్నారు. నాయకులపై దాడులు చేయడంతో పాటు వారి ఆస్తులకు నష్టం చేస్తున్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సొంత ఇలాకా రేపల్లె నియోజకవర్గంలో ఈ తరహా దాడులు పెచ్చుమీరాయి. ఆదివారం రాత్రి చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకుడు చేబ్రోలు రాజ్‌కుమార్ ఇంటిపై 30 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లు తదితర మారణాయుధాలతో దాడిచేశారు. రాజ్‌కుమార్‌ను కులం పేరు పెట్టి రాయలేని పదజాలంతో దూషించారు. మాకు వ్యతిరేకంగా పనిచేస్తావా..? అంటూ దాడిచేసి తీవ్రంగా కొట్టారు. బయటకు లాక్కొచ్చి ఇంటిమెట్లపైన, ఇంటిముందున్న ఇసుక దిబ్బపైన పడేసి మళ్లీమళ్లీ కొట్టారు. దాడివిషయం తెలుసుకున్న అతడి బంధువులు అక్కడికి చేరుకోవడంతో రాజ్‌కుమార్ కొనప్రాణాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను తొలుత రేపల్లె ఆస్పత్రికి తరలించారు. తరువాత తెనాలి ఆస్పత్రిలో చేర్చారు. తనను ఊరువదలి వెళ్లిపోవాలని టీడీపీ కార్యకర్తలు హెచ్చరించారని రాజ్‌కుమార్ తెలిపారు. రాంబొట్లవారిపాలెం, వగడంవారిపాలెం, పిట్టుకోటిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన 30 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లు తదితర మారణాయుధాలతో దాడి చేసినట్లు బాధితుడు సోమవారం జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ప్రసాదరెడ్డిని టీడీపీ మూకలు బెదిరిస్తున్నాయి. చెరుకుపల్లి మండలం ఆరుంబాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది కర్ర ప్రతాప్ ఇంటిపై దాడిచేసి ఆయన ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. గుళ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన శిలాఫలకాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. నిజాంపట్నం మండలం అడవులదీవి సర్పంచ్ ఏమినేని రాంబాబు ఇంటిపై దాడిచేసి కిటికీ అద్దాలు పగులగొట్టారు. నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ నేతలు.. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను ఊర్లు వదలివెళ్లాలని నిత్యం బెదిరిస్తున్నారు.

టీడీపీ వర్గీయుల వేధింపులతో ఆత్మహత్య

- ప్రాణాలు తీసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త భార్య
- బాధితులపైనే పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు
- తూర్పు గోదావరి జిల్లా అనంతపల్లిలో దారుణం


మృతురాలు పెద్దింట్లు

నల్లజర్ల: టీడీపీ వారి సూటిపోటి మాటలు, వేధింపులు తట్టుకోలేక తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాము భార్య పెద్దింట్లు (50) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త రాము, వారి కుమారుడు ప్రసాద్ సోమవారం తెలిపిన మేరకు.. ఈ కుటుంబం గ్రామంలోని గంగానమ్మ గుడి వీధిలో నివసిస్తోంది. ఆ వీధిలో వీరొక్కరే వైఎస్సార్‌సీపీకి చెందినవారు. మిగిలిన వారంతా టీడీపీ వారే. గ్రామంలోని పద్మావతి డ్వాక్రా సంఘంలో పెద్దింట్లు సభ్యురాలు. వయస్సు పైబడిన మానికల లక్ష్మమ్మ ఆ గ్రూపు నుంచి వైదొలగడంతో ఆమె స్థానంలో కొత్త సభ్యురాలిని చేర్చుకునే విషయమై గ్రూపులోని మిగిలిన సభ్యులతో పెద్దింట్లుకు ఇటీవల వివాదం జరిగింది. దీనికితోడు పెద్దింట్లు వైఎస్సార్‌సీపీకి చెందినవారు కావడంతో గ్రూపు సభ్యులు ఆమెను వేధించసాగారు. ఎన్నికల ముందు నుంచే సూటిపోటి మాటలతో వేధిస్తున్న గ్రూపు సభ్యులు.. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమితో వేధింపుల్ని తీవ్రతరం చేశారు. ఇంటిపైకి వచ్చి బెదిరించసాగారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన పెద్దింట్లు గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. తొలుత స్థానికంగా వైద్యం చేయించిన కుటుంబసభ్యులు తరువాత ఏలూరు, అక్కడి నుంచి గుంటూరు ఆస్పత్రికి తరలించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ పెద్దింట్లు ఆదివారం మృతిచెందింది. టీడీపీ వర్గీయులు తమను వేధించడమే కాకుండా, తిరిగి తమపై పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టారని రాము, ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దింట్లును మానసికంగా వేధించి ఆమె మృతికి కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై వేట కొడవలితో దాడి

- అనంతపురం జిల్లాలో టీడీపీ నాయకుల బరితెగింపు
- తల్లీకుమారుడికి తీవ్ర గాయాలు
- నిందితుల్లో టీడీపీ ఎంపీటీసీ భర్త


గాయపడిన ఆదిలక్ష్మి, కిరణ్

బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు వేట కొడవలితో దాడి చేశారు. ఆదిలక్ష్మి, ఆమె కుమారుడు కిరణ్‌కుమార్ రెడ్డిని తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవలి ఎన్నికల్లో ఆదిలక్ష్మి, ఆమె కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ తరఫున పనిచేశారు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ భర్త ఆదినారాయణ, అతని కుమారుడు పార్థసారథి, మరో వ్యక్తి బద్రి కక్ష పెంచుకున్నారు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఆదిలక్ష్మి ఇంటికి వెళ్లి దూషించడం మొదలుపెట్టారు. 'ఇంట్లో నుంచి బయటకు రా. మిమ్మల్ని కొడితే దిక్కెవరు?' అంటూ ఆదిలక్ష్మిని బెదిరించారు. ఆమె ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ వారికి చెప్పినా వినకుండా మరింత రెచ్చిపోయారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆమెపైన, కిరణ్‌కుమార్ రెడ్డిపైన వేటకొడవలితో దాడి చేయడంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలింగ్ అయిన మూడు రోజుల తరువాత ఆదినారాయణ, అతని కుమారుడు పార్థసారథి మరో నలుగురు కలిసి అదే గ్రామానికి చెందిన ఓ దళితునిపైన దాడి చేసి గాయపరిచారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో టీడీపీ నాయకుల ఆగడాలు పెరిగిపోయాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మనిషి కాదు.. మృగం

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో దారుణ హత్య

- మృతదేహాన్ని ముక్కలుగా నరికిన హంతకుడు
- శరీర భాగాలను పట్టణ శివారులో పడేసిన వైనం
- మృతుడి తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తే హంతకుడిగా గుర్తింపు


హత్యకు గురైన వెంకటమహేశ్వరరెడ్డి


హంతకుడు రామచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: అతను మనిషి కాదు.. మనిషి రూపంలో ఉన్న మృగం. ఓ వ్యక్తిని అత్యంత కర్కశంగా నరికి, మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోసి శివారు ప్రాంతంలో పడేసిన కిరాతకుడు. ఈ దారుణ సంఘటన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వైఎంఆర్ కాలనీలో ఉంటున్న ద్వార్శల వెంకట మహేశ్వరరెడ్డి (31) ఓ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు లేబర్‌గా పని చేస్తున్నాడు. అతనికి 10 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడే తండ్రి శ్రీనివాసులరెడ్డి చనిపోయాడు. దీంతో అతని తల్లి నాగరత్నమ్మకు స్వీట్ షాపు, కేటరింగ్ వ్యాపారం చేసే ప్రొద్దుటూరుకు చెందిన భూమిరెడ్డి రామచంద్రారెడ్డి అనే వ్యక్తి దగ్గరై సహజీవనం చేస్తున్నాడు. సుమారు 20 ఏళ్లుగా ముగ్గురూ కలిసి వైఎంఆర్ కాలనీలోని ఇంట్లోనే ఉంటున్నారు. నాగరత్నమ్మకు ఉన్న జబ్బు కారణంగా ఇంజక్షన్ తీసుకుంటే ఉదయం వరకు మెలకువ రాదు. అదే విధంగా ఆదివారం రాత్రి కూడా ఇంజక్షన్ తీసుకొని పడుకొంది. పక్క గదిలో మహేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి మద్యం తాగుతూ గొడవ పడ్డారు. రామచంద్రారెడ్డి గొడ్డలి, కొడవలితో మహేశ్వరరెడ్డిని కిరాతకంగా నరికేశాడు. మృతదేహాన్ని ముక్కలు చేసి రెండు గోనె సంచుల్లో మూటగట్టాడు. సోమవారం ఉదయాన్నే టిఫిన్ తీసుకొచ్చి నాగరత్నమ్మకు ఇచ్చాడు. ఉదయం 7.25 గంటల సమయంలో మృతదేహం భాగాలు ఉన్న రెండు గోనె సంచులను బైక్‌పై తీసుకెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత నాగరత్నమ్మ పక్క గదిలోకి రాగా, గదంతా రక్తంతో నిండి ఉంది. దీంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. తన కుమారుడు కనిపించకపోవడంతో మరింత ఆందోళన చెందింది. హత్య జరిగిన విషయం తెలియగానే డీఎస్పీ మురళీధర్, త్రీ టౌన్, టూటౌన్ సీఐలు వెంకటరమణ, అబ్దుల్‌కరీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గదంతా రక్తపు మరకలు ఉన్నాయి. మృతుడి శరీర భాగాలు కొన్ని పడి ఉన్నాయి. పక్కనే రక్తపు మరకలు ఉన్న గొడ్డలి, కొడవలి ఉన్నాయి. దీంతో మహేశ్వరరెడ్డి హత్యకు గురైనట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సీసీ కెమెరాల ఫుటేజీ, ఇతర సమాచారం ఆధారంగా సోమవారం సాయంత్రం 6.45 గంటల సమయంలో పట్టణ శివారులో మృతదేహం భాగాలు ఉన్న గోనె సంచుల్ని పోలీసులు కనుగొన్నారు. తన కుమారుడిని రామచంద్రారెడ్డి హత్య చేశాడని నాగరత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమారుడు మద్యం కోసం డబ్బు కావాలని ఎప్పుడూ రామచంద్రారెడ్డిని అడిగేవాడని తెలిపింది. ఇలా డబ్బు కోసం జరిగిన గొడవే హత్యకు దారి తీసినట్లు పోలీసులు భావిస్తున్నారు. నాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు.

పోలీసులపై టీడీపీ నాయకుల దాష్టీకం

గుర్రంకొండ పోలీసు స్టేషన్ వద్ద టీడీపీ నేతల దౌర్జన్యం

- ఎస్‌ఐపైనే చేయి చేసుకున్న టీడీపీ నేతలు
- అడ్డుకున్న కానిస్టేబుళ్లపైనా దాడి
- లాఠీచార్జి చేసిన పోలీసులు


గుర్రంకొండ పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులపై దాడులకు దిగిన టీడీపీ నాయకులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గత 20 రోజులుగా రాష్ట్రంలో చెలరేగిపోతున్న తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు చివరకు పోలీసులపైనే దాడికి బరితెగించారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండలో పోలీసు స్టేషన్ వద్దే ఎస్సై, కానిస్టేబుల్‌పై చేయి చేసుకొని, బూతులు తిడుతూ దౌర్జన్యానికి తెగబడ్డారు. చివరకు పోలీసులు లాఠీచార్జీ చేసి టీడీపీ నాయకులను అక్కడి నుంచి తరిమారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ మండలంలోని అమిలేపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణ కోర్టులో స్టే తెచ్చుకొని తన స్థలంలో ఇనుప కంచె వేసుకున్నాడు. ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సోమవారం ఈ స్థలంలో ఉన్న ఇనుప కంచెను దౌర్జన్యంగా తొలగించారు. ఇదేమిటని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకుడిని పోలీస్ స్టేషన్‌కు విచారణకు పిలిపించారు. అతని వెంట ఎంపీపీ యోగేంద్ర, జెడ్పీటీసీ సమ్మీన్ ముక్తియార్, మాజీ సర్పంచ్ జగన్‌మోహన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్ ముందు కుర్చీలలో వారంతా కూర్చున్నారు. అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నా కొ..లని స్టేషన్ వద్ద కుర్చీల్లో ఎలా కూర్చొంటారంటూ కేకలు వేస్తూ లోపలికి చొచ్చుకొని వచ్చారు. స్టేషన్‌లో ఉన్న ఎస్‌ఐ శ్రీనివాసనాయక్, ఏఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది వారిని అడ్డుకొని ఏమైనా ఉంటే స్టేషన్లో కూర్చొని మాట్లాడుకొందామని కోరారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ నాయకులు ఎస్‌ఐ శ్రీనివాస్ నాయక్‌పై చేయి చేసుకొని, కింద పడేశారు. అడ్డుకోబోయిన కానిస్టేబుళ్లను కూడా కిందికి తోసేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జీ చేసి వారిని చెదరగొట్టారు. దీంతో టీడీపీ వారు అక్కడినుంచి వెళ్లిపోయారు. వాల్మీకిపురం సీఐ శేఖర్ స్టేషన్ వద్దకు చేరుకొని విచారణ జరిపారు. పోలీసులపై దాడి చేసిన టీడీపీ నాయకుల కోసం గాలిస్తూ వెళ్లిపోయారు. ఎస్‌ఐపై దాడి చేయడం గుర్రంకొండ చరిత్రలో ఇదే మొదటిసారని గ్రామస్తులు చర్చించుకొన్నారు.

టీడీపీ, జనసేన జెండా కర్రలతో కొట్టారు

- గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధిత మహిళల ఫిర్యాదు
- దళితవాడలపై దాడులను వెంటనే కట్టడి చేయాలని వినతి


డీపీవోలో ఫిర్యాదు చేసిన బాధితులు

నగరంపాలెం: టీడీపీ, జనసేన నాయకులు కులం పేరుతో దూషిస్తూ, జెండా కర్రలతో కొట్టారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టీపట్టనట్లు ఉన్నారని తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీవో)లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనైనా న్యాయం జరుగుతుందనే ఆశతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధిత మహిళలు వేల్పూరి మరియరాణి, కొరబండి కెజియా, కొరబండి జోత్స్న, వేల్పూరి మేరి, పిల్లి రాజు తదితరులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం గరుడాచలపాలెం (మందులపాలెం) దళితవాడకు చెందిన వేల్పూరి మరియరాణి, కొరబండి కెజియా ఈనెల నాలుగోతేదీ ఓట్ల లెక్కింపు రోజు సాయంత్రం వందాయతీబజార్ పంపు వద్ద నీళ్లు పట్టుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మాలపల్లి వైపునకు టీడీపీ, జనసేనకు చెందిన ఆయా సామాజికవర్గాల వారు బైక్‌లపై ర్యాలీగా వెళ్తున్నారు. ర్యాలీలో మితిమీరిన వేగంతో వెళ్తుండగా, కొంచెం నెమ్మదిగా వెళ్లాలని వారు కోరారు. దీంతో ర్యాలీలోని కొందరు బూతులు తిట్టారు. కులం పేరుతో దూషించి, జెండా కర్రలతో దాడి చేశారు. బాధితులు బిగ్గరగా కేకలు వేయడంతో దగ్గర్లో ఉన్న కొరబండి నయోమి, కొరబండి జ్యోత్స్న, వేల్పూరి మేరి, తురక సుజాత అక్కడికి చేరుకున్నారు. ర్యాలీ చేస్తున్న వ్యక్తులు వారిపైనా దాడులకు పాల్పడ్డారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. ఈ సందర్భంగా మాల ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్‌బాబు మీడియాతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు సాయంత్రం దళితవాడలో మహిళలపై జెండా కర్రలతో దాడులు చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. మాలపల్లి నుంచి ఫిర్యాదులు తీసుకోవద్దని అధికార పార్టీ ఏమైనా ఆదేశించిందా అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు ఎస్సీలు కూడా ఓట్లేశారనేది గుర్తుంచుకోవాలన్నారు. దాడులకు ఫుల్‌స్టాప్ పెట్టాలని వారు తమ పార్టీల కార్యకర్తలకు సూచించాలని పేర్కొన్నారు. ఎదిరించే పరిస్థితి తేవద్దని హెచ్చరించారు. దళితవాడలపై దాడులు ఆపాలని, సీఎం చంద్రబాబు వైఖరి మార్చుకోవాలని కోరారు. దీనిపై ఎస్సీ ఎమ్మెల్యేలు, మంత్రులకు బాధ్యత ఎంతైనా ఉందన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత కుమారుడిపై టీడీపీ హత్యాయత్నం


గాయపడిన షేక్ యాసిర్ అరాఫత్

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని పురుషోత్తమపట్నంలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడి కుమారుడిపై టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ షేక్ గాలిబ్‌షా కుమారుడు షేక్ యాసిర్ అరాఫత్‌పై రాళ్లతో దాడిచేసి కత్తితో పొడిచారు. గాయపడిన అరాఫత్ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అరాఫత్ గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఇది మనసులో పెట్టుకున్న టీడీపీ వర్గీయులు ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో అరాఫత్ వాటర్‌ప్లాంట్‌పై రాళ్లదాడి చేశారు. ఆ సమయంలో ఇంటివద్ద ఉన్న అరాఫత్‌కు సమాచారం అందటంతో వాటర్‌ప్లాంట్ వద్దకు చేరుకుని దాడిని నివారించే ప్రయత్నం చేశాడు. దీంతో అరాఫత్‌పై కత్తితో దాడిచేసి పొట్టలోను, వీపుపైన పొడిచి హత్యాయత్నం చేశారు. రాళ్లతో నుదిటిపై కొట్టారు. తీవ్రంగా గాయపడిన అరాఫత్‌కు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. పట్టణ ఎస్‌ఐ జి.పుల్లారావు మాట్లాడుతూ.. దాడి జరిగిన విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు.

బాల వికాసం



ఆలియా భట్

పిల్లల్ని ప్రేమించేవారు కథలనూ ప్రేమిస్తారు

బాల్యంలో తమకు ఇష్టమైనవి తమ పిల్లలకు దక్కాలనుకుంటారు తల్లిదండ్రులు.
నటి ఆలియా భట్ తన తాతగారి నుంచి చాలా కథలు వినేది.
కుమార్తె పుట్టాక ఆ పాపకు కథలు చెప్పాలనిపించింది.
తన పాపకే ఏమిటి అందరు పిల్లలకూ కథలు చెప్తానని ఏకంగా కథల పుస్తకం రాసింది.
'ఎడ్ ఫ్రెండ్స్ ఏ హోమ్' దాని పేరు.
సాహస బాలిక తన శునకంతో ఎన్ని అద్భుతాలు చేసిందనేదే కథ.
పిల్లలకు అవసరమైన కథా ప్రపంచం గురించి ఆలియా మాటలు....

'ఒకమ్మాయికి ప్రకృతితో మాట్లాడే శక్తి వస్తే? చెట్లతో పుట్టతో పిట్టలతో జంతువులతో మాట్లాడే శక్తీ వాటి మాటలను అర్థం చేసుకునే శక్తీ వస్తే? వాటి సమస్యలు తెలుసుకొని భూమిని, పర్యావరణాన్ని కాపాడాలని అనుకుంటే ఎంత బాగుంటుంది. అదే నా తొలి పుస్తకం కథ' అని చెప్పింది నటి ఆలియా భట్.

ఆమె రాసిన మొదటి పుస్తకం 'ఎడ్ ఫైండ్స్ ఏ హోమ్'... పెంగ్విన్ సంస్థ ఉప విభాగం పఫిన్ ద్వారా మార్కెట్‌లో విడుదలైంది. బాలీవుడ్‌లో సూపర్‌స్టార్ అయిన ఆలియా భట్ తనకు కూతురు పుట్టాక ఈ పుస్తకాన్ని విడుదల చేయడం వల్ల పిల్లల పుస్తకాల అవసరం, వాటి ఉద్దేశ్యం గురించి నేడు మళ్లీ బాలల సాహిత్య ప్రేమికులు మాట్లాడుకుంటున్నారు.

కరుణ, పర్యావరణ ప్రేమ

'పిల్లల పుస్తకాలు పిల్లల్లో కరుణని పెంచాలి. పర్యావరణ స్పృహను కలిగించాలి. పిల్లలకు తన ఇంటి బయట ఉండే ప్రకృతి పరిసరాలు, దూరాన కొండల్లో ఉండే పక్షులు, పులులు, ఏనుగులు... ఇవి ఎంతో ఇష్టం. వాటిని పాత్రలుగా చేసుకుని కథలు చెప్తే వారు వింటారు' అంటుంది ఆలియా.

వివేక్ కామత్, తన సోదరి షబ్నమ్ మిన్‌వాలాల సహాయంతో ఆలియా 'ఎడ్ ఫైండ్స్ ఏ హోమ్' పుస్తకం రాసింది. ఇందులో చిన్నారి అమ్మాయి పేరును ఆలియా అనే పెట్టింది. మరో ముఖ్యపాత్రైన కుక్కపిల్లకు 'ఎడ్' అనే పేరు పెట్టింది. ఇది ఆలియాకు ఉన్న మూడు పిల్లుల్లో ఒకదాని పేరు ఎడ్వర్డ్ నుంచి తీసుకుంది. 'ఎవరూ పట్టించుకోకుండా వదిలేయడంతో దిక్కుతోచక తిరుగుతున్న కుక్కపిల్లను ఆలియా అనే చిన్నారి చేరదీస్తుంది. వీరితో పాటు ఒక మాట్లాడే కాకి, మాట్లాడే కొబ్బరి చెట్టు ఈ కథలో పాత్రలుగా ఉంటాయి. మొదటి భాగంలో వీరంతా పరిచయం అవుతారు. తర్వాతి భాగాల్లో భూమి కాపాడే సాహసాలు ఉంటాయి. ఆలియా, ఎడ్‌లను ప్రధాన పాత్రలుగా చేసుకుని వరుసగా కథల పుస్తకాలు తెస్తాను. వీటిని యానిమేషన్ సిరీస్‌గా కూడా వెలువరిస్తాను. నా మొదటి పుస్తకం కూడా ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ పేపర్ మీదే అచ్చయ్యింది' అని తెలియచేసింది ఆలియా


పిల్లలకు కథలు అవసరం

'నా చిన్నప్పుడు మా తాత (తల్లి సోనీ రాజ్దాన్ తండ్రి నరేంద్రనాథ్ రాజ్దాన్) నాకు చాలా కథలు చెప్పేవారు. ముఖ్యంగా మున్ను, గున్ను అనే మూడు పాత్రలతో ఆయన చెప్పే కథలు నాకు భలే నచ్చేవి. ఆ మూడు పాత్రలు మనుషులో చీమలో ఎలుకలో కూడా తెలియదు. ఇక మా అక్క షాహీన్ పుస్తకాల పురుగు. నాకు కథలు చదివి వినిపించేది. మా అమ్మాయి రాహా పుట్టాక పిల్లల కథల గురించి మళ్లీ ఆలోచన వచ్చింది. ఇప్పుడు దానికి 19 నెలలు. రోజూ నేను దానికి నిద్రపోయే ముందు కనీసం మూడు కథల పుస్తకాలు చదివి వినిపిస్తాను. రకరకాల గొంతులతో పాత్రలను చదువుతాను. చాలా ఆసక్తిగా వింటుంది. తర్వాత ఆ పుస్తకాలను కౌగిలించుకుని నిద్రపోతుంది. నా పుస్తకంలోని కథ కూడా వినిపించాను. అయితే కథ కంటే కూడా దానికి పుస్తకంలోని బొమ్మలు బాగా నచ్చాయి' అని నవ్వింది ఆలియా

పుస్తకాలు, బొమ్మలు

'పిల్లల పుస్తకాలే కాదు పిల్లల బొమ్మలు కూడా బోధనాత్మకంగా ఉండాలి. బొమ్మలు విజ్ఞానం పంచేలా ఉండాలి. అలాగే పర్యావరణహితంగా తయారవ్వాలి. ఇలాంటి పనులన్నింటిలో నేను నిమగ్నం కావాలని కోరుకుంటున్నాను. నేను రచయితను కాను. స్టోరీ టెల్లర్‌ని. మనందరం కథలు రాయలేకపోయినా చెప్పగలం. పిల్లలకు కథలు చెప్పాలి తల్లిదండ్రులు పిల్లలను కథల ప్రపంచానికి దూరం చేయవద్దు. వారికి ఆ ప్రపంచం చాలా ముఖ్యం' అంటోంది ఆలియా.

సిక్స్-జెనరేషన్



సౌందర్య లహరి - ది స్టార్ ఇన్ యూ

పెద్ద వ్యాపార కుటుంబంలో పుట్టింది ఇమాన్ అల్లానా.
కుటుంబ వ్యాపారంతో నిమిత్తం లేకుండా ఎంటర్‌ప్రెన్యూర్‌గా సొంతంగా విజయం సాధించాలనేది ఆమె కల. ఆరోతరం ఎంటర్‌ప్రెన్యూర్‌గా బ్యూటీ బ్రాండ్ 'బాలీ గ్లో'తో చిన్న వయసులోనే పెద్ద విజయం సాధించింది 26 సంవత్సరాల ఇమాన్.
'సాధించాలనే తపన ఉంటే తెలియని దారులు కూడా పరిచయం అవుతాయి. కొత్త ప్రపంచంలోకి తీసుకు వెళతాయి. విజయాలకు దగ్గర చేస్తాయి' అంటున్న ఇమాన్ అల్లానా గురించి...

బంగారు చెంచాతో పుట్టింది ఇమాన్ అల్లానా తల్లిదండ్రులు ఇర్ఫాన్, బుష్రా దుబాయిలో బిలియనీర్‌లు. రీజెంట్స్ యూనివర్శిటీ లండన్‌లో 'బ్రాండ్ మేనేజ్‌మెంట్'లో మాస్టర్స్ చేసిన ఇమాన్‌కు ఎంటర్‌ప్రెన్యూర్‌గా తనను తాను నిరూపించుకోవాలనే కోరిక బలంగా ఉండేది. స్కూలు తరువాత అమ్మానాన్నల ఆఫీసుకు వచ్చేది. అక్కడ తమ వ్యాపారానికి సంబంధించిన ఎన్నో మాటలు వినేది. ముఖ్యమైన మీటింగ్ ఉంటే బడికి బంక్ కొట్టి మరీ ఆ మీటింగ్‌లో పాల్గొనేది. మీటింగ్‌లో జరిగే చర్చలను శ్రద్ధగా వినేది... అలా వ్యాపార విషయాలపై ఇమాన్‌కు చిన్న వయసులోనే ఆసక్తి మొదలైంది.

ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం తెలుసుకోవాలని తపించే ఇమాన్‌కు చిన్న చిన్న ఎడ్యుకేషనల్ కోర్సులు చేయడం అంటే ఇష్టం. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించి చిన్న కోర్సులు ఎన్నో చేసింది. 'సొంతంగా బిజినెస్ స్టార్ట్ చేసి రిస్క్ చేయడం ఎందుకు! మన బిజినెస్ చూసుకుంటే సరిపోతుంది' అని ఇమాన్ తల్లిదండ్రులు ఎప్పుడూ అనలేదు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా తనను తాను నిరూపించుకునే అవకాశాన్ని, ప్రోత్సాహాన్ని ఇచ్చారు. వారి ప్రోత్సాహ బలంతో ఆరోతరం కుటుంబ సభ్యురాలిగా ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించింది ఇమాన్.

> **కష్టఫలం**
>
> బిజినెస్ స్కూలులో చదివినంత మాత్రాన, రకరకాల మేనేజ్‌మెంట్ కోర్సులు చేసినంత మాత్రాన ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించలేం. అది పూర్తిగా మన ఆసక్తి, అధ్యయనం, కష్టం, అంకితభావంపై ఆధారపడి ఉంటుంది. బిజినెస్ అనేది బేబీలాంటిది. చాలా జాగ్రత్తగా చూసుకోవాలి.
> – ఇమాన్ అల్లానా

బాలీవుడ్, బ్యూటీ మేళవింపుగా వచ్చిన 'బాలీ గ్లో' బ్యూటీ ఇండస్ట్రీలో తక్కువ సమయంలోనే గుర్తింపు సాధించింది. ప్యాకేజింగ్ నుంచి మార్కెటింగ్ వరకు తనదైన ప్రత్యేకత చాటుకుంది. ప్రాడక్ట్‌కు సంబంధించిన ఇన్‌గ్రేడియెంట్స్‌ను ప్రపంచం నలుమూలల నుంచి సేకరిస్తారు. ఇదే సమయంలో పర్యావరణానికి హానికరమైన వాటిని దూరం పెడతారు.

ప్రాడక్ట్‌కు సంబంధించి 'ది స్టార్ ఇన్ యూ' ట్యాగ్‌లైన్ హిట్ అయింది. 'ఇన్నర్ హెల్త్‌కు చర్మం అద్దం పడుతుంది' అంటున్న ఇమాన్ చర్మసౌందర్యానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలో తరచుగా చెబుతుంటుంది.

వ్యాపార పనుల్లో భాగంగా లండన్-దుబాయ్-ముంబై నగరాల మధ్య తిరుగుతూ ఉంటుది ఇమాన్.

ఎంటర్‌ప్రెన్యూర్‌గానే కాదు సామాజిక కార్యకర్తగా... ఇన్వెస్టర్‌గా కూడా రాణిస్తోంది. 'ఫ్యాషన్ అనేది కళారూపం. సృజనాత్మక వ్యక్తీకరణ' అంటున్న ఇమాన్ ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలకు ప్రాధాన్యత ఇస్తుంది.

'ఇప్పుడు కస్టమర్లు ప్రాడక్ట్ తాలూకు లేబుల్ మాత్రమే చూసి ఓకే చెప్పడం లేదు. ప్రాడక్ట్స్‌కు సంబంధించి ఇన్‌గ్రేడియెంట్స్‌పై కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మా బ్రాండ్ పర్యావరణ హిత, క్రుయాల్టీ-ఫ్రీ ఇన్‌గ్రేడియెంట్స్‌కు ప్రాధాన్యత ఇస్తోంది' అంటుంది ఇమాన్

బ్యూటీప్రాడక్స్‌పై మాత్రమే కాకుండా మహిళా సాధికారతకు సంబంధించిన విషయాలపై కూడా దృష్టి పెడుతోంది బాలీ గ్లో



విదేశీ విత్తనాలను, మొక్కల్ని ఆన్‌లైన్‌లో కొంటున్నారా? జాగ్రత్త..!

విదేశాల నుంచి మొక్కలు, విత్తనాలు, చెక్క వస్తువులు, అలంకరణ చేపలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారా?

విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడ కంటికి నచ్చిన పూల మొక్కలనో, వంట మొక్కలనో, వాటి విత్తనాలనో అధికారుల కన్నుగప్పి వెంట తెస్తున్నారా?

మిరపతో పాటు కొన్ని కూరగాయ పంటలు, మామిడి తోటలను ఇటీవల అల్లాడిస్తున్న నల్ల తామర ఇలాగే విదేశాల నుంచి వచ్చిపడిందేనని మీకు తెలుసా? కొబ్బరి, ఆయిల్‌పామ్ వంటి తోటలను పీడిస్తున్న రుగోస్ రింగ్‌స్పాట్ తెల్లదోమ కూడా విదేశాల నుంచి మన నెత్తిన పడినదే. వీటి వల్ల జీవవైవిధ్యానికి, రైతులకు అపారమైన నష్టం కలుగుతోంది.

ఒక దేశంలో ఉన్నప్పుడు పెద్దగా నష్టం కలిగించని పురుగులు, తెగుళ్లు వేరే దేశపు పర్యావరణంలోకి ప్రవేశించినప్పుడు అక్కడి జీవవైవిధ్యానికి పెను సమస్యగా మారే ప్రమాదం ఉంటుంది.

ఒక్కసారి ఆ పర్యావరణంలో అది సమస్యగా మారిన తర్వాత దాన్ని నిర్మూలించటం చాలా సందర్భాల్లో అసాధ్యం. ఉదాహరణ.. మన రైతులను వేధిస్తున్న నల్లతామర, రుగోస్ రింగ్ స్పాట్ తెల్లదోమ. అందుచేత.. విదేశాల నుంచి సకారణంగా ఏదైనా మొక్కల్ని, విత్తనాలను, అలంకరణ చేపలను తెప్పించుకోవాలనుకుంటే.. అంతకు ముందే ఫైటోశానిటరీ సర్టిఫికెట్‌తో పాటు ఇతర అనుమతుల్ని కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

తస్మాత్ జాగ్రత్త..!

తెలిసో తెలియకో పోస్టు, కొరియర్ల ద్వారా మన వంటి వారు కొనుగోలు చేస్తున్న విదేశీ మొక్కలు, విత్తనాలతో పాటు మనకు తెలియకుండా దిగుమతయ్యే సరికొత్త విదేశీ జాతుల పురుగులు, తెగుళ్లు మన దేశంలో పంటలకు, జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఆహార భద్రతకు ఎసరు పెట్టే పరిస్థితులూ తలెత్తవచ్చు. అందుకే అంతర్జాతీయంగా జన్యువనరుల వ్యాపారాన్ని నియంత్రించేందుకు ఎయిర్‌పోర్టుల్లో, సీపోర్టుల్లో, సరిహద్దుల్లో ప్రత్యేక అధికార వ్యవస్థలను ఏర్పాటు చేశారు. మొక్కలు, విత్తనాలే కాదు.. మట్టి ద్వారా కూడా ఒక దేశం నుంచి మరో దేశానికి చీడపీడలు తెలియకుండా రవాణా కావొచ్చు. ఆ మధ్య ఒక క్రికెటర్ తనతో పాటు తీసుకెళ్తున్న బూట్లకు అడుగున అంటుకొని ఉన్న మట్టిని సైతం ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు గుర్తించి, నివారించడానికి ఇదే కారణం.


• గోల్డెన్ ఆపిల్ స్నెయిల్


• వరి మొక్కపై నత్త గుడ్లు


అధికారికంగా వ్యవసాయ పరిశోధనల కోసం దిగుమతయ్యే పార్శిళ్లను ఈ క్వారంటైన్ అధికారులు వాటిని నిబంధనల మేరకు పరీక్షించి, ప్రమాదం లేదనుకుంటేనే దిగుమతిదారులకు అందిస్తారు. జాతీయ మొక్కల జన్యువనరుల పరిశోధనా సంస్థ (ఎన్‌బీపీజీఆర్) ద్వారా ఇది జరుగుతుంది.

విదేశీ నత్తలతో ముప్పు!

ఓ కోస్తా జిల్లాకు చెందిన ఒక వ్యక్తి మంచినీటి నత్త జాతికి చెందిన గోల్డెన్ ఆపిల్ స్నెయిల్‌ను విదేశాల నుంచి తెప్పించి సిమెంటు తొట్లలో పెంచుతూ పట్టుబడ్డాడు. దక్షిణ అమెరికా దీని స్వస్థలం. అయితే, తైవాన్, జపాన్, ఫిలిప్పీన్స్ దేశాలకు పాకిన ఈ నత్త ఆయా దేశాల్లో తామరతంపరగా పెరిగిపోతూ స్థానిక జలచరాలను పెరగనీయకుండా జీవవైవిధ్యాన్ని, వరి పంటను దెబ్బతీయటం ప్రారంభించింది. లేత వరి మొక్కలను కొరికెయ్యటం ద్వారా పంటకు 50% వరకు నష్టం చేకూర్చగలదు. ఫిలిప్పీన్స్‌లో ఏకంగా 200 కోట్ల డాలర్ల మేరకు పంట నష్టం కలిగించింది. వేగంగా పెరిగే లక్షణం గల ఈ నత్త మంచినీటి చెరువులు, కాలువలు, వరి పొలాల్లో జీవవైవిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఈ వ్యక్తి ఈ నత్తలను పెంచుతూ మాంసాన్ని విక్రయించటం ప్రారంభించిన విషయం తెలుసుకున్న అధికారులు అతని వద్ద ఉన్న విదేశీ నత్తలను, వాటి గుడ్లను పూర్తిగా నాశనం చేశారు. దీని వల్ల జీవవైవిధ్యానికి ఉన్న ప్రమాదాన్ని గుర్తించలేని స్థితిలో ఈ నత్తల్ని పెంచటం ప్రారంభించినట్లు చెబుతున్నారు. కొరియర్ ద్వారా గాని, కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి నత్తలను తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. అయితే, సకాలంలో అధికారులు స్పందించటం వల్ల మన వరి పొలాలకు ఈ నత్తల ముప్పు తప్పింది.

ఇండియన్ స్టిక్ ఇన్‌సెక్ట్

ఎండిన, ముక్కలు చేసిన లేదా పాలిష్ చేసిన ధాన్యాలు, విత్తనాలు, పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు కూడా చీడపీడలను మోసుకొచ్చే ప్రమాదం ఉంది. అయితే, ఉడికించటం, స్టెరిలైజ్ చేయటం, వేపటం వంటి ప్రాసెసింగ్ చేసిన ఆహారోత్పత్తుల ద్వారా మాత్రం చీడపీడలు రవాణా అయ్యే అవకాశం ఉండదు కాబట్టి వీటికి ఫైటోశానిటరీ నిబంధనలు వర్తించవు. తేనెటీగలు, సీతాకోకచిలుకలు, మాంటిడ్స్, పెంకు పురుగులు, పుల్లలతో చేసిన బొమ్మ మాదిరిగా కనిపించే పురుగులు (స్టిక్ ఇన్‌సెక్ట్స్), నత్తలు వంటి వాటిని కొందరు సరదాగా పెంచుకోవటానికి కూడా ఒక దేశం నుంచి మరో దేశానికి పంపటం



లేదా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయటం వంటి పనులు చేస్తుంటారు. వీటి ద్వారా కూడా పురుగులు, తెగుళ్లు, వైరస్‌లు ఇతర దేశాలకు వ్యాపించే అవకాశం ఉంటుంది.

న్యూజిలాండ్‌లో మూడేళ్ల క్రితం ఒక స్కూలు విద్యార్థిని ఇంట్లో పెద్దలకు తెలియకుండా అనేక రకాల స్టిక్ ఇన్‌సెక్ట్ గుడ్లను పోర్చుగల్ దేశం నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి తెప్పించుకుంది. పార్శిల్ వచ్చిన తర్వాత గమనించిన ఆమె తల్లి ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వారు ఆ పార్శిల్‌ను జాగ్రత్తగా తీసుకెళ్లి పరీక్షించి చూశారు

ఆ దేశంలో అప్పటికే ఉన్న అనేక రకాల స్టిక్ ఇన్‌సెక్ట్స్ గుడ్లతో పాటు కొత్త రకం ఇండియన్ స్టిక్ ఇన్‌సెక్ట్ గుడ్లు కూడా ఆ పార్శిల్‌లో ఉన్నాయని గుర్తించి నాశనం చేశారు. ఈ విద్యార్థిని తల్లి చైతన్యం మెచ్చదగినది.

ఒక వ్యాపార సంస్థ నుంచి నేరుగా వినియోగదారుల మధ్య (బిటిసి) జరిగే ఆన్‌లైన్ వ్యాపారం వల్లనే సమస్య. విదేశాల్లోని వినియోగదారులకు ఓ వ్యాపార సంస్థ నేరుగా అమ్మకాలు జరుపుతున్నందున దిగుమతులకు సంబంధించిన ఫైటోశానిటరీ నిబంధనల అమలు కష్టతరంగా మారింది.

అంతర్జాతీయంగా ఈ వ్యవహారాల పర్యవేక్షణ కోసం ప్రపంచ దేశాల మధ్య ఇంటర్నేషనల్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఒడంబడిక (ఐపిపిసి) గతంలోనే కుదిరింది. ఇటీవల కాలంలో పెద్ద తలనొప్పిగా మారిన ఈ-కామర్స్ పార్శిళ్లను కట్టడి చేయడం కోసం జాతీయ స్థాయిలో నియంత్రణ వ్యవస్థలకు ఐపిపిసి సరికొత్త మార్గదర్శకాలను సూచించింది

* * *

ఎవరేమి చెయ్యాలి?

దేశ సరిహద్దులు దాటి సరికొత్త చీడపీడలు మన దేశంలోకి ప్రవేశించకుండా ఉండాలంటే, ప్రమాదవశాత్తూ వచ్చినా వాటిని తొలి దశలోనే గుర్తించి మట్టుబెట్టేందుకు సమాజంలోని అనేక వర్గాల వారు చైతన్యంతో వ్యవహరించాల్సి ఉంది.

రైతులు: చీడపీడలను చురుగ్గా గమనిస్తూ ఏదైనా కొత్త తెగులు లేదా పురుగు కనిపిస్తే వెంటనే అధికారులకు చెప్పాలి. పర్యావరణ హితమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు: చీడపీడల నివారణ, నియంత్రణకు మేలైన పద్ధతులను రైతులకు సూచించాలి. వీటి అమలుకు మద్దతు ఇస్తూ.. మొక్కల ఆరోగ్య పరిరక్షణకు సంబంధీకులందరినీ సమన్వయం చేయాలి.

ప్రభుత్వాలు, విధాన నిర్ణేతలు, పాలకులు: మొక్కల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించాలి. పర్యావరణహితమైన సస్యరక్షణ చర్యలను ప్రోత్సహించాలి. ప్రమాదరహితమైన వ్యాపార పద్ధతులను ప్రవేశ పెట్టాలి. జాతీయ, రాష్ట్రాల స్థాయిలో మొక్కల ఆరోగ్య రక్షణ ప్రభుత్వ సంస్థలను అన్ని విధాలా బలోపేతం చేయాలి.


దాతలు-సిఎస్ఆర్: మొక్కల ఆరోగ్య రక్షణ వ్యవస్థలను, సాంకేతికతలను బలోపేతం చేయాలి. ప్రైవేటు కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులు సమకూర్చాలి. రవాణా, వ్యాపార రంగాలు: ప్రస్తుతం అంతర్జాతీయంగా అమల్లో ఉన్న ఫైటోశానిటరీ చట్టాలను, ఐపిపిసి ప్రమాణాలను తు.చ. తప్పక పాటించాలి.

ప్రజలు: విదేశాల నుంచి మన దేశంలోకి మొక్కల్ని, మొక్కల ఉత్పత్తుల్ని తీసుకురావటం ఎంతటి ప్రమాదమో గుర్తించాలి. అధికార వ్యవస్థల కన్నుగప్పే విధంగా ఈ-కామర్స్ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా విదేశాల నుంచి మొక్కలను, విత్తనాలను ఆర్డర్ చేయకుండా చైతన్యంతో మెలగాలి

సెకనుకు 5,102 ఈ-కామర్స్ లావాదేవీలు!

ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ ద్వారా వస్తువుల వ్యాపారం (ఈ-కామర్స్) గతమెన్నడూ లేనంత జోరుగా సాగుతున్న రోజులివి. సెకనుకు 5,102 ఈ-కామర్స్ లావాదేవీలు జరుగుతున్నాయి. 2022లో ఏకంగా 16,100 కోట్ల పార్శిళ్ల కొనుగోళ్లు ఆన్‌లైన్‌లో జరిగాయి. కరోనా కాలంలో 20% పెరిగాయి. ఇప్పుడు వార్షిక పెరుగుదల 8.5%. 2027 నాటికి ఏటా 25,600 కోట్ల పార్శిళ్లు ఈ కామర్స్ ద్వారా బట్వాడా అయ్యే అవకాశం ఉందని అంచనా.

ముఖ్యంగా ఆసక్తిగా ఇంటిపంటలు, పూల మొక్కలు పెంచుకునే గృహస్థులు చిన్న చిన్న కవర్లలో విత్తనాలను విదేశాల్లోని పరిచయస్తులకు పోస్ట్/ కొరియర్ ద్వారా పంపుతుంటారు. విదేశీ కంపెనీల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి తెప్పించుకుంటూ ఉంటారు. విదేశాల నుంచి విత్తనాలు, ఉద్యాన తోటల మొక్కలు, అలంకరణ మొక్కలు, వాటితో పాటు వచ్చే మట్టి, అలంకరణ చేపలు, చెక్కతో చేసిన వస్తువులు, యంత్రాల ప్యాకింగ్‌లో వాడే వుడ్ ఫ్రేమ్‌ల ద్వారా పురుగులు, తెగుళ్లు ఒక దేశం నుంచి మరో దేశానికి రవాణా అవుతూ అధికారులకు చెమటలు పట్టిస్తున్నాయి. కరోనా కాలం నుంచి ప్రపంచ దేశాల మధ్య పార్శిళ్ల వ్యాపారం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోవటంతో నియంత్రణ వ్యవస్థలు ఉక్కిరి బిక్కిరవుతున్నాయి. మన దేశంలో నియంత్రణ వ్యవస్థలను నేటి అవసరాలకు అనుగుణంగా పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.


• అమెరికాలోని ఓ తనిఖీ కేంద్రంలో ఈ-కామర్స్ పార్శిళ్లు

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

సాగుబడి

ఆరుద్ర కార్తె : జూలై 5 వరకు

జూలై 7న నూజివీడులో రైతు సదస్సు

ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా నూజివీడు టీటీడీ కల్యాణ మండపంలో జూలై 7(ఆదివారం)న ఉ. 10 గంటల నుంచి మామిడి సాగులో మెలకువలతో పాటు బయోచార్ వినియోగంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు నూజివీడు సేంద్రియ ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి భోగోలు రాజేశ్ తెలిపారు. బయోచార్ నిపుణులు డా. నక్కా సాయిభాస్కర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పిస్తారని రాజేశ్ (91779 88422) వివరించారు.

గోమయ ఉత్పత్తులపై 30న శిక్షణ

ఆవు పేడతో అనేక ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ వ్యూహాలపై రైతులు, గోశాలల నిర్వాహకులకు ఈ నెల 30న హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు మురళీధర గోధామం (జగిత్యాల జిల్లా) వ్యవస్థాపకులు డాక్టర్ పద్మ తెలిపారు. గోశాలలను ఆర్థికంగా స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 98497 50854.

అంగ్రూ ఆన్‌లైన్ కోర్సులు

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ) సార్వత్రిక, దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో మిద్దెతోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల పెంపకంపై వేర్వేరుగా ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనుంది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఈ కోర్సులు నిర్వహిస్తారు.
ఫీజు రూ. 1,500
ఇతర వివరాలకు.. 80087 88776
www.angrau.ac.in

"భారత జట్టుకు ఎంపికైనందుకు ఆనందంగా ఉంది. అయితే నా స్వప్నం 50 శాతమే సాకారమైంది. నేను టీమిండియా జెర్సీ వేసుకొని మైదానంలో దిగి సెంచరీతో జట్టును గెలిపించినపుడే నా పూర్తి కల నెరవేరుతుంది. నా కెరీర్‌ను తీర్చిదిద్దేందుకు మా నాన్న నా కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఇప్పుడు అయన కళ్లలో ఆనందం చూస్తుంటే ఇదే కదా అయన లక్ష్యమని గర్వంగా ఉంది. –నితీశ్ కుమార్ రెడ్డి

నితీశ్ కుమార్ రెడ్డికి వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: భారత సీనియర్ క్రికెట్ జట్టులో చోటు దక్కించుకున్న ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ పర్యటనలో మంచి ప్రతిభ చూపాలని ఆయన ఆకాంక్షించారు. కెరీర్లో మరింత ఎదగాలంటూ కోరుకుంటున్నానని వైఎస్ జగన్ అన్నారు. విశాఖపట్నానికి చెందిన నితీశ్ దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర రంజీ జట్టు తరఫున ఆడుతున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరఫున అడి 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు సొంతం చేసుకున్నాడు.

దక్షిణాఫ్రికా దర్జాగా...

- సెమీస్ చేరిన సఫారీ జట్టు
- సూపర్-8లోనే విండీస్ నిష్క్రమణ


షమ్సీ

నార్త్‌సౌండ్: టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తమ జోరు ప్రదర్శించింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం మూడు వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించి దర్జాగా సెమీఫైనల్ చేరింది. సూపర్-8 దశలో ఆడిన మూడూ గెలిచిన సఫారీ 6 పాయింట్లతో గ్రూప్-2 టాపర్‌గా, 4 పాయింట్లతో ఇంగ్లండ్ రెండో జట్టుగా సెమీఫైనల్స్‌కు చేరాయి. రెండుసార్లు టి20 చాంపియన్, ఆతిథ్య వెస్టిండీస్ కథ 'సూపర్-8'లోనే ముగిసింది. ముందుగా వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులే చేసింది. కైల్ మేయర్స్ (34 బంతుల్లో 35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోస్టన్ చేజ్ (42 బంతుల్లో 52; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. రోమ్‌మన్ పావెల్ (1), రూథర్‌ఫోర్డ్ (0), రసెల్ (15) చేతులెత్తేయడంతో కరీబియన్ జట్టు ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తబ్రేజ్ షమ్సీ 3 వికెట్లు తీశాడు. 136 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 15 పరుగులు చేసిన దశలో వర్షంతో 50 నిమిషాలు ఆటకు అంతరాయం కలిగింది. దాంతో దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 17 ఓవర్లలో 123 పరుగులుగా నిర్ణయించారు. ఆ జట్టు 16.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసి నెగ్గింది. స్టబ్స్ (27 బంతుల్లో 29; 4 ఫోర్లు), క్లాసెన్ (10 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), జాన్సెన్ (14 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) లక్ష్యంవైపు తీసుకెళ్లారు. చేజ్ 3, రసెల్, జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా సెమీస్ చేరడం ఇది మూడోసారి. 2009, 2014లలో ఆ జట్టు సెమీస్‌లో వెనుదిరిగింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X బంగ్లాదేశ్

వేదిక: కింగ్స్‌టౌన్; ఉదయం గం. 6 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆసీస్‌ను పడగొట్టి సెమీఫైనల్‌కు

ఏడు నెలల క్రితం తగిలిన దెబ్బకు ఇప్పుడు కాస్త ఉపశమనం! ఫైనల్ కాకపోవచ్చు, ఫార్మాట్ వేరు కావచ్చు... కానీ ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాను ఓడించడం అంటే సగటు భారత అభిమాని ఆనందాన్ని రెట్టింపు చేసే క్షణం! వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత మళ్లీ ఇప్పుడే తలపడిన మ్యాచ్‌లో టీమిండియా అలాంటి సంతోషాన్నే పంచింది. ఆసీస్‌ను చిత్తు చేసి సగర్వంగా సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. రోహిత్ శర్మ అద్భుత బ్యాటింగ్‌తో భారత్ భారీ స్కోరుకు బాటలు వేస్తే మన బౌలర్లు సమర్థంగా లక్ష్యాన్ని కాపాడుకోగలిగారు. ఈ ఓటమితో ఆసీస్ సెమీఫైనల్ ఆశలు అడుగంటిపోగా... 2022 తరహాలోనే సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో పోరుకు టీమిండియా సిద్ధమైంది.

టి20 వరల్డ్‌కప్ సెమీఫైనల్లో భారత్
- 24 పరుగులతో ఆస్ట్రేలియా చిత్తు
- చెలరేగిన రోహిత్ శర్మ
- గురువారం ఇంగ్లండ్‌తో సెమీస్


రోహిత్

గ్రాస్ ఐలెట్: టి20 వరల్డ్‌కప్‌లో వరుసగా రెండోసారి భారత్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. లీగ్ దశలో 3 మ్యాచ్‌లు నెగ్గిన టీమిండియా సూపర్-8లోనూ ఆడిన 3 మ్యాచ్‌లు గెలిచి అజేయంగా సెమీస్ చేరింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 24 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (41 బంతుల్లో 92; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ అవకాశం చేజార్చుకున్నాడు. ఇతర బ్యాటర్లలో సూర్యకుమార్ యాదవ్ (16 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), దూబే (22 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ (17 బంతుల్లో 27 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. జట్టు ఇన్నింగ్స్‌లో రోహిత్ ఒక్కడే 15 బౌండరీలు బాదితే, మిగతా బ్యాటర్లు కలిపి 14 బౌండరీలు కొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 181 పరుగులే చేయగలిగింది. ట్రవిస్ హెడ్ (43 బంతుల్లో 76; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు.

సమష్టి బ్యాటింగ్ ప్రదర్శన...

రెండో ఓవర్లో కోహ్లి (0)ని హాజల్‌వుడ్ అవుట్ చేయడంతో ఆసీస్ సంబరపడింది. కానీ ఆ తర్వాత అసలు కథ మొదలైంది. రోహిత్ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లందరికీ చుక్కలు చూపించాడు. స్టార్క్ ఓవర్లో 29 పరుగులు బాదిన అతను కమిన్స్ ఓవర్లో సిక్స్, 2 ఫోర్లు కొట్టి 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రోహిత్ జోరు చూస్తే సెంచరీ లాంఛనమే అనిపించినా... చక్కటి యార్కర్‌తో స్టార్క్ రోహిత్‌ను బౌల్డ్ చేశాడు! తన తర్వాతి ఓవర్లో సూర్యనూ అతను వెనక్కి పంపించాడు. చివరి 5 ఓవర్లలో భారత్‌ను ఆసీస్ కట్టడి చేసింది.

హెడ్ మెరుపులు...

ఛేదనలో ఆసీస్ కూడా ఆరంభంలోనే వార్నర్ (6) వికెట్ కోల్పోయింది. అయితే హెడ్, మార్ష్ దాటిగా ఆడి రెండో వికెట్‌కు 48 బంతుల్లో 81 పరుగులు జోడించారు. హెడ్ 24 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అయితే అక్షర్ అద్భుత క్యాచ్‌కు మార్ష్ వెనుదిరగడంతో ఆసీస్ పతనం మొదలైంది. 38 పరుగుల వ్యవధిలో జట్టు తర్వాతి 5 వికెట్లు కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది.

ఒకే ఓవర్లో 29 పరుగులు...

ఆసీస్ టాప్ బౌలర్ మిచెల్ స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో రోహిత్ నాలుగు సిక్స్‌లు, ఒక ఫోర్‌తో పండగ చేసుకున్నాడు. ఈ ఓవర్ తొలి నాలుగు బంతుల్లో రోహిత్ వరుసగా 6, 6, 4, 6 కొట్టాడు. ఐదో బంతికి పరుగు రాకపోగా, తర్వాత స్టార్క్ 'వైడ్' వేశాడు. దాంతో అదనపు బంతిని కూడా రోహిత్ సిక్సర్‌గా మలిచాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) స్టార్క్ 92; కోహ్లి (సి) డేవిడ్ (బి) హాజల్‌వుడ్ 0; పంత్ (సి) హాజల్‌వుడ్ (బి) స్టొయినిస్ 15; సూర్యకుమార్ (సి) వేడ్ (బి) స్టార్క్ 31; దూబే (సి) వార్నర్ (బి) స్టొయినిస్ 28; పాండ్యా (నాటౌట్) 27; జడేజా (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 205.** **వికెట్ల పతనం:** 1-6, 2-93, 3-127, 4-159, 5-194. **బౌలింగ్:** స్టార్క్ 4-0-45-2, హాజల్‌వుడ్ 4-0-14-1, కమిన్స్ 4-0-48-0, జంపా 4-0-41-0, స్టొయినిస్ 4-0-56-2. **ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** వార్నర్ (సి) సూర్యకుమార్ (బి) అర్ష్‌దీప్ 6; హెడ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 76; మార్ష్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 37; మ్యాక్స్‌వెల్ (బి) కుల్దీప్ 20; స్టొయినిస్ (సి) పాండ్యా (బి) అక్షర్ 2; డేవిడ్ (సి) బుమ్రా (బి) అర్ష్‌దీప్ 15; వేడ్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 1; కమిన్స్ (నాటౌట్) 11; స్టార్క్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 181.** **వికెట్ల పతనం:** 1-6, 2-87, 3-128, 4-135, 5-150, 6-153, 7-166. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-3, బుమ్రా 4-0-29-1, అక్షర్ పటేల్ 3-0-21-1, హార్దిక్ పాండ్యా 4-0-47-0, కుల్దీప్ యాదవ్ 4-0-24-2, జడేజా 1-0-17-0.

గ్రూప్-1 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే.
భారత్	3	3	0	6	2.017
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.331
అఫ్గానిస్తాన్	2	1	1	2	-0.650
బంగ్లాదేశ్	2	0	2	0	-2.489

టీమిండియాలో నితీశ్ కుమార్ రెడ్డి

పరాగ్, తుషార్, అభిషేక్ శర్మలకూ చాన్స్ | **సీనియర్లకు విశ్రాంతి**

శుబ్‌మన్ గిల్‌కు పగ్గాలు | **జింబాబ్వే పర్యటనకు భారత జట్టు ఎంపిక**



న్యూఢిల్లీ: ఆంధ్ర క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి టీమిండియా జెర్సీ ధరించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) తరఫున చెలరేగిన అతను 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద సీజన్ 2024' అవార్డు కూడా అందుకున్నాడు. ముఖ్యంగా ఈ ఐపీఎల్ ఆసాంతం నితీశ్ కనబరిచిన నిలకడ, కచ్చితత్వంతో కూడిన షాట్లు, మెరిపించిన మెరుపులు భారత సెలక్టర్లను ఆకట్టుకున్నాయి. దీంతో సీనియర్లు విశ్రాంతి తీసుకుంటున్న జింబాబ్వే పర్యటన కోసం అతన్ని భారత జట్టులోకి ఎంపిక చేశారు. శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని ఈ జట్టులో రియాన్ పరాగ్, అభిషేక్ శర్మ, తుషార్ దేశ్‌పాండే లాంటి పలు కొత్తముఖాలకు తొలిసారి చోటు కల్పించింది. ప్రస్తుతం రెగ్యులర్ టీమిండియా జట్టు వెస్టిండీస్‌లో జరుగుతున్న టి20 ప్రపంచకప్‌లో తదుపరి సూపర్-8 దశ మ్యాచ్‌ల్ని ఆడుతోంది. ఈ మెగా టోర్నీలో ముందుగా రోహిత్ బృందం అమెరికాలోనే మొత్తం లీగ్ మ్యాచ్‌ల్ని ఆడింది. ఇక ఈ టోర్నీ ముగిసిన వెంటనే జూలై 6 నుంచి జింబాబ్వే టూర్‌లో ద్వైపాక్షిక సిరీస్ మొదలవుతుంది. పూర్తిగా టి20 ఫార్మాట్‌కే పరిమితమైన ఈ పర్యటనలో భారత జట్టు జూలై 6, 7, 10, 13, 14వ తేదీల్లో హరారే వేదికగా ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. మెగా టోర్నీ కోసం ఎంపికైన యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్‌లు ఇద్దరే జింబాబ్వే పర్యటనకు కొనసాగుతున్నారు. స్టాండ్‌బైలుగా ఉన్న గిల్, రింకూ సింగ్, ఖలీల్, అవేశ్ ఖాన్‌లకు చోటిచ్చారు. సీనియర్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా, బుమ్రా, రవీంద్ర జడేజా, చహల్, సిరాజ్‌లతో పాటు శివమ్ దూబే, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్‌లకు కూడా విశ్రాంతినివ్వడం ఆశ్చర్యకరం. బహుశా సీనియర్ సెలక్షన్ కమిటీ దృష్టి అంతా 2026 టి20 ప్రపంచకప్‌పైనే ఉండటం వల్ల పూర్తి స్థాయిలో రిజర్వ్ బెంచ్‌కే అవకాశం ఇచ్చినట్లు కనిపిస్తోంది.

భారత టి20 జట్టు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజూ సామ్సన్, ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, తుషార్ దేశ్‌పాండే.

ఒలింపిక్స్‌కు భారత ఆర్చరీ జట్లు అర్హత

- మూడు విభాగాల బరిలో ధీరజ్
- నాలుగోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్న తరుణ్‌దీప్, దీపిక


తరుణ్‌దీప్ రాయ్, ధీరజ్, దీపికా కుమారి (ఫైల్)

న్యూఢిల్లీ: మూడు క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా వీలుకాకపోయినా వరల్డ్ ర్యాంకింగ్ ఆధారంగా భారత పురుషుల, మహిళల ఆర్చరీ జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా ఇప్పటికే ఒలింపిక్ బెర్త్‌లు దక్కించుకున్న 10 జట్లను మినహాయించి... వరల్డ్ ర్యాంకింగ్స్‌లో రెండు అత్యుత్తమ జట్లకు మిగిలిన రెండు బెర్త్‌లను కేటాయించారు. పురుషుల విభాగంలో భారత్, చైనా... మహిళల విభాగంలో భారత్, ఇండోనేసియా జట్లకు ఈ అవకాశం లభించింది. ఫలితంగా వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ పురుషుల, మహిళల టీమ్ విభాగాల్లో, వ్యక్తిగత విభాగాల్లో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ పారిస్ ఒలింపిక్స్‌లో మూడు విభాగాల్లో (టీమ్, వ్యక్తిగత, మిక్స్‌డ్) పోటీపడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. 44 ఏళ్ల తరుణ్‌దీప్ రాయ్... మాజీ నంబర్‌వన్ దీపికా కుమారి నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనున్నారు. మహిళల వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ విభాగంలో భజన్ కౌర్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది.

భారత పురుషుల ఆర్చరీ జట్టు: తరుణ్‌దీప్ రాయ్, బొమ్మదేవర ధీరజ్, ప్రవీణ్ జాధవ్. **భారత మహిళల ఆర్చరీ జట్టు:** దీపికా కుమారి, భజన్ కౌర్, అంకిత.

సినిమా

వైజయంతి... ఒక యుద్ధం!


విజయశాంతి

పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ వైజయంతిగా 'కర్తవ్యం' (1990)లో విజయశాంతి నటనను అంత సులువుగా మరచిపోలేం. లేడీ అమితాబ్ అనిపించుకున్న ఈ యాక్షన్ స్టార్ మళ్లీ పోలీసాఫీసర్ వైజయంతిగా కనిపించనున్నారు. కల్యాణ్‌రామ్ హీరోగా రూపొందుతున్న చిత్రంలోనే వైజయంతి పాత్రలో కనిపించనున్నారు విజయశాంతి. సోమవారం (జూన్ 24) విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలో ఆమె లుక్, క్యారెక్టర్ గురించి ఓ వీడియోను విడుదల చేశారు. చీరకట్టులో హుందాగా, ఖాకీ దుస్తుల్లో పవర్‌ఫుల్‌గా విజయశాంతి కనిపించగా, 'వైజయంతి ఐపీఎస్... తను పట్టుకుంటే పోలీస్ తుపాకికే ధైర్యం వస్తుంది... వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది... తానే ఒక యుద్ధం... నేనే తన సైన్యం...' అంటూ ఆమె పాత్ర గురించి కల్యాణ్ రామ్ తన వాయిస్ ఓవర్‌తో ఆ వీడియోలో వివరించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

సల్మాన్ రేస్‌లో లేరా?



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ 'రేస్'లో లేరా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. 'రేస్' మూవీ ఫ్రాంచైజీలో ఇప్పటికే మూడు సినిమాలు (2008లో 'రేస్', 2013లో 'రేస్ 2', 2018లో 'రేస్ 3') వచ్చి, బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. దీంతో ఈ ఫ్రాంచైజీలో రానున్న నాలుగో సినిమాపై ఫుల్ క్రేజ్ నెలకొంది. 'రేస్, రేస్ 2' చిత్రాలకు అబ్బాస్-మస్తాన్ దర్శకత్వం వహించగా, 'రేస్ 3'కి రెమో డిసౌజా దర్శకత్వం వహించారు. 'రేస్ 3'లో సల్మాన్ ఖాన్, అనీల్ కపూర్, బాబీ డియోల్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, డైసీ షా కీలక పాత్రలు పోషించారు. 2018 రంజాన్ సందర్భంగా రిలీజైన ఈ మూవీ సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో 'రేస్ 4' పై ఎలాంటి అప్‌డేట్ వస్తుందా? అని ప్రేక్షకులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. వారి నిరీక్షణకు నిర్మాత రమేశ్ ఎస్. తౌరానీ ఓ స్పష్టత ఇచ్చారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ– ''రేస్' ఫ్రాంచైజీలో రానున్న నాలుగో చిత్రానికి ఇప్పటికే కథ సిద్ధంగా ఉంది. ఇందులో నూతన నటీనటులు ఉంటారు. 'రేస్ 4'లో సల్మాన్ ఖాన్ భాగమవుతాడా? లేదా అనేది ఇప్పుడే చెప్పలేను. ఈ మూవీకి దర్శకుడు ఎవరన్నది కూడా ఇంకా నిర్ణయించలేదు. ఈ ఏడాది చివరికల్లా ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళుతుంది'' అన్నారు. మరి 'రేస్ 4'లో సల్మాన్ భాగమవుతారా? లేదా అనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

విశ్వంభరతో వినాయక్


చిరంజీవి, వశిష్ఠ, వీవీ వినాయక్

చిరంజీవి టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఓ భారీ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సెట్‌కి వెళ్లారు దర్శకుడు వీవీ వినాయక్. దాదాపు 20 ఏళ్ల క్రితం చిరంజీవి హీరోగా వినాయక్ దర్శకత్వం వహించిన 'ఠాగూర్' (2003) చిత్రం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అప్పట్నుంచీ చిరంజీవి–వినాయక్ మధ్య మంచి అనుబంధం ఉంది. సోమవారం 'విశ్వంభర' సెట్‌కి వెళ్లిన వినాయక్ చిత్రదర్శకుడు వశిష్ఠకి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు చిరంజీవితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఇక ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్‌గా తెరకెక్కుతున్న 'విశ్వంభర'లో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, కెమెరా: ఛోటా కె. నాయుడు.

కొంతకాలం గడిచింది... చివరికి..!

దక్షిణాదిలో తనకంటూ మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు మలయాళ బ్యూటీ నివేదా థామస్. నాని హీరోగా నటించిన 'జెంటిల్‌మన్' (2016) మూవీతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ 'నిన్ను కోరి, జై లవ కుశ, బ్రోచేవారెవరురా, వకీల్ సాబ్' వంటి పలు సినిమాల్లో నటించారు. 2022లో విడుదలైన 'శాకిని డాకిని' మూవీ తర్వాత మరో తెలుగు చిత్రంలో నటించలేదు నివేద. అయితే తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. 'చాలా కాలమైంది.. బట్.. చివరికి..' అంటూ లవ్ ఎమోజీని జత చేసి సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు నివేద. లవ్ సింబల్ పెట్టారు కాబట్టి ఇది ప్రేమకు సంబంధించిన వార్త అని, నివేద ఎంగేజ్‌మెంట్ అయిందని, తన పెళ్లి కబురు గురించే ఆ పోస్టు పెట్టారని నెటిజన్లు, ఆమె అభిమానులు పోస్టులు పెడుతున్నారు. కొందరేమో తన కొత్త సినిమా ప్రకటన గురించి అయి ఉంటుందని ఊహిస్తున్నారు. అలాగే ప్రస్తుతం కొత్త సినిమాలేవీ లేకపోవడంతో నివేద పెళ్లి చేసుకునే ఆలోచనలో ఉన్నారనే వారూ లేకపోలేదు. మరి ఆమె పోస్ట్‌కి అర్థం ఏంటి? అనేది నివేదానే చెబితేనే తెలుస్తుంది.


నివేదా థామస్

జూలైలో డార్లింగ్


ప్రియదర్శి, నభా నటేశ్

'హను-మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ అధినేతలు కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన తాజా చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరి' అన్నది ట్యాగ్‌లైన్. ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటించారు. అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బ్రహ్మానందం, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించారు. కాగా ఈ చిత్రాన్ని జూలై 19న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'డార్లింగ్'. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే కంటెంట్ మా సినిమాలో ఉంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, కెమెరా: నరేశ్ రామదుర్తై.

మాస్ రాధా బాయ్


మన్నారా చోప్రా

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా నటించిన చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. బాలీవుడ్ బ్యూటీ మన్నారా చోప్రా ఈ చిత్రంలో ఓ వైవిధ్యమైన పాత్రతో పాటు ఒక స్పెషల్ సాంగ్‌లో నటించారు. మన్నారాపై చిత్రీకరించిన 'రాధా బాయ్...' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని విడుదల చేశారు మేకర్స్. భోలే షావలి సాహిత్యం అందించి, సంగీతం అందించిన ఈ పాటని శ్రావణ భార్గవి ఆలపించారు. ''తిరగబడర సామీ'లో యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే యాక్షన్ ఉన్నాయి. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి స్పందన వచ్చింది. 'రాధా బాయ్...' పాటలోని మన్నారా చోప్రా మాస్ డ్యాన్స్ ఆకట్టుకుంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జవహర్ రెడ్డి యం.ఎన్, సంగీతం: జేబీ-భోలే షావలి.

ముక్కోణపు ప్రేమకథకు ఓకే?


శ్రీలీల

యంగ్ బ్యూటీ శ్రీలీల తెలుగులో దూసుకెళుతున్నారు. ఇక ఆమె బాలీవుడ్ ఎంట్రీ గురించి ఏదో ఒక వార్త ప్రచారంలోకి వస్తూనే ఉంది. కొన్ని రోజుల క్రితం సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీ ఖాన్ నటించనున్న ఓ హిందీ చిత్రం ద్వారా శ్రీలీల బాలీవుడ్ అరంగేట్రం జరగనుందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. తాజాగా హిందీలో ఆమె తొలి చిత్రం ఇది కాదన్నట్లుగా మరో వార్త వైరల్‌గా మారింది. వరుణ్ ధావన్ హీరోగా రూపొందనున్న చిత్రం ద్వారా హీరోయిన్‌గా శ్రీలీల బాలీవుడ్ తెరపై కనిపించనున్నారన్నది ఆ వార్త సారాంశం. ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుందని టాక్. శ్రీలీల ఓ హీరోయిన్‌గా, మృణాల్ ఠాకూర్ మరో హీరోయిన్‌గా నటిస్తారట. కామెడీ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రాన్ని దర్శకుడు డేవిడ్ ధావన్ తెరకెక్కించనున్నారని సమాచారం. జూలై నెల చివర్లో చిత్రీకరణ ఆరంభించి, అక్టోబర్‌లో సినిమాని విడుదల చేయాలనుకుంటున్నారట. మరి... శ్రీలీలకు హిందీలో ఇదే తొలి చిత్రం అవుతుందా? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే మరో నెల ఆగాల్సిందే.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
131	37
77,341	23,538

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,562	▽ 127
డోజోన్స్	39,412	▽ 125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,282	▲ 44
డాక్స్	18,326	▲ 162
షాంఘై	2,963	▽ 35
నికాయ్	38,805	▲ 208

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం	71,615
బంగారం	71,328
వెండి	88,671

ఫారెక్స్ రేట్లు

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.08	84.10
£	బ్రిటన్ పౌండ్		104.42	106.98
€	యూరో		88.21	90.56
¥	జపాన్ ఎన్ (100)		52.10	53.24
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.50	56.43
S$	సింగపూర్ డాలర్		59.23	63.98
SAR	సౌదీ రియాల్		21.25	22.84
UAE D	యూఏఈ దిర్హామ్		20.96	22.64
¥	చైనా యువాన్		10.38	12.46

హీరో వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ ఎంపిక చేసిన మోటార్ సైకిల్స్, స్కూటర్స్ ధరలను రూ.1,500 వరకు పెంచింది. సవరించిన ధరలు జూలై 1 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ సోమవారం ప్రకటించింది. తయారీ వ్యయం అధికం అయినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు హీరో మోటోకార్ప్ వెల్లడించింది. మే నెలలో సంస్థ ఎగుమతులతో కలిపి మొత్తం 4,98,123 యూనిట్లు విక్రయించింది. 2023 మే నెలతో పోలిస్తే ఇది 5 శాతం తగ్గుదల.

ఇండస్‌లో అదనపు వాటాపై కన్ను



3 శాతం కొనుగోలుకి ఎయిర్‌టెల్ చర్చలు

ముంబై: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్.. టెలికం టవర్ల కంపెనీ ఇండస్ టవర్స్‌లో వాటాను పెంచుకోనుంది. ఇందుకు వీలుగా 3 శాతం అదనపు వాటా కొనుగోలుకి వొడాఫోన్ గ్రూప్‌తో చర్చలకు తెరతీసినట్లు తెలుస్తోంది. నిధుల సమీకరణలో భాగంగా యూకే గ్రూప్ వొడాఫోన్ గత వారం ఇండస్‌లో 19% వాటాను విక్రయించింది. ఆ సమయంలో 1% వాటాను సొంతం చేసుకోవడం ద్వారా ఇండస్‌లో వాటాను ఎయిర్‌టెల్ 49 శాతానికి పెంచుకుంది. కాగా.. ఇండస్‌లో మరో 3% వాటాను కొనుగోలు చేస్తే ఎయిర్‌టెల్ వాటా 52 శాతానికి బలపడనుంది. వెరసి మెజారిటీ వాటాదారుగా అవతరించనుంది. ఇందుకు ప్రస్తుతం వొడాఫోన్ పీఎల్‌సీతో ఎయిర్‌టెల్ చర్చలు నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మరోసారి ఎయిర్‌టెల్‌కు 3% వాటాను విక్రయిస్తే ఇండస్‌లో వొడాఫోన్ వాటా 3.1%కి పరిమితంకానుంది. కాగా, ఎయిర్‌టెల్‌కు గల డేటా సెంటర్ల బిజినెస్ ఎనెక్స్‌ట్రాతో ఇండస్ టవర్స్‌ను విలీనం చేసే వీలున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఎయిర్‌టెల్ షేరు స్వల్పంగా బలపడి రూ. 1,418 వద్ద ముగిసింది.

సన్ ఫార్మాతో టారో విలీనం

డీల్ విలువ రూ. 2,900 కోట్లు

న్యూఢిల్లీ: దేశీ హెల్త్‌కేర్ రంగ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్స్‌తో టారో ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ విలీనమైంది. విలీన ఒప్పందం విలువ 34.77 కోట్ల డాలర్లు(సుమారు రూ. 2,900 కోట్లు)కాగా.. విలీనాన్ని పూర్తి చేసినట్లు సన్ ఫార్మా తాజాగా వెల్లడించింది. విలీనంలో భాగంగా టారోకు చెందిన మిగిలిన మొత్తం(ఔట్‌స్టాండింగ్) షేర్లను సొంతం చేసుకున్నట్లు తెలియజేసింది. ఇప్పటికే అనుబంధ సంస్థ అయిన సన్ ఫార్మా.. టారోలో మెజారిటీ వాటాను కలిగి ఉన్న సంగతి తెలిసిందే. దీంతో టారో ప్రైవేట్ కంపెనీగా మారడంతోపాటు.. సన్ ఫార్మాకు పూర్తి అనుబంధ సంస్థగా అవతరించింది. విలీనం రెండు సంస్థలకూ మేలు చేకూర్చగలదని సన్ ఫార్మా చైర్మన్, ఎండీ దిలీప్ సంఘ్వీ పేర్కొన్నారు. తద్వారా రెండు కంపెనీల సామర్థ్యాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వీలుంటుందని తెలియజేశారు. గతేడాది మే నెలలో టారో ఫార్మా బోర్డుకి మొత్తం ఔట్‌స్టాండింగ్ షేర్ల కొనుగోలు ప్రతిపాదనతో సన్ ఫార్మా లేఖ రాసింది. ఒక్కో షేరుకీ 38 డాలర్ల చొప్పున సొంతం చేసుకునేందుకు నాన్‌బైండింగ్ ప్రతిపాదన చేసింది.



సన్ ఫార్మా షేరు బీఎస్‌ఈలో 2% ఎగసి రూ. 1,485 వద్ద క్లోజైంది.

దేశానికి విదేశీ నిధుల దన్ను

- క్యూ4లో కరెంట్ అకౌంట్ మిగులు 0.6 శాతం
- విలువల్లో 5.7 బిలియన్ డాలర్లు



ముంబై: భారత్ కరెంట్ అకౌంట్ మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (జనవరి-మార్చి) సానుకూల ఫలితాన్ని నమోదుచేసింది. ఇదే కాలం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువల్లో పోల్చి 0.6 శాతం మిగులును నమోదుచేసుకుంది. విలువ రూపంలో ఇది 5.7 బిలియన్ డాలర్లు. సేవల రంగం నుంచి ఎగుమతుల పెరుగుదల, ఇతర దేశాల్లో ఉండే భారతీయులు స్వదేశానికి పంపిన భారీ నిధులు (రెమిటెన్స్‌లు) ఇందుకు ప్రధాన కారణం. 2023 జనవరి-మార్చి సమయంలోనూ (0.2 శాతం, విలువలో 1.3 బిలియన్ డాలర్లు), తాజా సమీక్షా త్రైమాసికం ముందు త్రైమాసికం (2023 అక్టోబర్-డిసెంబర్‌లో 1 శాతం, విలువలో 8.7 బిలియన్ డాలర్లు) లోనూ దేశ కరెంట్ అకౌంట్ 'లోటు'ను నమోదుచేసుకోవడం గమనార్హం.

2022-23కన్నా బెటర్: 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తంగా చూస్తే కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) 23.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఈ కాలం జీడీపీ విలువలో ఇది 0.7%కి సమానం. 2022-23తో పోల్చితే (జీడీపీ విలువల్లో 2 శాతం, క్యాడ్ 67 బిలియన్ డాలర్లు) ఇది చాలా తక్కువ.

కరెంట్ అకౌంట్ అంటే..: నిర్దిష్ట కాలంలో దేశానికి వచ్చీ-పోయే విదేశీ మారకద్రవ్యం మధ్య నికర వ్యత్యాసాలను- కరెంట్ అకౌంట్ ప్రతిబింబిస్తుంది. చెల్లింపులకన్నా అధిక నిధులు దేశంలోకి వస్తే దానిని కరెంట్ అకౌంట్ మిగులుగా, దేశంలోనికి వచ్చిన నిధులకంటే చెల్లింపులు ఎక్కువగా ఉంటే దానిని కరెంట్ అకౌంట్ లోటుగా పేర్కొంటారు.

షారుఖ్‌తో ముత్తూట్ ఫిన్‌కార్ప్ 'బుక్ మై గోల్డ్ లోన్' ప్రచారం


హైదరాబాద్: కస్టమర్లకు మరింత సౌకర్యవంతంగా బంగారు రుణాలు చేరువ చేసేందుకు ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ 'బుక్ మై గోల్డ్ లోన్' టెలివిజన్ వాణిజ్య ప్రకటన ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో కంపెనీ కొత్త బ్రాండ్ అంబాసిడర్ నటుడు షారుఖ్ ఖాన్ నటించారు. 80869 80869 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి 'తక్షణమే ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా గోల్డ్ లోన్ బుక్ చేసుకోండి' అంటూ షారుఖ్ చేసిన ప్రచారం ప్రతి భారతీయుడికి చేరుతుందని సంస్థ సీఈఓ షాజీ వర్గీస్ తెలిపారు. కస్టమర్లకు ఆర్థిక సౌలభ్యాన్ని చేకూర్చడంతో పాటు వారి ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు తగిన శక్తిని తమ రుణాలు ఇస్తాయని వర్గీస్ ఆశాభావం వ్యక్తం చేశారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-6-2024	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

క్విక్ కామర్స్.. పోటీకి సై!



- రూ.5,500 కోట్లు సమీకరించిన జెప్టో
- దేశవ్యాప్తంగా భారీ విస్తరణ ప్రణాళిక
- పోటీకి సై అంటున్న ఫ్లిప్‌కార్ట్
- బ్లింకిట్‌కు సవాల్ విసరనున్న సంస్థలు
- ధరల పోటీతోపాటు సేవల నాణ్యతే కీలకం

న్యూఢిల్లీ: ఆర్డర్ చేసిన 10 నిమిషాల్లోనే డెలివరీ చేసే క్విక్ కామర్స్ విభాగంలో మరో విడత పోటీ తీవ్రతరం కానుంది. ఈ విభాగంలో సేవలు అందించే జెప్టో తాజాగా 665 మిలియన్ డాలర్ల (రూ.5,520 కోట్లు) నిధులు సమీకరించి, కార్యకలాపాల విస్తరణపై దృష్టి సారిస్తుండడంతో క్విక్ కామర్స్ మార్కెట్ మరోసారి వేడెక్కనున్నట్టు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ పోటీ వినియోగదారులకు కలసి రానుంది. ఈ విభాగంలో బ్లింకిట్ 40% వాటాతో మార్కెట్ లీడర్‌గా ఉంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ కూడా సేవలు అందిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ సైతం క్విక్ డెలివరీ సేవల్లోకి వచ్చే నెలలో ఎంట్రీ ఇవ్వనుంది. దీంతో బ్లింకిట్ మార్కెట్ వాటాను కొల్లగొట్టేందుకు జెప్టో, ఫ్లిప్‌కార్ట్ ధరల పోటీని (తగ్గింపులు) షురూ చేయవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మార్కెట్ లీడర్‌గా ఉన్న బ్లింకిట్‌కు తీవ్ర పోటీ ఎదురుకానుంది.

ఉత్తరాదిపై జెప్టో దృష్టి


బ్లింకిట్‌కు కీలకంగా ఉన్న ఉత్తరాది మార్కెట్లో జెప్టో మరింత దూకుడుగా వ్యవహరించనున్నట్టు ఈ వ్యవహారం తెలిసిన వర్గాలు తెలిపాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో కార్యకలాపాల విస్తరణకు జెప్టో ప్రాధాన్యం ఇవ్వొచ్చని, తాజాగా సమీకరించిన నిధులను ఇందుకు వినియోగించొచ్చని ఆ వర్గాలు వెల్లడించాయి. తాజా నిధుల సమీకరణ ప్రణాళికల్లో ఇది భాగంగా ఉన్నట్టు చెప్పాయి. ఫ్లిప్‌కార్ట్ బెంగళూరు నుంచి తన క్విక్ కామర్స్ సేవలను వచ్చే నెలలో ఆరంభించనుంది. ఇప్పటికే బెంగళూరులో ఎంపిక చేసిన ప్రాంతాల్లో డార్క్ స్టోర్లను ఏర్పాటు చేసిన ఈ వాల్‌మార్ట్ కంపెనీ, తన సేవలను పరీక్షిస్తోంది. ఫ్లిప్‌కార్ట్‌కు ఇటీవలే గూగుల్ నుంచి 950 మిలియన్ డాలర్ల (రూ.7,885 కోట్లు) పెట్టుబడులు రావడం తెలిసిందే. ఈ నిధులను క్విక్ కామర్స్‌పై వెచ్చించే వెసులుబాటు లభించింది. "కస్టమర్లు 10 నిమిషాలా లేదా 20 నిమిషాలా అన్న దానికి ప్రాధాన్యం ఇవ్వరు. సమీప కాలంలో పోటీ సంస్థలు తమ నిధుల అండతో బ్లింకిట్‌కు సవాల్ విసరొచ్చు. మార్కెట్‌ను షేక్ చేసే అవకాశం అయితే ఉంది" అని ఈ మార్కెట్‌ను పరిశీలించే ఓ అనలిస్ట్ తెలిపారు. వేగవంతమైన డెలివరీ కాకుండా ధరల ద్వారానే ఈ ప్లాట్‌ఫామ్‌లు కస్టమర్లను ఆకర్షించగలవని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. బ్లింకిట్ మాతృసంస్థ జొమాటో వద్ద రూ.12వేల కోట్లకు పైనే నగదు ఉండగా.. స్విగ్గీ ఐపీవో ద్వారా 450 మిలియన్ డాలర్లు సమీకరించే ప్రణాళికలతో ఉంది.

రెట్టింపు మార్కెట్

"ఏదో ఒక ప్రాంతంలో కాకుండా దేశవ్యాప్తంగా మా కార్యకలాపాలను రెట్టింపు చేయనున్నాం. భారీ తగ్గింపులతో పోటీపడాలని అనుకోవడం లేదు. స్థిరమైన వృద్ధి అన్నది డిస్కౌంట్లతో రాదు. కస్టమర్లకు తగినంత విలువను అందించడం ద్వారానే సాధ్యపడుతుంది" అని జెప్టో అధికార ప్రతినిధి తెలిపారు. ఈ విభాగంలో వృద్ధి అవకాశాలు గణనీయంగా ఉన్నందున కొత్తగా సమీకరించే నిధులను ఈ విభాగంలోని కంపెనీలు కార్యకలాపాల విస్తరణపై వెచ్చించొచ్చని ఎలారా క్యాపిటల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కరణ్ తురాణి పేర్కొన్నారు.

నష్టాల్లోంచి లాభాల్లోకి..

ఆటో, విద్యుత్ షేర్లకు డిమాండ్ ● 23,500 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్‌లో 464 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 131 పాయింట్ల లాభంతో 77,341 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 151 పాయింట్లు క్షీణించింది. ఆఖరికి 37 పాయింట్లు పెరిగి 23,538 వద్ద నిలిచింది. అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయం నష్టాలతో ప్రారంభమయ్యాయి. విద్యుత్, ఆటో, పారిశ్రామిక, ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మిడ్ సెషన్ కల్లా లాభాల్లోకి మళ్లాయి. తదుపరి పరిమిత శ్రేణిలో ఒడిదుడుకులతో ట్రేడవుతూ చివరికి లాభాలతో గట్టెక్కాయి. వాల్యుయేషన్ల ఆందోళనలు ఉన్నప్పటికీ.., ఆర్థిక వృద్ధిపై ఆశలతో ఇన్వెస్టర్లు చిన్న, మధ్య తరహా షేర్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.37%, 0.27 శాతం పెరిగాయి. మెటల్, కమోడిటీ, ఐటీ, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆసియా మార్కెట్లు బలహీనంగా, యూరప్ సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి.

→ జీఎస్‌టీ మండలి ఎరువులపై జీఎస్‌టీ 18% నుంచి 5%కి తగ్గింపు ప్రతిపాదనను మంత్రుల బృందానికి (జీవోఎం) సిఫార్సు చేయడంతో ఈ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ 10%, నేషనల్ ఫెర్టిలైజర్స్ 7%, రాష్ట్రీయ కెమికల్స్ 6.50%, జీఎస్‌ఎఫ్‌సీ 3.50%, టాటా కెమికల్స్ 2% చొప్పున నష్టపోయాయి.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ-మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడా, వడోదరలో 168 పోస్టులు

వడోదర(గుజరాత్)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన కార్యాలయం.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా బీవోబీ శాఖల్లో కార్పొరేట్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ క్రెడిట్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 168.
» పోస్టుల వివరాలు: ఫారెక్స్ అక్విజిషన్-రిలేషన్‌షిప్ మేనేజర్-11, ఫారెక్స్ అక్విజిషన్-రిలేషన్‌షిప్ మేనేజర్-04, క్రెడిట్ అనలిస్ట్-80, రిలేషన్‌షిప్ మేనేజర్-66, సీనియర్ మేనేజర్ బిజినెస్ ఫైనాన్స్-04, చీఫ్ మేనేజర్ ఇంటర్నల్ కంట్రోల్స్-03.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ/సీఎంఏ/సీఎస్ /సీఎఫ్ఏ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 12.06.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.07.2024.
» వెబ్‌సైట్: https://www.bankofbaroda.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, వడోదరలో 459 పోస్టులు

వడోదర(గుజరాత్)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన కార్యాలయం.. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన దేశవ్యాప్తంగా బీవోబీ శాఖల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 459.
» పోస్టుల వివరాలు: సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఈ-వెల్త్ రిలేషన్‌షిప్ మేనేజర్, సీనియర్ మేనేజర్ ఎంఎస్ఎంఈ, మేనేజర్ ఎంఎస్ఎంఈ, గ్రూప్ హెడ్, టెరిటరీ హెడ్, ప్రైవేట్ బ్యాంకర్ రేడియన్స్ ప్రైవేట్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్.ఎంఎస్ఎంఈ, జోనల్ సేల్స్ మేనేజర్ ఎంఎస్ఎంఈ, సీనియర్ డెవలపర్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ, బీసీఏ, బీఈ/ బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిప్లొమా, సీఏ/సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, ఇతర పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 12.06.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.07.2024.
» వెబ్‌సైట్: https://www.bankofbaroda.in

బెల్, హైదరాబాద్‌లో 32 పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఎలక్ట్రానిక్.. వార్‌ఫేర్ నావల్ సిస్టమ్స్ ఎస్‌బీయూలో శాశ్వత ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 32
» పోస్టుల వివరాలు: ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ-12, టెక్నీషియన్ సి-17, జూనియర్ అసిస్టెంట్-03.
» అర్హత: ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, బీకాం, బీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.
» వేతనం: ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ పోస్టుకు రూ.24,500 నుంచి రూ.90,000. టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు రూ.21,500 నుంచి రూ.82,000.
» వయసు:28 ఏళ్లు మించకూడదు
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.07.2024.
» వెబ్‌సైట్:https://bel-india.in

ఫైన్ ఆర్ట్స్.. కెరీర్ షైనింగ్!

» ఎఫ్ఏడీఈఈ-2024 నోటిఫికేషన్ విడుదల
» జేఎన్ఏఎఫ్ఏయూలో ఫైన్ ఆర్ట్స్ కోర్సులు
» ఎఫ్ఏడీఈఈలో స్కోర్ ఆధారంగా ఎంపిక
» కోర్సులు పూర్తి చేసుకుంటే వినూత్న కెరీర్స్

చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, శిల్పకళ.. వంటి ఫైన్ ఆర్ట్స్ కోర్సులకు వేదికగా నిలుస్తోంది.. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ! ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఏడీఈఈ) నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా జేఎన్ఏఎఫ్ఏయూ పరిధిలోని ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో చేరొచ్చు!! తాజాగా 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎఫ్ఏడీఈఈ-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో... ఎఫ్ఏడీఈఈ వివరాలు, ఎంపిక విధానం, అందుబాటులో ఉన్న కోర్సులు, సీట్లు, రాత పరీక్షకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

కొంత మంది విద్యార్థులకు చిన్నప్పటి నుంచి కళలు అంటే ఆసక్తి ఉంటుంది. వారు ఎప్పుడూ పెయింటింగ్, ఫొటోగ్రఫీ వంటి వాటిపై మక్కువ చూపుతారు. అలాంటి విద్యార్థులు తమకు ఇష్టమైన విభాగాల్లో కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవడానికి మార్గంగా నిలుస్తున్నాయి ఫైన్ ఆర్ట్స్ కోర్సులు.

ఫైన్ ఆర్ట్స్‌కు ప్రత్యేకం.. జేఎన్ఏఎఫ్ఏయూ

ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించి పలు విభాగాల్లో బ్యాచిలర్, పీజీ స్థాయి కోర్సులను అందించడంలో హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో ప్రత్యేకత గుర్తింపు ఉంది. ఈ వర్సిటీలోని ఫైన్ ఆర్ట్స్ విభాగం పరిధిలో ప్రతి ఏటా పలు బ్యాచిలర్ కోర్సులకు ప్రవేశాలు చేపడతారు. ఇందుకోసం ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఏడీఈఈ)ను నిర్వహిస్తారు. ఇందులో స్కోర్ ఆధారంగా ఆయా విభాగాల్లో సీట్లు భర్తీ చేస్తారు. ప్రస్తుతం 2024-25 ప్రవేశాలకు ఎఫ్ఏడీఈఈ నోటిఫికేషన్ విడుదలైంది.

అర్హతలు

- ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.

ఆరు కోర్సులు.. 275 సీట్లు

- ప్రస్తుతం ఎఫ్ఏడీఈఈ ద్వారా 6 కోర్సుల్లో 275 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎఫ్ఏ అప్లయిడ్ ఆర్ట్స్ అండ్ విజువల్ కమ్యూనికేషన్-రెగ్యులర్ సీట్లు -35; సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు-15.
- బీఎఫ్ఏ పెయింటింగ్-రెగ్యులర్ సీట్లు-20; సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు-15.
- బీఎఫ్ఏ స్కల్ప్చర్-రెగ్యులర్ సీట్లు-10, సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు-10.
- బీఎఫ్ఏ(యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్) -సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు -60.
- బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ అండ్ విజువల్ కమ్యూనికేషన్-రెగ్యులర్ సీట్లు-30,సెల్ఫ్ సపోర్టింగ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు-20.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(ఇంటీరియర్ డిజైన్)-సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు-60.

ఎఫ్ఏడీఈఈ ఇలా

- ఫైన్ ఆర్ట్స్ విభాగంలో పలు కోర్సులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో.. ఎఫ్ఏడీఈఈని కూడా ఆయా కోర్సులకు అనుగుణంగా వేర్వేరు విధానాల్లో నిర్వహిస్తారు.
- బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్-(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్ అండ్ యానిమేషన్) పరీక్షల్లో.. పేపర్ ఏ మెమొరీ డ్రాయింగ్ అండ్ కలరింగ్ వంద మార్కులు-90 నిమిషాలు, పేపర్ బి ఆబ్జెక్టివ్ టైప్ 50 మార్కులు-50 నిమిషాలు, పేపర్ సి ఆబ్జెక్ట్ డ్రాయింగ్ వంద మార్కులు-90 నిమిషాల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది.
- బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ పరీక్షలో.. పేపర్ డి కంపోజిషన్ అండ్ విజువల్ కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్ 100 మార్కులు-90 నిమిషాలు, పేపర్ ఇ ఆబ్జెక్టివ్ టైప్ 50 మార్కులు-50 నిమిషాల వ్యవధిలో పరీక్ష ఉంటుంది.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (ఇంటీరియర్ డిజైన్)లో.. పేపర్ ఎఫ్ 200 మార్కులకు 3 గంటల వ్యవధిలో నిర్వహిస్తారు.

ఈ అంశాలపై దృష్టి

ఎఫ్ఏడీఈఈలో మంచి స్కోర్ కోసం అభ్యర్థులు పేపర్ల వారీగా నిర్దేశిత అంశాలపై దృష్టి పెట్టాలి. డ్రాయింగ్ అండ్ కలరింగ్ స్కిల్స్, ఆబ్జెక్ట్ డ్రాయింగ్ స్కిల్స్, విజువల్ కమ్యూనికేషన్ స్కిల్స్, బేసిక్ ఫొటోగ్రఫీ టెక్నిక్స్, ప్రిన్సిపుల్స్; ఆర్ట్స్ అండ్ డిజైన్‌లో బేసిక్ కాన్సెప్ట్స్, ప్రిన్సిపుల్స్; వెర్బల్, నాన్-వెర్బల్ కమ్యూనికేషన్ స్కిల్స్, కలర్స్ యూసేజ్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.



ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యమివ్వాలి. ఎందుకంటే.. పరీక్షలో అడిగే ప్రశ్నలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను, విజువల్ థింకింగ్ నైపుణ్యాలను పరిశీలించేలా ఉంటాయి. దీంతో.. ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు దానిని నిజ జీవిత సంఘటనలతో పోల్చి.. విజువలైజేషన్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా..ఆయా విభాగాల్లో తాజా సాంకేతికత గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూలై 4
- ఎఫ్ఏడీఈఈ పరీక్ష తేదీలు: 2024, జూలై 20, 21
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://jnafauadmissions.com

కెరీర్ అవకాశాలు

స్కల్ప్చర్ (శిల్ప కళ)

ప్రాచీన కాలం నుంచే వెల్లివిరుస్తున్న ఫైన్ ఆర్ట్స్ విభాగం.. శిల్పకళ. ప్రస్తుతం బీఎఫ్ఏ స్కల్ప్చర్ కోర్సు పూర్తిచేసిన యువతకు ఉపాధి అవకాశాలకు అనుకూలమైన పరిస్థితి నెలకొంది. కోర్సుల అనంతరం కొంతమంది ఇంటి వద్దే శిల్పాలు రూపొందిస్తుంటే.. మరికొందరు ప్రత్యేకంగా హోం స్టూడియోలు నిర్వహిస్తున్నారు. వీరంతా వ్యాపార సంస్థలు,ప్రభుత్వ ఏజెన్సీలు, వ్యక్తులకు శిల్పాలను సరఫరా చేస్తున్నారు. చక్కటి పరిశీలనా నైపుణ్యం, భావోద్వేగాలు, ఆలోచనలకు రూపం ఇవ్వగలిగే నేర్పు ఉన్నవారికి ఈ కోర్సు చక్కగా సరిపోతుంది.

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (ఇంటీరియర్ డిజైన్)

ఒక ఇంటిని లేదా ఆఫీస్ సముదాయాన్ని లేదా ఒక కట్టడాన్ని అంతర్గతంగా చూడముచ్చటగా, అందంగా తీర్చిదిద్దే నైపుణ్యమే.. ఇంటీరియర్ డిజైన్. ప్రస్తుతం నగరాల్లోని ప్రజలు ఇంటీరియర్ డిజైనింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీంతో వీరికి డిమాండ్ పెరుగుతోంది. పలు అంచనాల ప్రకారం-దేశంలో లక్ష మందికిపైగా ఇంటీరియర్ డిజైనింగ్ నిపుణుల కొరత ఉన్నట్లు అంచనా. ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సును పూర్తి చేసుకుంటే.. ఉజ్వల కెరీర్ ఖాయం అని చెప్పొచ్చు. ఫర్నిచర్ డిజైనింగ్, ఎగ్జిబిషన్ డిజైనర్, లైటింగ్ డిజైనర్, కిచెన్ డిజైనర్, ఆర్కిటెక్ట్, ఆర్కిటెక్చురల్ టెక్నాలజిస్టు, ప్రొడక్ట్ డిజైనర్, టెక్స్‌టైల్ డిజైనర్ కొలువుల్లో స్థిరపడవచ్చు.

అప్లయిడ్ ఆర్ట్

ఆర్ట్ డైరెక్టర్ కావాలనుకునేవారికి చక్కటి కోర్సు.. అప్లయిడ్ ఆర్ట్! డ్రాయింగ్, పెయింటింగ్, క్లే మోడలింగ్‌లో బేసిక్స్‌తోపాటు విజువల్ కమ్యూనికేషన్ అండ్ గ్రాఫిక్స్ అంశాలపై మెలకువలు నేర్పుతారు. గ్రాఫిక్ డిజైన్, అడ్వర్టైజింగ్, లోగో డిజైనింగ్ అంశాల్లో ప్రావీణ్యత సంపాదించడం ద్వారా.. సినిమా రంగంలో ఆర్ట్ డైరెక్టర్‌గా, సెట్ డిజైనర్‌గా, విజువలైజర్‌గా అవకాశాలు అందుకోవచ్చు. వస్త్ర పరిశ్రమ, ఆభరణాల డిజైనింగ్, కలినరీ ఆర్ట్, గేమ్ డిజైనర్, యాడ్ ఫిలిం ఏజెన్సీలలో స్టోరీ బోర్డ్ ఆర్టిస్ట్‌గా, క్రియేటివ్ ఆర్ట్ డైరెక్టర్‌గా అవకాశాలు లభిస్తాయి.

పెయింటింగ్ (చిత్రకళ)

ప్రకృతి అందాలకు చూడచక్కని రూపం ఇచ్చే కళ.. పెయింటింగ్. పెయింటింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేసిన వారు తమ సృజనాత్మకతను జోడించి అద్భుతమైన పెయింటింగ్స్ రూపొందించే నైపుణ్యం పొందుతారు. పెయింటింగ్‌కు ప్రస్తుతమున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఇది యువతకు మంచి కెరీర్ మార్గంగా నిలుస్తోంది. పెయింటింగ్‌లో ఆయిల్ పెయింట్, వాటర్ కలర్ పెయింట్, అక్రిలిక్ పెయింట్, టెంపెరా పెయింట్ వంటి రకాలు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్, సెట్ డిజైనర్, కేంద్రీయ విద్యాలయం, నవోదయ, సైనిక్ స్కూల్ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో చక్కటి అవకాశాలు లభిస్తాయి.

యానిమేషన్

ప్రస్తుతం యానిమేషన్ రంగం వేగంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రజలు వినోదం కోసం తమకు అందుబాటులోనే ఉండే స్మార్ట్ ఫోన్, కంప్యూటర్ తదితర సాధనాలతోనే యానిమేషన్, గేమింగ్ వంటి వాటిపై ఆసక్తి పెంచుకుంటున్నారు. కాబట్టి యానిమేషన్ కోర్సులు పూర్తిచేసిన వారికి కెరీర్ అవకాశాలకు కొదవుండదని చెప్పొచ్చు. యానిమేషన్‌కు సంబంధించి సినిమాలు, టెలివిజన్, అడ్వర్టైజింగ్ విభాగాలు ప్రధాన ఉపాధి వేదికలు.

ఫొటోగ్రఫీ

ఫొటోగ్రఫీ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉజ్వల అవకాశాలు అందుకునే వీలుంది. కోర్సు అభ్యసించే సమయంలో ఫొటోగ్రఫీలో మెళకువలతో పాటు డిజిటల్ ల్యాబ్‌లు, గ్రీన్ మ్యాట్ స్టూడియోలను ఏర్పాటు చేస్తారు. ఫ్యాషన్ ఫొటోగ్రఫీ, ఆటోమొబైల్ ఫొటోగ్రఫీ, కార్పొరేట్ ఫొటోగ్రఫీ, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ విభాగాల్లో చక్కటి అవకాశాలు లభిస్తాయి.

ఉన్నత విద్య

బ్యాచిలర్ స్థాయి ఫైన్ ఆర్ట్స్ కోర్సులతోనే ఉజ్వలమైన ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. అలాగే ఉన్నత విద్యపై ఆసక్తి ఉంటే పీజీలోనూ చేరవచ్చు. ఉన్నత విద్య ద్వారా సంబంధిత విభాగాల్లో స్పెషలైజేషన్ కోర్సుల్లో చేరేందుకు వీలవుతుంది. ఉద్యోగంతోపాటు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవచ్చు. సాఫ్ట్‌వేర్,మల్టీనేషనల్ కంపెనీల్లో సైతం అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్ట్ స్టూడియోలు, అడ్వర్టైజింగ్ కంపెనీలు, గ్రాఫిక్, ప్రింటింగ్, పబ్లిషింగ్, ఫ్యాషన్ సంస్థలు, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్ పరిశ్రమలు, ఫిల్మ్ అండ్ థియేటర్, మల్టీమీడియా, యానిమేషన్ తదితర సంస్థల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలకు భారీ వర్ష సూచన

సాక్షి, విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్, యానాంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. ఈ క్రమంలోనే బంగాళాఖాతంలో ఈ నెల 26న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ అల్పపీడనం నెమ్మదిగా బలపడుతూ ఉత్తర దిశగా ప్రయాణించే అవకాశం ఉంది. అదే రోజున అల్పపీడనం ఏపీ తీరాన్ని తాకనుంది. దీని ప్రభావంతో 26వ తేదీ సాయంత్రం నుంచి రాష్ట్రంలో ముఖ్యంగా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో మునురు వాతావరణం ఏర్పడనుంది. బుధవారం ఉత్తరాంధ్ర జిల్లాలోలతో పాటు కోస్తా జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. 27, 28 తేదీల్లో అనేక చోట్ల విస్తారంగా వానలు కురుస్తాయని వెల్లడించారు.

కొత్త వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ తనిఖీలు

- ఈ ఏడాది రాష్ట్రంలో ప్రారంభం కానున్న 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం (2024–25)లో ప్రారంభించనున్న ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నియమించిన ప్రత్యేక బృందాలు సోమవారం తనిఖీలు చేశాయి. పాడేరు, మార్కాపురం, మదనపల్లె, ఆదోని, పులివెందుల వైద్య కళాశాలల్లో తనిఖీలు చేపట్టాయి. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టింది. గత ఏడాది విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల్లో ఒక్కో చోట 150 ఎంబీబీఎస్ సీట్లతో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ విద్యా సంవత్సరం పాడేరు, మార్కాపురం, మదనపల్లె, ఆదోని, పులివెందుల వైద్య కళాశాలల ప్రారంభానికి వీలుగా సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ప్రభుత్వాస్పత్రులను బోధనాస్పత్రులుగా బలోపేతం చేసింది. బోధన, బోధనేతర విభాగాలన్నింటిలో 3,500కు పైగా పోస్టులు కొత్తగా సృష్టించి భర్తీ చేసింది. మొదటి సంవత్సరం విద్యార్థులకు హాస్టల్స్, ల్యాబ్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించింది. ఈ సౌకర్యాలన్నింటినీ ఎన్ఎంసీ బృందాలు పరిశీలించాయి. ఈ బృందాల నివేదికలను పరిశీలించిన అనంతరం ఎన్ఎంసీ అనుమతులు ఇస్తుంది. ఎన్ఎంసీ అనుమతులు లభిస్తే ఈ విద్యా సంవత్సరంలోనే మరికొన్ని ఎంబీబీఎస్ సీట్లు సమకూరి, మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు పెరుగుతాయి.

గత ఐదేళ్లలో 23,699 టీచర్ పోస్టులు భర్తీ

- ప్రతి స్కూల్‌లో వంద శాతం టీచర్లు ఉండేలా వైఎస్సార్ సీపీ హయాంలో అడుగులు
- 2014, 2018 డీఎస్సీల్లో 16 వేలకు పైగా పోస్టులు భర్తీ చేసింది గత సర్కారే
- 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేసిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: మెగా డీఎస్సీ అంటూ దాటింపు వేస్తున్న టీడీపీ పెద్దలు గత ప్రభుత్వం ఏకంగా 23,699 టీచర్ పోస్టులు భర్తీ చేసిన విషయాన్ని కప్పిపుచ్చుతున్నారు. ఎన్నికల ముందు డీఎస్సీ ప్రకటించడం, ఆ తరువాత పరీక్షలు నిర్వహించకుండా తాత్సారం చేయడం టీడీపీ హయాంలో రివాజు. 2014, 2018లోనూ ఆర్భాటంగా డీఎస్సీలు ప్రకటించి పోస్టులు భర్తీ చేయకుండా వదిలేసింది. అనంతరం డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలన్న తలంపుతో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రతి పాఠశాలలో నూరు శాతం ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకుంది. అందుకు అనుగుణంగా టీచర్ ఖాళీలను భర్తీ చేసింది. కేజీబీవీల్లో సైతం 1,200 రెగ్యులర్ టీచర్లను నియమించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 6,100 ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి షెడ్యూల్ ప్రకటించింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కూడా నిర్వహించింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఫలితాలు ప్రకటించలేదు.

అన్యాయాలను సరిదిద్ది..

చంద్రబాబు హయాంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీని ఓ ప్రహసనంగా మార్చేశారు. గతంలో నాలుగేళ్ల అధికారాన్ని అనుభవించి ఎన్నికలకు ముందు ఏడాది 2018లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. అది సక్రమంగా నిర్వహించలేక చేతులెత్తేశారు. ఫలితంగా అభ్యర్థులకు అన్యాయం జరగడంతో కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. ఇందులో 7,902 ఉపాధ్యాయ పోస్టులకుగాను 300 పోస్టులను భర్తీ చేసి చేతులెత్తేశారు. అంతకు ముందు 2014లోనూ 10,313 పోస్టులతో డీఎస్సీ ప్రకటించి పరీక్షలు నిర్వహించి పోస్టుల భర్తీని గాలికి వదిలేశారు. 1998లో ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహించి టీచర్ అభ్యర్థులను నిలువుగా మోసం చేశారు.

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా, ఏ ఒక్క టీచర్ అభ్యర్థికీ అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో 2018 డీఎస్సీలో దగావడ్డ అభ్యర్థులకు న్యాయం చేసింది. కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సుమారు 7,254 మంది అభ్యర్థులకు ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చింది. 2018 లిమిటెడ్ డీఎస్సీ అభ్యర్థులు 24 మందికి పోస్టులిచ్చింది. 2019లోనే స్పెషల్ డీఎస్సీ వేసి 521 పోస్టులను భర్తీ చేసింది. ఇక 1998 డీఎస్సీ ద్వారా అన్యాయానికి గురైన 4,059 మంది అభ్యర్థులకు న్యాయం చేసేందుకు మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) కింద 3,864 మందికి పోస్టింగ్ ఇచ్చారు. 2008 డీఎస్సీలో మిగిలిపోయిన 1,910 మందిని ఎంటీఎస్ టీచర్లుగా నియమించారు. తెలంగాణలో 1998, 2018 డీఎస్సీ అభ్యర్థులు పోస్టింగ్స్ కోసం ఇప్పటికీ నిరీక్షిస్తున్నా అక్కడి ప్రభుత్వాలు పట్టించుకున్నది లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో టీచర్ పోస్టుల భర్తీ ఇలా..

1998 డీఎస్సీ	3,864
2008 డీఎస్సీ	1,910
2014 డీఎస్సీ	8,926
2018 డీఎస్సీ	7,254
2018 (లిమిటెడ్)	24
2019 స్పెషల్ డీఎస్సీ	521
కేజీబీవీ రెగ్యులర్ పోస్టులు	1,200
మొత్తం	23,699

వలంటీర్లకు విధులేవి?

- ఆగస్టు 14తో ముగియనున్న గడువు
- పింఛన్ల పంపిణీ ప్రక్రియకు దూరంగా వలంటీర్లు
- వలంటీర్ల వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు బాబు హామీ
- టీడీపీ – జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోనూ వాగ్దానం

సాక్షి, అమరావతి: ఐదేళ్ల క్రితం ఏర్పాటైన విప్లవాత్మక వలంటీర్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం త్రిశంకు స్వర్గంలో పెట్టేసింది. 2019 ఆగస్టులో గత ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టగా వీరు నిర్వహించే విధుల్లో ప్రతి నెలా టంఛన్‌గా పింఛన్ల పంపిణీ అత్యంత కీలకం. అయితే జూలైలో పింఛన్ల పంపిణీని వలంటీర్ల ద్వారా కాకుండా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా నిర్వహించాలని సోమవారం మంత్రివర్గ తొలి సమావేశంలో నిర్ణయించిన నేపథ్యంలో వలంటీర్ల వ్యవస్థపై అటు అధికార వర్గాలు ఇటు రాజకీయ వర్గాల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగించడంతో పాటు వారి గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. టీడీపీ–జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోనూ దీన్ని పొందుపరిచారు. అయితే ఇప్పుడు వలంటీర్లు ప్రధానంగా నిర్వహించే విధుల నుంచి వారిని దూరంగా ఉంచడం, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పింఛన్ల పంపిణీకి సన్నద్ధం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చర్చనీయాంశంగా మారింది.

లక్షన్నర మంది విధుల్లోనే..

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు, పట్టణ ప్రాంతాల్లో 75–100 ఇళ్లకు ఒకరు చొప్పున గతంలో 2.65 లక్షల మంది వలంటీర్లు విధులు నిర్వర్తించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత మినహా ఐదేళ్ల పాటు వలంటీర్ల సేవలు కొనసాగాయి. అనంతర పరిణామాల నేపథ్యంలో పలువురు రాజీనామాలు చేయగా ప్రస్తుతం లక్షన్నర మందికి పైగా విధుల్లో కొనసాగుతున్నారు. అయితే పింఛన్ల పంపిణీతో పాటు ఇతర సాధారణ విధులు కూడా అప్పగించకుండా వారిని దూరంగా ఉంచడం ప్రశ్నార్థకంగా మారింది.

వలంటీర్లకు బాబు వెన్నుపోటు!

వలంటీర్లకు చంద్రబాబు తనదైన శైలిలో వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. 'వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ.. వారికి నెలకు రూ.10 వేలు జీతం ఇస్తానని ఎన్నికల సమయంలో బాబు హామీ ఇచ్చారు. అయితే జూలై 1న వలంటీర్లతో కాకుండా, సచివాలయ ఉద్యోగులతో పెన్షన్ పంపిణీ చేయాలని తాజాగా కేబినెట్లో నిర్ణయించారు. అంటే వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడే దిశగా నిర్ణయం తీసుకున్నారు' అని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విటర్)లో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోస్ట్ చేసింది.

ఆగస్టు 14 ఆఖరి గడువు..

సాధారణంగా ప్రభుత్వ విభాగాల్లో నెలవారీ గౌరవ వేతనంతో పనిచేసే వారిని కొనసాగించేందుకు నిర్దిష్ట సమయంలోగా ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేస్తారు. 2019 ఆగస్టులో ఏర్పాటైన వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపు గడువు ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీతో ముగియనుంది. అనంతరం ఈ వ్యవస్థను కొనసాగించాలంటే ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుంది.

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం

- బీజేపీలో చేరాల్సిన ఖర్మ నాకేంటి
- వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ ఎంపీలు గురుమూర్తి, మిథున్‌రెడ్డి, తనూజరాణి

సాక్షి, న్యూఢిల్లీ : రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో వైఎస్సార్‌సీపీ ఎంపీలు వ్యవహరిస్తారని పార్టీ లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి తెలిపారు. సోమవారం లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేసిన అనంతరం మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకంతో మూడోసారి అవకాశం ఇచ్చారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. రాష్ట్ర ప్రజలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యుల ఆశీస్సులతో వరసగా మూడోసారి లోక్‌సభకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. తాను బీజేపీలో చేరతానంటూ కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. ఇదంతా కూటమి నేతల మైండ్ గేమ్ అన్న మిథున్‌రెడ్డి.. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ ఇలాగే అన్నారని గుర్తుచేశారు. బీజేపీలో చేరాల్సిన ఖర్మ తనకు లేదన్నారు. వైఎస్ జగన్ తనను సొంత తమ్ముడిలా చూసుకుంటున్నారని తెలిపారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో పార్టీ పుంజుకొని మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. క్యాడర్‌కు అండగా ఉంటామన్నారు. ఎన్డీఏ, 'ఇండియా' కూటముల్లో వైఎస్సార్‌సీపీ భాగస్వామ్యం కాదని తెలిపారు. అంశాల వారీ మద్దతు కేంద్రానికి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఏ బిల్లుకైనా నా మద్దతు ఇవ్వబోమన్నారు. రాజంపేట నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తానని ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు.

గిరిజన హక్కులపై పోరాడతా: ఎంపీ తనూజరాణి

గిరిజన హక్కులు కాపాడడానికి పార్లమెంటు వేదికగా పోరాటం చేస్తానని వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజరాణి తెలిపారు. గిరిజన చట్టాలు, జీవోలు మరింత పటిష్టంగా అమలు కావడానికి పోరాడతానని చెప్పారు. లోక్‌సభ సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. "నాకు అవకాశం ఇచ్చిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నా భవిష్యత్తుకు బాటలు వేసిన మావయ్య చెట్టి ఫల్గుణ, భర్త వినయ్‌లకి రుణపడి ఉంటా. అరకు నియోజకవర్గంలో విజయానికి కృషి చేసిన కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు. నా గెలుపునకు కారణమైన ప్రజల ఆకాంక్షలకు నెరవేర్చడానికి అహర్నిశలు ప్రయత్నిస్తా" అని ఎంపీ తనూజరాణి తెలిపారు.

లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేసిన ఏపీ ఎంపీలు

- తెలుగులో ప్రమాణం చేసిన మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని, భూపతిరాజు
- హిందీలో ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజరాణి
- సంస్కృతంలో ప్రమాణం చేసిన బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ సోమవారం కొలువుతీరింది. తొలిరోజు ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం 24 మంది ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలుగులో ప్రమాణం చేశారు. మంత్రుల ప్రమాణం పూర్తయిన తర్వాత ఎంపీల ప్రమాణం రాష్ట్రాల వారీ అక్షర క్రమంలో జరిగింది. ఏపీ ఎంపీలు తెలుగు, హిందీ, సంస్కృతం, ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. పంచెకట్టులో సభకు హాజరైన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలుగులో ప్రమాణం చేశారు. ఆయనతో పాటు కూటమి పార్టీల ఎంపీలు భరత్, దగ్గుబాటి పురందేశ్వరి, బాలశౌరి, కేశినేని శివనాథ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, బైరెడ్డి శబరి, నాగరాజు, లక్ష్మీనారాయణ, పార్థసారథి, ప్రసాదరావు కూడా తెలుగులో ప్రమాణం చేశారు. సీఎం రమేశ్, ఉదయ్ శ్రీనివాస్, జీఎం హరీష్, పుట్టా మహేశ్, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంగ్లిష్‌లో లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేశారు. కాగా బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ సంస్కృతంలో ప్రమాణం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురు ఎంపీలు మూడు భాషల్లో ప్రమాణం చేశారు. అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి హిందీలో, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలుగులో, రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి ఇంగ్లిష్‌లో ఎంపీలుగా ప్రమాణం చేశారు. ఇక కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తొలిరోజు సభకు హాజరుకాకపోవడంతో ప్రమాణ స్వీకారం చేయలేదు.

'జీవో 117ను రద్దు చేయాలి'

సాక్షి, అమరావతి: జీవో నం.117ను తక్షణమే రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో కలిపిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (అప్టా) డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్‌ను అప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కాశి ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు ఎం.జి.మెహది సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

అనగనగా అంకాళమ్మ కోట

- నాడు దివిటీ దొంగల స్థావరం
- నేడు గుప్తనిధుల దొంగల అన్వేషణ నిలయం
- పర్యావరణ పర్యాటకానికి అనువైన ప్రాంతం
- కృష్ణాతీరంలో ట్రెక్కింగ్‌కు, రిసార్ట్ ఏర్పాటుకు అవకాశం



కొండపై నుంచి కనిపించే చీమలతిప్ప సుందర దృశ్యం

ఆత్మకూరురూరల్: నల్లమల పర్వత సానువుల్ని చీల్చుకుంటూ కృష్ణా నదీ ప్రవాహం శ్రీశైలం వైపు సాగిపోతూ ఒక పెద్ద నదీలోయను అక్కడ సృష్టించింది. అలా సహజసిద్ధంగా ఏర్పడ్డ పర్వతం అంచున నిర్మాణమైనదే ఈ అంకాళమ్మ కోట. నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ఉండే పెద్ద గుమ్మడాపురం గ్రామం వద్ద ప్రారంభమయ్యే నల్లమల అటవీ ప్రాంతంలో ఈ పురాతన కోటకు అరుదైన చరిత్ర ఉంది. చరిత్ర పుటల్లోకి వెళితే భారతదేశంలో థగ్గులు, పిండారీలు వంటి బందిపోటు దొంగల ముఠాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి కోవకు చెందిన వారే దివిటీ దొంగలు. ఎక్కడో అడవుల్లో తమ రహస్య స్థావరాలను ఏర్పాటు చేసుకుని ఎంచుకున్న గ్రామాలపై దాడులు చేయడం దివిటీ దొంగల పని. నాడు దివిటీ దొంగలు ఏర్పాటు చేసుకున్న రహస్య స్థావరమై అంకాళమ్మ కోట అని పెద్దలు చెబుతూ ఉండడంతో అది అనాదిగా ఇప్పటికీ ప్రచారంలో ఉంది. ఎత్తైన నల్లమల కొండలపైన ఒకవైపు లోతైన లోయ, అందులో ప్రవహించే కృష్ణానది. మూడు వైపులా దట్టమైన అడవి ఉండడంతో ఈ కోట నిర్మాణం అత్యంత పటిష్టత, భద్రతకు ఆలవాలమైంది. దివిటీ దొంగలు తాము కొల్లగొట్టిన ధన రాశులను దాచుకునేందుకు ఈ కోట అనువుగా ఉండింది. ఈ కోటలో అంకాళ పరమేశ్వరి ఆలయం ఉండటంతో ఆమె పేరుననే ఈ కోటకు అంకాళమ్మ కోట అని పేరు వచ్చింది.

గుప్తనిధుల వేటగాళ్లతో విధ్వంసం

అంకాళమ్మ కోట దివిటీ దొంగల స్థావరంగా చరిత్ర చెబుతుండడంతో అక్కడ నిధులు పాతి పెట్టబడి ఉంటాయన్న అపోహలతో పలువురు ఈ కోటలో అక్రమంగా తవ్వకాలు జరిపి కోట యావత్తు గుంతల మయం చేశారు. విశాలమైన కోట ప్రకారంతో విశిష్టంగా ఉండే ఈ కోట ఇప్పుడు కేవలం ఆనవాళ్లతో చరిత్రను గుర్తు చేస్తోంది. ఇందులో ఉన్న అంకాళమ్మ అమ్మవారి ఆలయం శిథిలమవడంతో పాటు గుప్తనిధుల వేటగాళ్ల తవ్వకాలకు కూలిపోయింది. అయితే కృష్ణా నదిలో చేపల వేటకు వలస వచ్చిన వైజాగ్ జాలర్లు తమ స్వయం కృషితో ఈ దేవాలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. అటవీ శాఖ పలుమార్లు అంకాళమ్మ కోటలో తవ్వకాలకు వచ్చే వారిని అరెస్టు చేసి కేసులు కూడా పెట్టింది.

అందాల నిలయం చీమల తిప్ప

అంకాళమ్మ కోట నుంచి లోయలో పారే కృష్ణమ్మను దర్శించడం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. విశాలమైన లోయలో ప్రవహించే నదీగర్భంలో సహజంగా వెలసిన ద్వీప శిఖరమే చీమల తిప్ప. ఈ కొండపై విశాఖ జాలర్లు స్థిర నివాసమేర్పరుచుకుని నదిలో వేటకు వెళతుంటారు. కొండపై నుంచి చీమల తిప్ప అత్యంత సుందరంగా కనిపిస్తుంది. సిద్ధేశ్వరం – సోమశిల మధ్యలో కృష్ణమ్మ ప్రవాహం వెంట నదీలోయలో ప్రయాణిస్తే ఎంతో అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు కనువిందు చేస్తాయి. ఈ ప్రయాణం పూర్తిగా భారత దేశంలోనే విస్తీర్ణంలో అతి పెద్దదైన శ్రీశైలం – నాగార్జున సాగర్ పెద్దపులుల అభయారణ్యం గుండా సాగుతుంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం కాకమునుపు ఈ నదీలోయలో సారవంతమైన సాగుభూమి ఎంతో ఉండేది. ఆ భూమిని ఆధారంగా అనేక గ్రామాలు నల్లమల అటవీ ప్రాంతం అంచులో కృష్ణా నది ఒడ్డున ఉండేవి. బలపాల తిప్ప, మారుగుత్తి, జానాల, సిద్ధేశ్వరం గ్రామాలు శ్రీశైలం వెనుకతట్టు జలాల్లో మునకకు గురయ్యాయి. బలపాలతిప్ప, మారుగుత్తి గ్రామాలు పూర్తిగా అదృశ్యం కాగా, సిద్ధేశ్వరం, జానాలు గ్రామాల్లో స్వల్ప సంఖ్యలో ప్రజలు ఉన్నారు.



అంకాళమ్మ కోటలో అంజనేయస్వామి గుడి

అవశేషంగా మిగిలిన కోట ప్రాకారం

రేగడగూడూరులోని పురాతన బురుజు

దుర్గమారణ్యాలైన నల్లమల నుంచి రాత్రి వేళ దివిటీ ధరించి గుర్రాలపై వేగంగా వస్తూ గ్రామాలపై పడే దివిటీ దొంగలంటే ప్రజలు వణికిపోయేవారు. వారి వల్ల ఎంతో ధన, ప్రాణ నష్టం కూడా కలిగేది. కాలక్రమేణ దివిటీ దొంగల రాకను తెలుసుకునేందుకు స్వీయ రక్షణకు, నల్లమల అడవుల అంచుల్లో ఉన్న పలు గ్రామాల ప్రజలు తమ ఏర్పాట్లు వారు చేసుకున్నారు. ప్రతి గ్రామంలో ఎత్తైన రక్షణ బురుజులను కట్టించుకున్నారు. వాటిపై వంతుల వారీగా నిత్య పహారా కాస్తు దూరం నుంచే దివిటీ దొంగల రాకను పసి గట్టి గ్రామస్తులను హెచ్చరించేవారు. జిల్లాలోని కొత్తపల్లె మండలంలోని శివపురం, దుద్యాల, ముసలిమడుగు, వెలుగోడు మండలంలోని వేల్పనూరు, రేగడగూడూరులలో ఇప్పటికీ అలాంటి బురుజు నిర్మాణాలు కనిపిస్తాయి.

పర్యాటకానికి అనువైన ప్రాంతం


అంకాలమ్మ కోటను ఒక పర్యాటక కేంద్రంగా వినియోగించుకునేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. పురాతనమైన కోట సందర్శనకు పలువురు ఉత్సాహం చూపుతారు. చీమల తిప్పపై ఎకో – టూరిజంలో భాగంగా రిసార్ట్ ఏర్పాటు చేయవచ్చు. అక్కడ నుంచి అంకాళమ్మ కోటకు ట్రెక్కింగ్, నదిలో బోటింగ్‌కు అవకాశాలున్నాయి. అలాగే నది వెంట శ్రీశైలం అభిముఖంగా ప్రయాణిస్తే నదికి ఇరువైపులా నల్లమల అడవి అత్యంత అద్భుతంగా కనువిందు చేస్తుంది.

ఇలా చేరుకోవచ్చు..

సరిగ్గా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉన్న కృష్ణా నదికి కుడిగట్టు అయిన ఆంధ్రప్రదేశ్‌లోని కొత్తపల్లె మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామ సరిహద్దుల్లో అంకాళమ్మ కోట ఉంది.తెలంగాణ వైపునుంచి రావాలంటే సోమశిల నుంచి టూరిజం బోటులో ఆరు కి.మీ. ప్రయాణిస్తే చీమల తిప్ప కనిపిస్తుంది. అక్కడ నుంచి ట్రెక్కింగ్ ద్వారా కొండ ఎక్కి అంకాళమ్మ కోట చేరుకోవచ్చు. అలాగే తెలంగాణ వైపు ఉన్న అమరగిరి నుంచి కూడా 12 కి.మీ. నదిలో ప్రయాణించి చీమల తిప్ప చేరుకోవచ్చు. కర్నూలు వైపు నుంచి వచ్చే వారు. కొత్తపల్లె మండలంలోని పెద్ద గుమ్మడాపురం వరకు రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించవచ్చు. అక్కడ నుంచి అడవిలో ప్రయాణించేందుకు నాగార్జునసాగర్ – శ్రీశైలం పులుల అభయారణ్యం ఆత్మకూరు డిప్యూటి డైరెక్టర్ అనుమతి తీసుకోవాలి.

వనగూరిన ఆహ్లాదం

- నగర వనం.. నయనానందకరం
- పల్నాడు జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఐదు ఎకో పార్కులు అభివృద్ధి
- గతేడాది పనులు మొదలుపెట్టిన కోటప్పకొండ, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల నగరవనాల పనులు దాదాపు పూర్తి
- ఒక్కో నగరవనం అభివృద్ధి రూ.2 కోట్లు వ్యయం
- 50 ఎకరాల విస్తీర్ణంలో పార్కులు, ఓపెన్ జిమ్, యోగా, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు
- దాతల సహాయంతో పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పన



కోటప్పకొండ నగరవనంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎకో పార్క్

సాక్షి, నరసరావుపేట: ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని, వన్యదనాన్ని అందించేందుకు ఏడాది కింద మొదలుపెట్టిన నగర వనాలు ఏర్పాటు దాదాపుగా పూర్తి కావొస్తున్నాయి. దేశంలో నగరాలు, పట్టణాలకు అనుకొని ఉన్న అటవీ భూముల్లో వనాలు పెంపకానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'నగరయోజన పథకం' కింద ఈ నగర వనాల పనులు జరిగాయి. అటవీ భూముల పరిరక్షణ, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నది వనాల అభివృద్ధి ముఖ్య ఉద్దేశం. అలాగే అడవులు, వన్యప్రాణాల సంరక్షణ గురించి ఈ వనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అడవుల ప్రాముఖ్యత తెలిపేలా ఈ వనాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ప్రతి వనంలో వాకింగ్ ట్రాక్, క్యాంటీన్, ట్రెక్కింగ్ సదుపాయం, ఓపెన్ జిమ్‌తోపాటు వారాంతాల్లో కుటుంబాలు, స్నేహితులతో వచ్చిన వారు సేదదీరేందుకు అనువుగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

రూ.2 కోట్లతో నగర వనాలు...

పల్నాడు జిల్లాలో కేంద్రం సహకారంతో అటవీ భూముల్లో నాలుగు నగరవనాలను అభివృద్ధి చేస్తున్నారు. కేంద్రప్రభుత్వ కింద అభివృద్ధి చేస్తున్న నగరవనాలు మున్సిపాలిటీ పరిధికి 10 కిలోమీటర్ల లోపు ఉన్న అటవీ భూములను ఎంచుకుంటారు. మొత్తంగా 50 హెక్టార్ల అటవీ భూమిని ఈ ప్రాజెక్టు కింద తీసుకోగా, అందులో తొలిదశలో 20 హెక్టార్లలో పనులు చేపట్టనున్నారు. దశలవారీగా మిగిలిన 30 హెక్టార్లలో సుందరీకరణ చేపడతారు. ఒక్కో నగరవనానికి హెక్టారుకు రూ.4 లక్షల చొప్పున గరిష్టంగా 50 హెక్టార్లకు రూ.2 కోట్ల దాకా కేంద్ర అటవీశాఖ నిధులు మంజూరు చేయనుంది.

తొలిదశ పనులు పూర్తి..

జిల్లాలో అటవీ భూముల్లో నరసరావుపేట మున్సిపాలిటీ సమీపంలోని కోటప్పకొండ, పిడుగురాళ్ల సమీపంలోని దేవరంపాడు, వినుకొండ సమీపంలోని వెంకుపాలెం, మాచర్ల వద్ద యత్రగొండపాలెం నగరవనాలను ఏర్పాటు చేశారు. వీటిలో తొలి దశ కింద ఇప్పటికే ఒక్కో నగర వనంలో రూ.1.4 కోట్లు ఖర్చు చేశారు. పట్టణ ప్రజలు సేద తీరేందుకు అవసరమైన అన్నివసతులు కల్పించారు. ఇందులో ఓపెన్ జిమ్, యోగాకేంద్రం, సాహసక్రీడలు, క్రీడా ప్రాంగణాలు, సేదదీరడానికి పార్కులు, చెక్కతో చేసిన బల్లలు ఏర్పాటు చేశారు. సందర్శకులు అవసరమైన తాగునీరు, క్యాంటీన్‌లు, వాష్‌రూంలు ఏర్పాటు చేశారు. తొలి దశ పనులు పూర్తికాగానే నెల నుంచి రెండు నెలల్లో ఈ పార్కులు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

రెండో దశలో రూ.60 లక్షలతో...

నగరవనాలలో రూ.1.4 కోట్లతో తొలిదశ పనులు పూర్తికాగానే కేంద్ర ప్రభుత్వం మరో రూ.60 లక్షలను ఒక్కో వనానికి కేటాయించనుంది. వీటితో మొక్కలు నాటడంతోపాటు మరిన్ని వసతులను కల్పించేందుకు ప్రణాళికలను అటవీశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నగరవనాలలో దాతల సహకారంతో సైతం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా అటవీ ప్రాంతానికి అనుకోని ఉన్న ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో ఎకో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాలలో పర్యటించే పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించనున్నారు. పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించనున్నారు. మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారం తీసుకోనున్నారు. వారి భాగస్వామ్యంతో పనులు చేపట్టనున్నారు. దీని ద్వారా పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది. పల్నాడు జిల్లాలో దైదా, గుత్తికొండబిలం, మన్నేపల్లి, సంజీవన కొండ, భట్రుపాలెంలలో ఎకో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొండవీడు కోట సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నగరవనం అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఇది సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

ఆహ్లాదంతో పాటు అటవీప్రాముఖ్యత తెలిపేలా...

జిల్లాలో నాలుగు నగర వనాల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఒక్కో వనంలో రూ.1.4 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం. మరో రూ.60 లక్షలతో రెండో దశ పనులు చేపడతాం. ఇలా ఒక్కో నగర వనం రూ.2 కోట్లతో సుందరకంగా తీర్చిదిద్దనున్నాం. దాతల సహకారంతో వీటిని మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రయత్నిస్తాం. నగరవనాలతో ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించడంతోపాటు అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతను వివరించనున్నాం. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎన్.రామచంద్రరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegala Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangal Media Pvt Ltd.,22,Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ధరల పెంపుపై నిరసన



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, కార్యకర్తలు

సిరుగుప్ప: ఇచ్చిన మాట నిలుపుకోలేక మద్యం, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, రిజిస్ట్రేషన్ ఫీజులను కూడా రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకు పెంచడం, ఎస్టీ కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల నిధులు దుర్వినియోగం, ఇచ్చిన ఐదు గ్యారెంటీల్లో కొన్నింటిని సక్రమంగా అమలు చేయలేక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప ఘాటుగా విమర్శించారు. ఆయన సోమవారం నగరంలో అభయాంజనేయస్వామి ఆలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, ఎస్టీ కార్పొరేషన్‌లో నిధుల దుర్వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన ప్రదర్శనలో పాల్గొని మాట్లాడారు. అనంతరం తాలూకా బీజేపీ అధ్యక్షుడు కుంటనాళ్ మల్లికార్జున, ధరప్పనాయక తదితరులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డారు. పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన ర్యాలీని విజయవంతం చేశారు.

అశ్లీల వీడియోలపై ఫిర్యాదు

హుబ్లీ: ఇన్‌స్టాగాం ఐడీ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు కేశ్వాపుర నివాసి ఓ మహిళకు అశ్లీల వీడియోలను పంపించి తనతో అశ్లీలంగా చాట్ చేసి మానసికంగా హింసించినట్లు బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మేయర్, ఉపమేయర్ బాధ్యతల స్వీకారం




బాధ్యతలు స్వీకరిస్తున్న నందీష్

బళ్లారిఅర్బన్: నగర పాలక సంస్థ కొత్త మేయర్‌గా ఎన్నికైన 18వ వార్డు కార్పొరేటర్ ముల్లంగి నందీష్ 23వ విడత మేయర్‌గా సోమవారం పదవీ బాధ్యతలను చేపట్టారు. అలాగే కౌల్‌బజార్ లోని28వ వార్డు నుంచి గెలిచిన మహిళా కార్పొరేటర్ డీ.సుకుం డిప్యూటీ మేయర్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. అంతకు ముందు వారు తమ కార్యాలయాల్లో ప్రత్యేక పూజలను నెరవేర్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తన హయాంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యతో పాటు నగర రోడ్ల అభివృద్ధి, స్వచ్ఛతను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్‌తో పాటు ఆ పార్టీ ప్రముఖులు, మేయర్ కుటుంబ సభ్యులు, హితులు, సన్నిహితులు, బంధుమిత్రులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నలుగురిపై కేసుల నమోదు

హుబ్లీ: రెండు ప్రత్యేక కేసుల్లో ఇక్కడి కేశ్వాపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లుగా కప్పిపుచ్చడంతో పాటు అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిపై కేసులు నమోదయ్యాయి. గదగ్ రోడ్డు వినోబా నగర రైల్వే క్వార్టర్ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రశాంత్ బప్పురిపై కేశ్వాపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అలాగే కుసుగల్ రోడ్డు ససిసిటీ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రవి ఎలిగార, విజయ్ దార్ల, అబోటి మేరిబాలపై కూడా మరో కేసు దాఖలైంది.


26, 27 తేదీల్లో క్రైస్తవ ఉజ్జీవ కూడికలు



దైవ వర్తమానికులు పాస్టర్ శ్రీని

హొసపేటె: కర్ణాటక కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీల్లో క్రైస్తవ ఉజ్జీవ కూడికలు జరుపనున్నట్లు నిర్వాహకులు పాస్టర్ రెవరెండ్ ఎం.ఐక్కయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా మరియమ్మనహళ్లి కల్వరి చర్చిలో రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ప్రార్థనా కూడికలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక దైవ వర్తమానికులుగా దుబాయ్‌లో దేవుని సేవలందిస్తున్న బళ్లారి ఎల్‌షదాయ్ మినిస్ట్రీస్ నిర్వాహకులు పాస్టర్ శ్రీని పాల్గొంటారు. ఈ ప్రార్థనా కూడికల్లో బెంగళూరుకు చెందిన పాస్టర్ స్టీఫెన్ రతినమ్ ప్రత్యేక ఆరాధన నిర్వహిస్తారు. క్రైస్తవ భక్తి పాటలను ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపి దైవ సందేశాన్ని పాస్టర్ శ్రీని వినిపిస్తారని ఆయన తెలిపారు.

రాహుల్ క్షమాపణ చెప్పాలి



ఆందోళన చేస్తున్న నేతలు

రాయచూరు రూరల్: భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా వ్యాఖ్యానించిన ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షుడు వినాయకరావ్ మాట్లాడారు. రాజ్యాంగంపై హేళనగా మాట్లాడిన రాహుల్‌గాంధీ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు.

మట్టి మిద్దె వాసులకు వర్షగండం



దుస్థితిలో ఉన్న పాత మిద్దె ఇల్లు



భారీ వర్షానికి కూలిన మట్టి ఇల్లు

- గుడిసెలు లేని ఇళ్లకు విముక్తి ఎన్నడో?
- ఏప్రిల్ నుంచి 100 పాత ఇళ్లు నేలమట్టం
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న పేదలు

సాక్షి బళ్లారి: జిల్లాలో అపారమైన ఇనుప ఖనిజ సంపద నిల్వలున్నాయి. దేశంలోనే ఇనుప ఖనిజ నిల్వలున్న ప్రాంతాల్లో బళ్లారి జిల్లా అగ్రస్థానంలో ఉంది. గనుల యజమానులు ఓ వైపు వేల కోట్ల సంపాదన, హెలికాప్టర్లు, విమానాలు కొనుగోలు చేసుకొని రాజ మహారాజుల్లా ఆకాశంలో విహరిస్తూ విలాసవంతమైన భవనాల్లో జీవిస్తున్నారు. మరో వైపు ఇదే జిల్లాలో పేదరికం కూడా రాష్ట్రంలోనే ఇతర జిల్లాలతో పోలిస్తే మొదటి స్థానంలో ఉండటం బాధాకరం. బళ్లారి జిల్లాలో పూరి గుడిసెలు, మట్టి మిద్దెల్లో నివసిస్తున్న పేదలకు వర్షకాలం వచ్చిందంటే ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. 2002 నుంచి ఖనిజ సంపదకు విపరీతమైన డిమాండ్ రావడంతో ఇక్కడ నుంచి వేల కోట్లు ప్రభుత్వానికి కూడా ఆదాయం వచ్చింది.

మూలుగుతున్న కోట్లాది నిధులు

మైనింగ్ నుంచి వచ్చిన నిధులతో బళ్లారి జిల్లాలో మౌలిక సదుపాయాలకు కూడా వెచ్చించాలని కొంత మేరకు నిధులు కేటాయించారు. డీఎంఎఫ్, కేఎంఆర్‌సీ నిధులు వేలాది కోట్ల రూపాయలు మూలుగుతూనే ఉన్నాయి. గుడిసెలు లేని, మట్టి మిద్దెలు లేని ఇళ్లను నిర్మిస్తామని పాలకులు, అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూనే ఉంటారు. ఇందులో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పాలకులు దొందూ దొందుగానే వ్యవహరించడంతో జిల్లాలో పేదలకు కనీస వసతులు లేక మట్టి మిద్దెల్లో నివసిస్తున్నారు. ఈఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వర్షాల కారణంగా మట్టి మిద్దెలు సుమారు 100 వరకు కూలిపోయినట్లు అధికార గణాంకాలు తెలియజేస్తున్నాయి. జూన్ 12 నుంచి మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో మరో 69 ఇళ్లు దెబ్బతిన్నాయి. బళ్లారిలో–10, సిరుగుప్ప–5, సండూరు–5, కంప్లి–4 మట్టి మిద్దెలు నేలకూలాయి.

పరిపాటిగా మట్టి మిద్దెల పతనం

ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే మట్టి మిద్దెలు నేలకూలిపోవడం పరిపాటిగా మారింది. జిల్లా యంత్రాంగం తూతూమంత్రంగా పరిహారం అందిస్తూ చేతులు దులుపుకుంటున్నారే కానీ శాశ్వతంగా ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పేదలకు సొంత ఇంటి కల కలగానే మిగిలింది. జిల్లాలో ఐదు తాలూకాల్లో వేలాది కుటుంబాలు ఇళ్లు లేక కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. ప్రతి ఏటా జిల్లా పంచాయతీ, నగర పంచాయతీ, పట్టణ పంచాయతీ సమావేశాల్లో ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఇళ్లు లేని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయడం, అధికారులు, మంత్రులు చర్చించడం, నిధులు మంజూరు చేస్తామనడం పరిపాటిగా మారింది. అయితే జిల్లాలో ఇలాంటి చర్చలు జరుగుతున్నాయే కానీ గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో మట్టి మిద్దెలు, గుడిసెలు లేని గ్రామాలు కనిపించడం లేదు. ఈనేపథ్యంలో ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే మట్టి మిద్దెలు నేలకూలడంతో ఆయా గృహ యజమానులు రాత్రిళ్లు, పొరుగిళ్లలో తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది.

నెరవేరని నేతల హామీలు

2018 నుంచి ఇప్పటి వరకు భారీ వర్షాల వల్ల పాత మిద్దెలు కూలి జిల్లాలో పలువురు మృతి చెందిన సంగతి తెలిసిందే. సిరుగుప్ప, బళ్లారి నగరంతో పాటు జిల్లాలో అక్కడక్కడ పాత మిద్దెలు కూలి అందులో నివసిస్తున్నవారు మృతి చెందినప్పుడు అధికార, ప్రతిపక్ష నాయకులు మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చి జిల్లాను ఇకపై మట్టి మిద్దెలులేని జిల్లాగా మారుస్తామని హామీలు ఇస్తున్నారే కానీ ఆచరణలో అమలు కాకపోవడంతో పేదలకు వర్షాకాలంలో ఇళ్లల్లో నివసించేందుకు భయం భయంగా గడపాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంటోంది. ఇకనైనా సంబంధిత అధికారుల, పాలకులు జిల్లాలో పాత మిద్దెల్లో నివాసం ఉంటున్న వారిని గుర్తించి ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసి కాపాడాల్సిన అవసరం ఉంది.


అతివృష్టితో ప్రాణనష్టం కాకుండా చర్యలు



మాట్లాడుతున్న మంత్రి కృష్ణబైరేగౌడ

రాయచూరు రూరల్: ఈ ఏడాది రాష్ట్రంలో అధికంగా వానలు కురిసే అవకాశాలున్నందున ప్రాణాలకు ఎలాంటి ఆపద రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి కృష్ణ బైరేగౌడ సూచించారు. ఆయన సోమవారం కలబుర్గి జిల్లాధికారి కార్యాలయంలో క–కలోని ఆరు జిల్లాల జిల్లాధికారులు, ఎస్పీలు, జెడ్పీ సీఈఓలు, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా అతివృష్టి, తాగునీరు, ఇతర అంశాలపై చర్చించారు. వరదలకు ముందు ప్రజలను, పశువులను రక్షించడం ప్రభుత్వ కర్తవ్యమన్నారు. కలబుర్గిలో 135, యాదగిరిలో 80, బళ్లారిలో 19, కొప్పళలో 27, విజయనగరలో 22, రాయచూరులో 70 గ్రామాలు వరద బారిన పడతాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని సూచించారు. రాష్ట్రంలో 1000 మంది గ్రామ లెక్కాధికారులు, 750 మంది సర్వేయర్ల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. కరువు సమయంలో జీవనోపాధి కోసం 18 లక్షల కుటుంబాలకు రూ.500 కోట్ల పరిహారం అందించామన్నారు. కాగా కొందరు జిల్లా స్థాయి అధికారులు సర్కార్ సూచించిన పనులను సక్రమంగా చేయడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు మంత్రికి ఫిర్యాదు చేశారు.

దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ తదితరులు

బళ్లారిఅర్బన్: సమృద్ధ దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకం అని వీవీ సంఘం ప్రముఖులు అల్లం గురుబసవరాజ్ అన్నారు. ఆయన వీరశైవ విద్యావర్ధక సంఘం ఆధ్వర్యంలో హొనగల్ కుమారేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో కొత్తగా మొదటి సంవత్సరంలోకి ప్రవేశం పొందిన విద్యార్థులకు ఘన స్వాగత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి పునాదితో ప్రారంభం అవుతున్న ఈ విద్యాభ్యాసాన్ని సమర్థవంతంగా కొనసాగించి దేశ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కమ్మరచేడు మఠం కల్యాణ స్వామీజీ మాట్లాడుతూ సంస్కారం, వినయం, పెద్దల పట్ల గౌరవం, సామాజిక స్పృహను అలవరుచుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆశీస్సులు అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు బసవరాజ్, కార్యదర్శి అరవింద పాటిల్, కళాశాల ప్రిన్సిపాల్ బీ.శ్రీశైలగౌడ, ఎమ్మెల్సీ వైఎం సతీష్, మేటి పంపనగౌడ, ఎర్రిస్వామి, మహమ్మద్ షరీఫ్, అధికారులు రాజశేఖర్ గౌడ, రవీంద్ర హిరేమఠ పాల్గొన్నారు.

కర్మాగారాలు స్థాపించకుంటే భూములు వెనక్కివ్వండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘాల నేతలు

బళ్లారిఅర్బన్: గతంలో 14 ఏళ్ల క్రితం జిల్లాలోని సండూరు తాలూకా కుడితిని ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు పలు కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం కేఐడీబీ ద్వారా అప్పగించిన సదరు భూములను రైతులకు అప్పగించాలి లేదా ఫ్యాక్టరీలను స్థాపించి బాధిత కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో నగరంలో ప్రదర్శన నిర్వహించి అనంతరం జిల్లాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఈ సమస్యలపై స్థానిక హెడ్‌పోస్టాఫీసు అధికారి నాగరాజ్ ద్వారా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ లేఖల ఉద్యమం సందర్భంగా పోస్టాఫీసు ఆవరణలో లేఖలను పోస్ట్ చేశారు. ఆందోళనలో కర్ణాటక ప్రాంత రైతు సంఘం, సీఐటీయూ జిల్లా సమితి పదాధికారులు పాల్గొని మద్దతు ఇచ్చారు. అనంతరం పోస్టాఫీసు ముఖ్యాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆందోళనలో జంగ్లి సాబ్, కనకప్ప, గోపాల్, సంపత్‌కుమార్, బావి శివకుమార్, గోవర్ధన్‌రెడ్డి, ధర్మణ్ణ, బసవగౌడ, శేఖన్న, రంగరాజు, ఉచ్చప్ప, రాము నణిని తదితరులతో పాటు రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

నాసిరకంగా పనులు చేస్తే చర్యలు

- మంత్రి శివరాజ్ తంగడిగి



ప్రారంభిస్తున్న మంత్రి శివరాజ్ తంగడిగి

గంగావతి రూరల్: అభివృద్ధి పేరుతో నాసిరకంగా పనులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంచార్జి, కన్నడ సంస్కృతి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ ఎస్.తంగడిగి అన్నారు. ఆయన సోమవారం కనకగిరి అసెంబ్లీ నియోజకవర్గం కారటగి తాలూకాలోని ముస్టూరు జీపీలో అభయహస్త ప్రజా సందర్శనలో ప్రజల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ సమస్యలపై సంబంధిత అనుబంధ పత్రాలతో తన దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యత లేని విధంగా రోడ్డు పనులు చేసినా బాధ్యులతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. గత కేడీపీ సమావేశంలో కేఆర్‌డీబీ అధికారులను హెచ్చరించామని ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. సంబంధిత శాఖ అధికారులు పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. ఎక్కడ నాసిరకంగా పని చేసినా అధికారులపై కూడా చర్యలు ఉంటాయన్నారు. తాను చెబుతున్న పనులపై సంబంధిత అధికారుల నుంచి సమాచారం సేకరించి సమీక్షిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా 5 హామీల అమలు కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరణేగౌడ, నాయకులు బసవరాజ నీరగంటి, ముస్టూరు క్యాంప్ జీపీ అధ్యక్షుడు బి.సురేష్, కాంగ్రెస్ యువనాయకులు ఆర్‌పీ.సత్యనారాయణ, ముస్టూరు చిన్ని, శ్రీరామనగర్ చిన్నబాబు, పవన్ కుమార్, బసవన్న క్యాంపు బసవేశ్వరరావు, జంగమర కల్గుడి కాంగ్రెస్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు వట్టికూటి ప్రసాద్, టీపీ మాజీ అధ్యక్షులు బావి ప్రకాష్, రఫీ, శశిధర్ గౌడ, రెడ్డి సూర్యప్రకాశరావు, అధికారులు పాల్గొన్నారు.

లాభాల ఆశ చూపి ఆన్‌లైన్‌లో వంచన

హుబ్లీ: నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు వేర్వేరు ఘటనల్లో రూ.24 లక్షల మేర ఆన్‌లైన్‌లో వంచించిన ఉదంతాలు వెలుగు చూశాయి. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు.. వస్తువులకు రేటింగ్, రివ్యూ ఇస్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆనంద్‌నగర్ రోడ్డు విజయకుమార్ మల్లసముద్ర అనే వ్యక్తి నుంచి రూ.7.74 లక్షలను బదలాయించుకొని వంచించారు. మొబైల్‌లో పరిచయమైన సమీక్ష అనే వ్యక్తిని విజయ్ కుమార్ మొబైల్ నెట్‌వర్క్ నెంబర్ టెలిగ్రామ్ గ్రూప్‌లోకి చేర్పించారు. ఈ క్రమంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశ పెట్టి ఆ మేరకు ప్రారంభంలో లాభాలు వచ్చినట్లుగా విడతల వారీగా కొంత నగదును జమ చేశారు. ఆ తర్వాత తన ఖాతా నుంచి నగదును బదలాయించుకున్నట్లు బాధితుడు వాపోయారు. మరో కేసులో చారిత్రక స్థలాలు, హోటల్, కాలేజీలతో పాటు ఇతర దర్శనీయ స్థలాలకు రేటింగ్, రివ్యూ ఇస్తే ఇంట్లోనే కూర్చొని ఎక్కువ లాభాలు గడించవచ్చని నమ్మించి స్థానిక అక్షయ కాలనీకి చెందిన సుదీర్ ఇజారి బ్యాంక్ ఖాతా నుంచి నగదును బదలాయించుకొని వంచించారు. మొబైల్‌లో పరిచయం అయిన గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ గ్రూప్‌లో చేర్పించారు. అనంతరం దర్శనీయ స్థలాలపై రేటింగ్, రివ్యూలు ఇస్తే ఎక్కువ డబ్బులు వస్తాయంటూ నమ్మించి ప్రారంభంలో రూ.1550 లాభం వచ్చినట్లుగా చూపించారు. ఆ తర్వాత సంస్థ శాశ్వత ఉద్యోగి కావాలంటే ఎక్కువ టాస్క్‌లను కంప్లీట్ చేయడానికి తమ వద్ద డబ్బులు పెట్టుబడి పెట్టాలని నమ్మించి బాధితుడి ఖాతా నుంచి రూ.16.87 లక్షలను కేటుగాళ్లు బదలాయించుకున్నట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మానసిక విశ్వాసం పెంచుకోవాలి

హొసపేటె: ప్రతి ఒక్కరూ తమ బలహీనతలను బలాలుగా మార్చుకుంటే జీవితం తేలికవుతుందని, దీనిపై పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రభుత్వ సంయుక్త పీయూ కళాశాల ప్రిన్సిపాల్ టీ.కొట్రమ్మ తెలిపారు. ఆమె విజయనగర జిల్లా కూడ్లిగి పట్టణంలోని ప్రభుత్వ సంయుక్త పీయూ కళాశాలలో ప్రథమ, ద్వితీయ పీయూసీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఒక రోజు జీవిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ప్రజల ఆధునిక జీవితం యాంత్రికమై పోయిందన్నారు. మనిషి శారీరకంగా కాకుండా మానసికంగా సమస్యలను ఎదుర్కొంటాడన్నారు. ఈ విషయంలో ప్రతికూల భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన జీవిత నైపుణ్యాలను అలవర్చుకోవడం, సహృదయంతో జీవించడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ డాక్టర్ జగదీష్ చంద్రబోస్ మాట్లాడుతూ సానుకూల, ప్రతికూల కారకాలు, జీవితంపై వాటి ప్రభావం, సానుకూలంగా సాధన చేసే అలవాట్లు, మానసికంగా దృఢతకు సానుకూల దృక్పథం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, కోపం నియంత్రణ, లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. తక్కువ ఆదాయంలో పొదుపు చేసే మార్గాలు ముందుగా తెలుసుకోవాలన్నారు. చాలా సార్లు పరీక్షల్లో ఫెయిలైనా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడరాదన్నారు.

చౌకడిపోల పనితీరు సరిచేయండి

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేసే దిశలో చౌకధర అంగళ్లు సక్రమంగా పని చేయడం లేదని మురికి వాడల క్రియా వేదిక కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడారు. బియ్యం, జొన్నలు పంపిణీ చేసే ముందిచ్చే కూపన్లను తమ ఇష్టం వచ్చినప్పుడు పంపిణీ చేస్తున్నారన్నారు. మధ్యాహ్నం, రాత్రి వేళ ఆహార పదార్థాలు ఇవ్వడం, టోకన్లుంటేనే సరుకులిస్తామని చెబుతున్నారన్నారు. చౌకధర దుకాణదారులు సక్రమంగా టోకన్లు, ఆహార పదార్థాలను పంపిణీ చేసేలా చూడాలని కోరుతూ స్థానికాధికారి వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు.

కవయిత్రి సేవలు ఎనలేనివి

రాయచూరు రూరల్: సాహితీవేత్త, కవయిత్రి కమలా హంపన సాహిత్య లోకానికి ధ్రువనక్షత్రం లాంటి వారని సీనియర్ కవి వీర హనుమాన్ పేర్కొన్నారు. ఆదివారం కన్నడ భవనంలో కమలా హంపన స్మృతికి చింతిస్తూ కన్నడ సాహిత్య పరిషత్‌లో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. కమలా హంపన కన్నడ భాషకు ఎనలేని సేవలందించారన్నారు. ఆమె అధ్యాపకురాలిగా, కవయిత్రిగా, నవలా రచయిత్రిగా, పరిశోధకురాలిగా చేసిన సేవలు మరువరానివన్నారు. వెంకటేష్, రావుత్ రావ్, మ్యాదర్, ఈరన్న, విజయ రాజేంద్ర, బషీర్ అహ్మద్‌లున్నారు.

రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులెంతో చెప్పండి



మాట్లాడుతున్న మంత్రి సంతోష్ లాడ్

హుబ్లీ: గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంత మేరకు నిధులు కేటాయించిందో చెప్పాలని జిల్లా ఇంచార్జి మంత్రి సంతోష్‌లాడ్ నిలదీశారు. సోమవారం ఆయన ధార్వాడలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలకు ఎటువంటి అభివృద్ధి నిధులు విడుదల కాలేదన్న ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. రాహుల్ గాంధీ చేతిలో పట్టుకున్న పుస్తకం బైబిల్ అంటూ కర్ణాటక విధాన సభ విపక్ష ఉపనేత అరవింద బెల్లద చేసిన వ్యాఖ్యలపై తగిన విధంగా స్పందించారు. రాహుల్ గాంధీ ఎల్లప్పుడూ రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొనే ఉంటారన్నారు. అలాంటి పుస్తకం ఎమ్మెల్యే అరవింద బెల్లదకు బైబిల్‌గానే కనబడుతుందన్నారు. ఆయన కళ్లను పరీక్ష చేయించుకోవాలని మంత్రి ఘాటుగా సమాధానం ఇచ్చారు. అత్యవసర పరిస్థితి విధించిన రోజును వ్యతిరేక దినంగా బీజేపీ చేపట్టిన కార్యక్రమంపై ఆయన మాట్లాడుతూ వారికి నిరసన తెలిపే హక్కు, అధికారం ఉంది, చేయనివ్వండి అన్నారు. నీట్‌పై మోదీ చేతల గురించి కొద్దిగా మాట్లాడతారా? అని ఎద్దేవా చేశారు. సుమారు 25 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల గురించి కూడా మోదీ మాట్లాడాలన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

బళ్లారిఅర్బన్: కన్నడ సంస్కృతి శాఖ కార్యాలయ ఆవరణలో ప్రతిభాన్విత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఇక్కడి కేంద్ర గ్రంథాలయంలో ఏకలవ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రహ్మానంద స్వామి నేతృత్వంలో 90 మంది విద్యార్థులకు ఈ పురస్కారాలను అందించారు. బ్రహ్మానంద స్వామి మాట్లాడుతూ జ్ఞానంతో పాటు భక్తి కూడా ఉండాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్పొరేటర్ కేఎస్.అశోక్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాశాఖ అధికారి మోహన్ కిషోర్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి విద్యకు ప్రాముఖ్యతను ఇవ్వాలని సూచించారు. ట్రస్ట్ కార్యదర్శి టీ.చంద్రశేఖర్, మల్లికార్జున కుమారుడు దీపక్ తేజ్, వీకే.బసప్ప, కృష్ణమూర్తి, లక్ష్మణ్, అనసూయ, పుష్పలత, కళావతి, గోవర్ధన్, సాయి సంజయ్‌కుమార్, గిరీష్‌కుమార్, మేఘన తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గది దాతకు సన్మానం

హొసపేటె: విజయనగర జిల్లా కొట్టూరు పట్టణంలో కరిబసవేశ్వర స్వామి సతీమణి కెంగసవర వీరమ్మ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన గదిని నిర్మించి విరాళంగా అందించడంతో సోమవారం పాఠశాల సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. కొట్టూరు పట్టణానికి చెందిన తుంబరగుద్ది చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ టీ.సతీష్ మాట్లాడుతూ మనిషిగా సమాజానికి సేవ చేయాలని భావించి ట్రస్టును ప్రారంభించామన్నారు. 2013లో ట్రస్ట్ స్థాపించి ఇంతవరకు దాదాపు 58 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రాక్టీస్‌కు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశామన్నారు. విద్యాశాఖ అనుమతితో రూ.13 లక్షలతో భవనాన్ని నిర్మించి పాఠశాల హెచ్‌ఎం చేతుల మీదుగా అందజేశామన్నారు. యూనిక్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పీఎం ఈశ్వరయ్య, కార్యదర్శి, తాలూకా బీజేపీ రైతు యువమోర్చా అధ్యక్షుడు కే.రుద్రేష్, ట్రస్టీలు పీ.కొట్రేష్, పి.వెంకటేష్, బాలన్న, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్మాస్టర్‌ని తొలగించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, కార్యకర్తలు

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకాలో ఓ ప్రధానోపాధ్యాయుడిని తొలగించాలంటూ గత ఐదు రోజుల నుంచి పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. సోమవారం ప్రభుత్వ హైస్కూలు ముందు ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు చేపట్టిన నిరసన ప్రదర్శనలో సంచాలకుడు రమేష్ మాట్లాడారు. యలగట్ట ప్రభుత్వ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు నాగనగౌడ పాఠశాలకు గైర్హాజరవుతున్నట్లు ఆరోపించారు. గత మూడు నెలల నుంచి విధులకు గైర్హాజరైన నాగనగౌడను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

బస్సులు ఆపాలని రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

రాయచూరు రూరల్: బస్సు సౌకర్యం కోసం సోమవారం జిల్లాలోని మాన్వి తాలూకా కప్పగల్ వద్ద విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. మాన్వి–రాయచూరు రహదారికి అడ్డంగా హైస్కూలు విద్యార్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హైస్కూలుకు వెళ్లాలంటే వేళకు సరిగా సక్రమంగా ఆర్టీసీ బస్సులు రావడం లేదన్నారు. నాన్ స్టాప్ బస్సు అంటూ ప్రతి వాహనానికి బోర్డు పెట్టుకొని ఉదయం పూట బస్ డ్రైవర్లు బస్టాప్‌ల వద్ద బస్సులను నిలపకుండా నేరుగా వెళుతుండటాన్ని ఖండించారు. ఇందువల్ల ఉదయం వేళలో పాఠశాలకు హాజరు కాలేకపోతున్నట్లు వాపోయారు. తమకు బస్‌లను ఆపాలంటూ మూడు గంటల పాటు విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు.

నివేదిక అమలుకు వినతి

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సరోజిని మహిషి నివేదికను అమలు చేయాలని కరవే కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనసుద్దేశించి అధ్యక్షుడు కొండప్ప మాట్లాడారు. కర్ణాటకలో జన్మించి, విద్యనభ్యసించిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని సరోజిని మహిషి 1984లో నివేదికను అందించినా నేటికీ బుట్టదాఖలా చేయడాన్ని ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల కేటాయింపులో ముందు కన్నడిగులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతరులకు ఉద్యోగాలిచ్చి కన్నడిగులకు మోసం చేస్తున్నారని ఆరోపించారు. నివేదికను కట్టుదిట్టంగా జారీ చేయాలని కోరుతూ స్థానికాధికారి వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు.

విమానాశ్రయానికి బాంబు బెదిరింపు



సోదా చేస్తున్న బాంబ్ నిష్క్రియ దళం

రాయచూరు రూరల్: కలబుర్గి విమానాశ్రయానికి బాంబు పెట్టినట్లు ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ బెదిరింపు వచ్చిన ఘటన సోమవారం జరిగింది. దీంతో విమానాశ్రయంలో బాంబ్ స్క్వాడ్ నిష్క్రియ దళం, జాగిలంతో పోలీసులు తనిఖీ చేపట్టారు. ప్రయాణికుల బ్యాగ్‌లను మూడు గంటల పాటు సోదాలు చేశారు. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు సమాచారం అందిందని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ చిలకా మహేష్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ఈ మెయిల్ రావడంతో అందరూ జాగ్రత్తలు పాటించామన్నారు. బెంగళూరు నుంచి వచ్చిన రెవిన్యూ శాఖా మంత్రి కృష్ణబైరేగౌడతో పాటు ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ విషయంపై మంత్రి మాట్లాడుతూ ఇలాంటిది ఉత్తుత్తి బెదిరింపు అన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

బళ్లారి అర్బన్: సాధారణ ఉపాధ్యాయులకు, పీఈటీ వ్యాయామ ఉపాధ్యాయులకు గల వ్యత్యాసాన్ని సరిదిద్దడంతో పాటు పీఈటీలకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలి తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాధ్యక్షుడు చౌడప్పనవర ఆదేశం మేరకు సోమవారం విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. తమ సమస్యలను సకాలంలో పరిష్కరించకపోతే ఈ ఏడాది నిర్వహించే క్రీడా పోటీలను బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని సంఘం జిల్లాధ్యక్షుడు టీహెచ్ఎం విరుపాక్షయ్య తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వీరణ్ణగౌడ, పశ్చిమ జోన్ ఇన్‌చార్జి తిప్పేస్వామి, దక్షిణ విభాగం ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంట్రాక్ట్ పద్ధతిపై ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఏడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్షయగౌడ పేర్కొన్నారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ విషయంలో మీనమేషాలు లెక్కించడం తగదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలను కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా భర్తీ చేసే ప్రక్రియ సాగుతోందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడానికి సర్కార్ పునరాలోచించాలన్నారు. ఏజెన్సీల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను కొనసాగేలా చూడాలన్నారు. సమయానికి వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, జీపీఎఫ్‌లు చెల్లించాలన్నారు.